thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 73 కరీంనగర్ శనివారం, 24 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నంబాల ఎన్‌కౌంటర్‌ను ఖండించిన సీపీఎం

న్యూఢిల్లీ : ఛత్తీసగఢ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌ను సీపీఎం తీవ్రంగా ఖండించింది. మావోయిస్టులు చర్చల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం, ఛత్తీసగఢ్ ప్రభుత్వం పట్టించుకోలేదని సీపీఎం పాలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కారానికి ప్రయత్నించకపోగా అమానుష హత్యాకాండకు పాల్పడడమే తమ విధానంగా మార్చుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. మావోయిస్టులను అంతం చేస్తామంటూ కేంద్ర హోం మంత్రి డెడ్‌లైన్ ప్రకటిస్తుండడం, చర్చల అవసరం లేదని ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రి చెబుతుండడం వారి ఫాసిస్టు మనస్తత్వానికి నిదర్శనమని, వారి తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొంది.




# మీరొస్తే ఇంకా అద్భుతాలు చేద్దాం

## జహీరాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

సంగారెడ్డి/జహీరాబాద్: ప్రతిపక్ష రాజకీయ నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని తమకు చెప్పాలన్నారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా? అని ప్రశ్నించారు. ఇవాళ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. తన ఇంట్లో మాత్రం ఉద్యోగాలు ఇచ్చుకొని నిరుద్యోగులను ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని సీఎం అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ప్రధాన మంత్రిని ఎన్ని సార్లయినా కలుస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామని, మిగతా వేళల్లో అందరినీ కలుపుకొని పోతామని చెప్పారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం పునరుద్ఘాటించారు. శాసన సభలో ప్రజా సమస్యలపై చర్చించాలని అన్నారు. తాము ఏదైనా తప్పను చేస్తే సూచనలు, సలహాలు ఇవ్వాలని సరిదిద్దుకుంటామని అన్నారు. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తామని అనుకుంటే ప్రజలు మరోమారు బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. గెలించినా ఓడినా తాను ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నానని అన్నారు. సీఎం అయ్యాక కూడా తాను ఏనాడూ అహంభావాన్ని ప్రదర్శించలేదని చెప్పారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరినీ కలుస్తూనే ఉన్నానని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని సీఎం చెప్పారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు కోసం ప్రధాని మోడీని ఎన్ని సార్లు అయిన కలుస్తామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే మనకే వాసన వస్తుందని.. ఒకాయన అలాగే అలిగి ఫామ్ హౌస్ లో పడుకున్నారని తీవ్రంగా విమర్శించారు. నేను మీ కోసం పని చేస్తా... కష్టపడుతానన్నారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. "జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా. వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు... ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం. %దీఎజూ, దీణూ, చీ×ఫ్గీ%, ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాం." అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**నిమ్జ్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు...** నిమ్జ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిర్వాసితులైన 5612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఈ వేదిక నుంచి ప్రకటిస్తున్నట్టు సీఎం చెప్పారు. నిర్వాసిత కుటుంబాలకు భోజనాలు పెట్టి ఇండ్ల పట్టాలు ఇచ్చే బాధ్యత జగ్గారెడ్డికి అప్పగిస్తున్నామని చెప్పారు.

ఇండ్లు మంజూరు చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నానని సీఎం చెప్పారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.




## కూకట్‌పల్లిలో డాక్టర్‌కు పాజిటివ్..

# బి కేర్ ఫుల్

యావత్ ప్రపంచాన్నీ వైరస్‌తో వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ జడలు విప్పుతోన్న సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలో గత నాలుగు రోజులుగా అక్కడక్కడా కరోనా మాట వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, తాజాగా తెలంగాణలో కరోనా కేసు నమోదు నమోదైంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఒక డాక్టర్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, చైనాలో పుట్టి ప్రపంచమంతటా విస్తరించిన కరోనా వైరస్ (కోవిడ్ 19) తెలంగాణలో మొదటి సారిగా 2020 మార్చి 2న తొలి కరోనా వైరస్ కేసు నమోదైంది. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కి వచ్చిన ఓ వ్యక్తికి కరోనా వైరస్ ఉందని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా కరోనా వైరస్ కేసులు లక్షల్లో నమోదుకావడం, రెండు సార్లు లాక్ డౌన్లతో మొత్తం జనజీవనం స్థంభించిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఈ వైరస్ భారిన పడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికా కరోనాతో కకావికలమైంది. ఎటు చూసినా శవాల కుప్పలు దర్శనమిచ్చాయి.

# వాతావరణ శాఖ శుభవార్త...




తెలంగాణ గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో వానలు పడతాయని తెలిపింది. హైదరాబాద్లో మాత్రం పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ తెలియజేసింది. మరోవైపు ఉక్కపోతుతో అల్లాడుతున్న తెలంగాణ వాసులకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. ఈ నెల 28 లోపు తెలంగాణను నైరుతి ఋతుపవనాలు తాకుతాయని అంచన వేసింది. నైరుతి రుతుపవనాల రాకతో ఎండాకాలం దాదాపు ముగిసినట్టే అని చెప్పాలి. ఈ సారి తెలంగాణలో ఎండాకాలం రోహిణి కార్తె రాకముందే ముగయనుంది. తెలంగాణపై ఋతుపవనాల ప్రభావంతో పాటుగా అల్పపీడన ఎఫెక్ట్ కారణంగా రానున్న 10 రోజులు విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. వానల ప్రభావం జూన్ మొదటి వారం వరకు ఉంటుందని ఆ తర్వాత వానలకు కాస్తం బ్రేక్ పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గత వారం రోజుల నుంచి తెలంగాణలో చాలా చోట్ల కూడా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఇటు బంగాళా ఖాతంలో ఏర్పడినటువంటి ద్రోణిప్రభావం వలగా తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇన్నాళ్ళు వేడి ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు గత నాలుగైదు రోజుల నుంచి ఉన్నటువంటి ఈ వాతావరణంలో మార్పు వల్ల చల్లదనంతో కాస్తంత రిలాక్స్ అవుతున్నారు. తెలంగాణ పై ఋతుపవనాల ప్రభావంతో పాటు అల్పపీడన ఎఫెక్టు పడింది. ఇది మరొ వారం 10 రోజుల పాటు ఉండే అవకాశం ఉంది. నాలుగైదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ సిటీలోని కొన్ని ప్రాంతాలతో పాటు అటు పెద్దపల్లి, మంచిర్యాల, ములుగు, జయశంకర్ భూపాల్ పల్లి, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాలో వర్షపాతం ఎక్కువగా నమోదయింది. వర్షాల వల్ల కల్లాల్లో రైతులు ఎండబెట్టిన ధాన్యం తడిసి ముద్దైయింది. వర్షానికి కూడా వడ్లు కొట్టుకపోవడంతోటి అన్నదాతలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. నిర్మల్ జిల్లాకు సంబంధించినటు వంటి ఖానాపూర్ అలానేసారంగపూర్ కడెం ఈ మండలాల్లో బైంసా ఈ మండలాల్లో భారీగా వర్షం నమోదయింది. మరోవైపు తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండాకోతలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఈదురుగాలతో పాటు పిడుగులు ఉరుములు, మెరుపులతో కూడా చాలా ప్రాంతాలు దద్దరిల్లుతున్నాయి. ఈదురు గాలి ప్రభావం వలన పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్థంభించిపోయింది. వెంటనే అప్రమత్తైమన అధికారులు ఎప్పటికపుడు రోడ్డుపై పడ్డ వృక్షాలను తెలిగించే పనిలో పడ్డారు. ఓవరాల్ గా అయితే మరొక నాలుగైదు రోజుల పాటు తెలంగాణతో పాటు హైదరాబాద్ సిటీలో కూడా వర్షపాతం పడే అవకాశం ఎక్కువగా ఉంది. ఇందుకు తగ్గట్టుగా అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించింది.




న్యూఢిల్లీ: ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి పగ్గాలు చేపట్టి జూన్ 9 నాటికి ఏడాది పూర్తి కానున్న సందర్భంగా దేశమంతటా కార్యక్రమాలు చేపట్టేందుకు బీజేపీ ప్లాన్ చేస్తున్నది. మోదీతో మెగా ర్యాలీలు, కేంద్రమంత్రులతో పాదయాత్రలు నిర్వహించాలని భావిస్తున్నది. ఈ కార్యక్రమాలను ఫైనల్ చేసేందుకు కమిటీని నియమించింది. కేంద్రమంత్రులు తమ నియోజకవర్గాల్లో పాదయాత్ర నిర్వహించేలా ప్లాన్ రూపొందించామని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. వాళ్లు ప్రతి వారంలో రెండ్రోజులు 20 నుంచి 25 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహిస్తారని తెలిపాయి.

# 'ఇల్లు చక్కబిద్దుతోన్న రేవంతుడు'

## జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో సీఎం మీటింగ్ పై సర్వత్రా చర్చ

## లోకల్ బాడీ ఎన్నికలకు గ్రౌండ్ రిపోర్ట్ రెడీ చేస్తున్నట్లేనా?




## చర్చనీయాంశంగా మారిన ముఖ్యమంత్రి రివ్యూలు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల వారీగా రివ్యూలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో విడివిడిగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే మూడు జిల్లాల రివ్యూలు పూర్తయ్యాయి. సమస్యలు ఏం ఉన్నాయ్..? ఏం చేద్దాం..? మీ పనితీరు ఎలా ఉంది.. ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది? అంటూ ఆరా తీస్తున్నారని సమాచారం. ఎమ్మెల్యేల ఆలోచనలేంటో చెప్పాలని కోరుతున్నారు. ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాసంబంధ అవసరాలు, బాధలు వినేందుకు తాను సిద్ధమంటున్నారు. ఇప్పటి వరకు నాగర్ కర్నూల్, మేడ్చల్ మల్కాజ్ గిరి, మెదక్ జిల్లాల ఎమ్మెల్యేలతో మాట్లాడారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా భేటీ అయినట్టు తెలిసింది. ప్రతి ఎమ్మెల్యేతో 10 నుంచి15 నిమిషాలపాటు మాట్లాడిన సీఎం ఎమ్మెల్యేల అభిప్రాయాలను వినడంతోపాటు వారికి దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకురావాలని, కాంగ్రెస్ నుంచి గెలిచిన ప్రతి ఎమ్మెల్యే తనకు సమానమేనని, అందరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు.

**పంచాయతీ ఎన్నికల కోసమేనా....** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతన్నట్టుగా కనిపిస్తోంది. ఇందులో భాగంగానే సీఎం జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారని, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నారని సమాచారం. ఈ క్రమంలోనే సర్పంచులకు ప్రభుత్వం బకాయి పడి ఉన్న బిల్లులను రిలీజ్ చేసిందని సమాచారం. రూ. 10 లక్షల లోపు ఉన్న బిల్లులను ప్రభుత్వం రిలీజ్ చేసింది. మొన్న ఒక్క రోజే 153 కోట్ల రూపాయలు పెండింగ్ బిల్లులను ప్రభుత్వ విడుదల చేసింది. త్వరలోనే రైతు భరోసా వేసేందుకు కూడా సిద్ధమవుతోందని సమాచారం. జూన్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహిస్తే ఎలా ఉంటుందనే ప్రస్తావన కూడా ఈ సందర్భంగా వచ్చినట్టు సమాచారం. మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుందనే చర్చ ఉంది.

**సీఎం దగ్గర ఇంటెలిజెన్స్ రిపోర్ట్....** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా ఇంటెలిజెన్స్ రిపోర్టు ను తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే పలు హామీలను అమలు చేసిన దరిమిలా గ్రౌండ్ రిపోర్ట్ ఏమిటన్న అంశంపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించారని తెలుస్తోంది.

ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అవుతూ.. స్థానిక అంశాలపై చర్చిస్తూ వాటిని పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న క్రమంలో వారి పనితీరుపైనా చర్చ జరుగుతోందని సమాచారం.

# అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తా: సీఎం రేవంత్‌రెడ్డి



పస్తాపూర్: మెదక్ అంటే ఇందిరమ్మ.. ఇందిరమ్మ అంటే మెదక్ అని, ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పస్తాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ నిలవాలని కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నారాయణ్‌ఖేడ్ అభివృద్ధికి ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. "పటాన్‌చెరు ప్రాంతం మినీ ఇండియా లాంటిది. ఈ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రధానిగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగింది. సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా అమలు చేశాం. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం. అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేసేలా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర సాయం తీసుకుంటాం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధిని సాధించగలం. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తా. ఎవరేం అనుకున్నా నాకు ఇబ్బంది లేదు. చక్కెర పరిశ్రమ కోసం సహకార సంఘం ఏర్పాటు చేసుకుంటే.. నిమ్జ్‌లో 100 ఎకరాలు కేటాయించడంతోపాటు నిధులు కూడా మంజూరు చేయిస్తా" అని సీఎం అన్నారు.




# మాస్కోలో డ్రోన్ దాడి.. భారత ఎంపీల విమానం గాల్లో..!

పాకిస్థాన్‌కు మూడు చెరువుల నీళ్లు తాగిస్తోంది భారత్. తమతో పెట్టుకుంటే ఎట్లుంటదో శత్రుదేశానికి చూపిస్తోంది. ఉగ్రవాదం, జమ్మూ కశ్మీర్ విషయంలో తగ్గేదేలే అని అంటోంది. పహల్గాం దాడి ఉదంతం తర్వాత నుంచి ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ విషయంలో ఇండియా పూర్తి కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్‌తో ఆ దేశానికి వెన్నులో వణుకు పుట్టించింది. భారత్‌తో యుద్ధం కాదు కదా, ఇటు వైపు ఒక్క తూటా పేల్చాలన్నా ఒకటికి పది సార్లు ఆలోచించుకునేలా చేసింది.

ఇక్కడితో ఆగని భారత్.. దౌత్య యుద్ధంతో అంతర్జాతీయంగా పాక్‌ను ఏకాకిని చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా శత్రుదేశ దుశ్చర్యలను ఎండగట్టేందుకు మన దేశ విధానాన్ని వివరించేందుకు ఎంపీల బృందాలను విదేశాలకు పంపుతోంది. అయితే ఈ క్రమంలో రష్యా వెళ్లిన మన ఎంపీల బృందానికి అనుకోని చిక్కు వచ్చిపడింది. సరిగ్గా భారత ఎంపీల విమానం అక్కడ ల్యాండ్ అయ్యే సమయంలో రష్యా మీద డ్రోన్ దాడి చేసింది ఉక్రెయిన్. ఆ తర్వాత ఏం జరిగిందో ఇప్పుడు చూద్దాం..

**సిగ్నల్ రావడంతో..** డ్రోన్ అటాక్ కారణంగా భారత ప్రతినిధి బృందం ప్రయాణిస్తున్న విమానం ల్యాండ్ అవ్వలేదు. రష్యా రాజధాని మాస్కో మీదుగా ఆ ఫ్లైట్ చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. డ్రోన్ దాడుల కారణంగా మాస్కోలోని అన్ని ఎయిర్‌పోర్ట్‌లలో విమానాల కదలికలు నిలిచిపోయాయి. దీంతో భారత ఎంపీల విమానం చాలా సేపు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఆఖరుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో మాస్కోలో ఆ విమానం ల్యాండ్ అయింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అఖిలపక్ష బృందాన్ని మాస్కోలోని భారత రాయబారి వినయ్ కుమార్ ఘనంగా స్వాగతించారు. కాగా, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి రష్యా సర్కారుతో పాటు అక్కడి ఎంపీలు, అధికారులు, నిపుణులకు సమాచారం అందించనున్నారు భారత ఎంపీలు. రష్యాతో ఇండియాకు ఇప్పటికే బలమైన సంబంధాలు ఉన్నాయని ఎంపీ కనిమొళి అన్నారు. పాక్ టెర్రరిస్టులు మొత్తం ప్రపంచానికి ముప్పుగా మారారని, ఇదే విషయాన్ని తాము రష్యాకు వివరంగా చెబుతామన్నారు.




# ఆ లేఖకు, కవితకు సంబంధమే లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాజీ సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు.

ఈ సందర్భంగా శుక్రవారం మంత్రి మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్‌రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని, ఆ లేఖకు, కవితకు సంబంధమే లేదని అన్నారు. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని, ఆర్టిఫిషియల్ లేఖను కూడా సరిగా రాయలేకపోయారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బీజేపీతో కలుస్తుందని, 20 లేదా 30 సీట్లలోనే బీఆర్ఎస్ పోటీ చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

**వందేళ్లయినా కేసీఆర్ కుటుంబం కలిసే ఉంటుంది..** కేసీఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా అని, వందేళ్లయినా కేసీఆర్ కుటుంబం కలిసే ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకు లేదన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని అన్నారు. వరంగల్‌లో కేసీఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని.. వాట్సాప్‌లో మెసేజ్ పెడితే... తన కోసం పది లక్షల మంది వస్తారని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

# భారత సైన్యాన్ని మెచ్చుకున్న అమిత్ షా.. అసలు కారణమిదే..




ఢిల్లీ: దేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు అమిత్ షా.

**ఉరీ, సర్జికల్ స్ట్రైక్...** 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రైక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ స్ట్రైక్ ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది.

**పుల్వామా ఎయిర్ స్ట్రైక్...** ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రైక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది.

# జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన



జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. హుగ్గెల్లి కూడలిలో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాచునూరులో కేంద్రీయ విద్యాలయం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్ చేరుకున్నారు.

అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణంలో రూ.494.67 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అక్కడ మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు.

# ఎస్-400 ముందస్తు డెలివరీ కోసం.. రష్యాకు దోభాల్..!



ఢిల్లీ: జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ వచ్చేవారం రష్యాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. మే 27 నుంచి 29 వరకు భద్రతా వ్యవహారాల ఉన్నతస్థాయి ప్రతినిధుల 13వ అంతర్జాతీయ సమావేశం జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు డోభాల్ మాస్కోకు వెళ్లనున్నట్లు సమాచారం. ఇదే పర్యటనలో ఆయన రష్యా వద్ద పెండింగ్‌లో ఉన్న ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల ముందస్తు డెలివరీ అంశంపై చర్చించనున్నారట. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 'ఆపరేషన్ సిందూర్'తో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ డోభాల్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' సమయంలో మన ఎస్-400 కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. వైమానిక, క్షిపణి దాడులకు దిగితే నిలువరించే అత్యంత శక్తిమంతమైన ఆయుధ వ్యవస్థ ఎస్-400. శత్రువుల యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో నేలకూల్చగలదు. ప్రత్యర్థి జామింగ్ విధానాలను కూడా తట్టుకోగలదు. వీటిని రష్యాకు చెందిన ఎన్‌పీవో అల్మాజ్ సంస్థ అభివృద్ధి చేసింది. మొత్తం ఐదు ఎస్-400 క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు 2018లో భారత్-రష్యా మధ్య ఒప్పందం కుదిరింది. ఈ డీల్ విలువ దాదాపు రూ.35వేల కోట్లు. ఇప్పటివరకు మూడు వ్యవస్థలు భారత్‌కు చేరగా.. మిగతా వాటిని 2026 ఆగస్టు నాటికి అందించే అవకాశాలున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, అంతకంటే ముందుగానే వీటిని డెలివరీ చేసేలా డోభాల్ మాస్కోతో చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం వినియోగిస్తోంది. పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే ముప్పు కోసం పంజాబ్‌లో, రాజస్థాన్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఎస్-400 వ్యవస్థలను మోహరించినట్లు తెలుస్తోంది. చైనా నుంచి రక్షణ కోసం అరుణాచల్‌ప్రదేశ్ లేదా అస్సాంలో ఒక వ్యవస్థను రంగంలోకి దించి ఉంటారని అంచనా. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ ఎస్-400 వ్యవస్థలను ధ్వంసం చేశామంటూ పాక్ అసత్య ప్రచారం చేయగా.. ప్రధాని మోదీ ఫొటోతో దాయాదికి గట్టి కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మన రక్షణ వ్యవస్థ సురక్షితంగా ఉందని ఆర్మీ కూడా స్పష్టం చేసింది.

# కేటీఆర్ ఆరోపణలపై స్పందించిన కాంగ్రెస్




హైదరాబాద్: మేడిగడ్డను కాంగ్రెస్ వాళ్లే బాంబులతో పేల్చి ఉండొచ్చన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిటీ వచ్చే నెల 5న విచారణకు రావాలని ఇప్పటికే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చింది. తాజాగా కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీబీఐతో విచారణ జరిపించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న సమయంలో సీబీఐకి ఇచ్చే అంశంపై.. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటోంది. మేడిగడ్డ కుంగుబాటుపై మహదేవ్‌పూర్ ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

**కాంగ్రెస్ వాళ్లే కారణం...** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లకు కాంగ్రెస్ వాళ్లే కారణం కావొచ్చని, వాళ్లే బాంబులు పెట్టారన్న అనుమానం కలుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. బ్యారేజీలో కేవలం రెండు చోట్ల పగుళ్లు వస్తే.. ఏదో అయిపోయినట్టు చేస్తున్నారని ఆరోపించారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో జరిపిన ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ పలు అంశాలను ప్రస్తావించారు. "కాసుల కక్కుర్తితో కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు కూల్చాలని.. మళ్లీ టెండర్లు పిలిచి 20శాతం నుంచి 30శాతం కమీషన్లు తీసుకోవాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి అసలు ఎజెండా. ప్రజాపాలన కమీషన్ల పాలనగా మారింది. కాంగ్రెస్ మంత్రుల కమీషన్ల వ్యవహారం ప్రజల్లోకి వెళ్లడంతో.. వారి దృష్టి మళ్లించేందుకే నోటీసుల పేరిట తమాషాలు చేస్తున్నారు.." అని ఆరోపించారు. లొట్టపీసు కేసులతో రేవంత్‌రెడ్డి చేసేదేమీ లేదని, ఇప్పటివరకు ఆయన పెట్టిన కేసులన్నీ తేలిపోయాయని వ్యాఖ్యానించారు. విచారణ పూర్తయిందని, నివేదికను సిద్ధం చేశామని జస్టిస్ ఘోష్ చెప్పారని... ప్రభుత్వం మళ్లీ గడువు ఎందుకు పొడిగించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, హరీశ్‌రావులకు కమిషన్ నోటీసులు టైమ్‌పాస్ కోసమేనని పేర్కొన్నారు. అయితే కేసీఆర్‌కు నోటీసులు నేరుగా అందినట్టు సమాచారం లేదని, అందిన తర్వాత ఏంచేయాలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

**సుప్రీంకోర్టు సాక్షిగా తేలిపోయింది..** బీజేపీ, కాంగ్రెస్ కలసి కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, నికృష్ట రాజకీయాలకు పాల్పడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం సుప్రీంకోర్టు సాక్షిగా తేలిపోయిందని, కాళేశ్వరంపై కూడా నిజం నిలకడగా బయటపడుతుందని చెప్పారు. "సీఎం రేవంత్‌రెడ్డిలో అపరిచితుడున్నారు. ఆయన మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఒక్క రూపాయి కూడా లేదంటారు. అప్పు కోసం వెళితే అందరూ దొంగల్లా చూస్తున్నారంటారు. అలాంటిది అందాల పోటీల కోసం రూ.200కోట్లు ఖర్చుపెట్టడం సరైనదేనా?"అని ప్రశ్నించారు.

మిస్‌వరల్డ్ పోటీదారులకు మంత్రులు టూరిస్ట్ గైడ్లలా మారారంటూ, సొంగకార్చుకుంటూ అందాల పోటీలో పాల్గొంటున్నారంటూ సీపీఐ నారాయణ విమర్శించారని గుర్తుచేశారు. అకాల వర్షంతో పంటలు దెబ్బతిని, ధాన్యం తడిసి రైతులు కష్టాలు పడుతున్నా.. హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగినా పట్టించుకోని రేవంత్‌రెడ్డి.. అందాల పోటీలకు నాలుగు సార్లు వెళ్లివచ్చారని విమర్శించారు. మిస్ వరల్డ్ ఫ్లెక్సీలో రేవంత్, భట్టి, జూపల్లి ఫోటోలున్నాయని.. వీరిలో మిస్‌వరల్డ్ ఎవరో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

# టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలతో దిగ్భ్రాంతి చెందా..




హైదరాబాద్: పాలమూరు -రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ప్రాజెక్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేయడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో తాను దిగ్భ్రాంతి చెందానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఇది సుప్రీంకోర్టును మాత్రమే కాదు.. భారత రాజ్యాంగాన్ని కూడా కించపరచడమేనని, రాజకీయ ప్రయోజనాల కోసం సుప్రీంకోర్టు తీర్పులపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేయడం దురదృష్టకరమని అన్నారు. కంచ గచ్చిబౌలి అటవీ సమస్య అయినా లేదా పాలమూరు ప్రాజెక్ట్ కేసు అయినా ఇప్పుడు సమయం కావచ్చునని అన్నారు. తన పార్టీ కోర్టులకు లోబడాలా.. వద్దా అనేది రాహుల్ గాంధీ నిర్ణయించుకుంటారని అన్నారు. మీ నాయకులకు దేశ న్యాయ వ్యవస్థ పట్ల గౌరవం లేనప్పుడు రాజ్యాంగ కాపీతో "న్యాయ్ యాత్రలు" చేయలేరని కేటీఆర్ అన్నారు. "మహేష్ కుమార్ గౌడ్ గారు.. మీ నాయకుడు రాహుల్ గాంధీ న్యాయ యాత్రలు చేస్తుంటారు.. మీ కాంగ్రెస్ నాయకులు మాత్రం న్యాయాన్ని, కోర్టులను, తీర్పులనూ అపహాస్యం చేస్తుంటారు.. మీకు అనుకూలం కాకుంటే అది నిజం కాదు.. మీకు నచ్చకపోతే అది న్యాయం కాదు.. నేషనల్ హెరాల్డ్ కేసులో రేపు ఒకవేళ కోర్టులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు అనుకూలంగా తీర్పు ఇస్తే%ా%. తప్పు అని చెప్తారా.. కంచె గచ్చిబౌలి అయినా, పాలమూరు ప్రాజెక్ట్ అయినా.. మీ తప్పులు ఎత్తి చూపిస్తే కోర్టు తీర్పులను అపహాస్యం చేస్తారా" అని కేటీఆర్ ప్రశ్నించారు.




హైదరాబాద్, మే 23: చీటింగ్ కేసులో శ్రవణ్ రావును పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. అఖండ సంస్థను మోసం చేసిన వ్యవహారంపై సీసీఎస్ పోలీసులు ఆరా తీస్తున్నారు. రూ.6.58 కోట్లపై ప్రశ్నించడంతో పాటు బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు. చీటింగ్ కేసులో శ్రవణ్ రావును నాంపల్లి కోర్టు ఒక్కరోజు పాటు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో చంచల్ గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న శ్రవణ్ రావును ఈరోజు (శుక్రవారం) సీసీఎస్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కాగా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కుంటున్న శ్రవణ్ రావుపై చీటింగ్ కేసు నమోదు అయ్యింది. అఖండ సంస్థకు కోట్లలో నష్టం కలిగించడంతో పాటు మోసానికి పాల్పడ్డారంటూ బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎకోర్ ఇండస్ట్రీ నుంచి ముడి ఇనుమును కొనుగోలు చేస్తే టన్నుకు భారీగా లాభం ఉంటుందంటూ అఖండ ఎంటర్ ప్రైసెస్ సంస్థ నుంచి రూ. రూ.6.58 కోట్లు తీసుకుని మోసానికి పాల్పడ్డాడు శ్రవణ్ రావు. అయితే డబ్బులు తీసుకున్నాక కట్టకుండా అమెరికాకు పారిపోయాడంటూ అఖండ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శ్రవణ్‌రావుపై పోలీసులు కేసు నమోదు చేసి ఈనెల 13న అరెస్ట్ చేశారు. ఆపై జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో శ్రవణ్ రావుకు సంబంధించిన బ్యాంక్ లావాదేవీలు, ఆయన కంపెనీకి సంబంధించిన ఆర్థిక పరమైన లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇదే కేసులో శ్రవణ్ రావుతో పాటు ఆయన భార్య స్వాతి రావును కూడా చేర్చారు. ఈ కేసులో శ్రవణ్ రావు భార్య ఏ4 నిందితురాలిగా ఉన్నారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు నిందితుడిని ఐదురోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు. వాదనలు విన్న న్యాయస్థానం నిందితుడిని ఒక్క రోజు పాటు కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో నేడు శ్రవణ్‌రావును పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఈరోజు సాయంత్రం 5:30 గంటల వరకు శ్రవణ్ రావును విచారణ జరుపనున్నారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన తర్వాత జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించే అవకాశం ఉంది.

# నంబళ్ల.... మూడేళ్ళ క్రితం ఆంగ్ల పత్రిక కు ఇచ్చిన ఇంటర్వ్యూ..

## మావోయిస్ట్ చీఫ్ బసవరాజు ఇంటర్వ్యూ సారంశం...



**(నోట్: సీపీఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు విదేశీ పాత్రికేయుడికి ఇచ్చిన తొలి ఇంటర్వ్యూను పాఠకులకు పరిచయం చేస్తున్నాం. జర్నలిస్టు అల్ఫ్ బ్రెనన్ అడిగిన ప్రశ్నలకు కామ్రేడ్ బసవరాజు చాలా సవివరమైన సమాధానాలు ఇచ్చాడు. వాటిని సంక్షిప్తీకరించి అందిస్తున్నాం. పూర్తి పాఠాన్ని చదవడం ద్వారా పార్టీ అవగాహనను సమగ్రంగా అర్థం చేసుకోగలుగుతారు. సం. )**

ప్ర. భారతదేశంలో ఏ ఉత్పత్తి విధానం ఉందని మీ పార్టీ నిర్ధారిస్తుంది? అర్ధభూస్వామ్యమా, లేదా పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానమా? కామ్రేడ్ బసవరాజు: నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ వెల్లువకు తొలిసంబంలోనే కామ్రేడ్ సీఎం, కామ్రేడ్ కేసీఎం నాయకత్వంలో విప్లవ కమ్యూనిస్టులు ఎంఎల్ఎం సిద్ధాంత వెలుగులో భారతదేశంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి ఇక్కడ ఉన్న వర్గ వైరుధ్యాలను నిర్దిష్టంగా విశ్లేషించారు. భారతదేశం ఒక అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ అనీ, ఇక్కడ విప్లవ మార్గం దీర్ఘకాల ప్రజాయుద్ధంగా వుంటుందనీ, ముందుగా నూతన ప్రజాస్వామిక విప్లవ దశను పూర్తి చేసి సోషలిస్టు దశకు పురోగమిస్తుందని నిర్ధారించారు. మా ఐక్య పార్టీ సీపీఐ (మావోయిస్టు) ఈ రాజకీయ, మిలిటరీ పంథాను కొనసాగిస్తున్నది. మా దేశం పెట్టుబడిదారీ సమాజమా? లేక అర్ధవలస–అర్ధభూస్వామ్య సమాజమా? అనే విషయంపై మార్క్సిస్టుల్లో, రివిజనిస్టులు, నయా రివిజనిస్టులలో, బూర్జువా మేధావులలో, ఎన్జీఓలలో పెద్ద ఎత్తున చర్చలు, వివాదం నడుస్తున్న నేపథ్యంలో 2011 నుండి వివిధ రాష్ట్రాల్లో మా పార్టీ చేపట్టి నిర్వహించిన ఉత్పత్తి సంబంధాల అధ్యయనాల రిపోర్టులను విశ్లేషించి, సంశ్లేషించి డిసెంబర్ 2020లో జరిగిన మా కేంద్రకమిటీ 6వ కొనసాగింపు సమావేశం "భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు, మన రాజకీయ కార్యక్రమం" పేరుతో ఒక వివరమైన దస్తావేజును జారీచేసింది. ఈ దస్తావేజులో మా దేశం ఇప్పటికీ అర్ధవలస–అర్ధభూస్వామ్య సమాజంగానే కొనసాగుతున్నదని నిర్ధారించాం. అయితే సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య అనుకూల విస్తృత పెట్టుబడిదారీ మార్పులు గణనీయంగానే జరిగాయని చెప్పాం. అందుకనుగుణంగా ఎత్తుగడలను రూపొందించుకునేలా మా రాజకీయ కార్యక్రమాన్ని పొందుపరిచాం. బహుశా ఈ దస్తావేజును మీరు చూసే వుంటారు. 1947 తర్వాత మా దేశ ఆర్థిక, రాజకీయ నియంత్రణ ప్రధానంగా మొదట బ్రిటన్, అమెరికా చేతిలోకి, తర్వాత సోవియట్ సామ్రాజ్యవాదం చేతిలోకి తిరిగి మళ్ళీ అమెరికా చేతిలోకి మారింది. మా దేశంపై ఆర్థికంగా, రాజకీయంగా వివిధ స్థాయిల్లో, వివిధ సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యం కొనసాగుతున్న ఫలితంగా భారత సమాజం అనేక సామ్రాజ్యవాద శక్తుల పరోక్ష పాలనా, దోపిడీ, ఆజమాయిషీలో వున్న అర్ధవలస–అర్ధభూస్వామ్య వ్యవస్థగా మార్పు చెందింది. 1947 నుండి గత 75 సంవత్సరాలుగా సామ్రాజ్యవాదుల, దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలకు అనుగుణంగానే అనేక వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగ విధానాలు, బూటకపు భూసంస్కరణలు, పంచవర్ష ప్రణాళికలు, హరిత విప్లవం తదితరాలన్నీ అమలు చేయబడ్డాయి. ఆ తర్వాత ఎల్పీజీ విధానాల అమలులోకి వచ్చాయి. డిసిఇన్వెస్ట్మెంట్, డిఇండస్ట్రియలైజేషన్, డిరెగ్యులేషన్లు అమలులోకి వచ్చాయి. పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో పబ్లిక్ రంగ సంస్థలను కారుచౌకగా సామ్రాజ్య వాదులకు, దళారీ పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారు. దీనితో అసంఘటిత రంగం, ప్రైవేట్ రంగం ప్రధాన రంగాలుగా మారాయి. కార్మికుల శ్రమ దోపిడీ మరింత తీవ్రమైంది. వారు పోరాడి సాధించుకున్న హక్కులు కాలరాచివేయబడుతున్నాయి. కార్మికుల క్యాజువల్ కాంట్రాక్ట్ పద్ధతులు ప్రధానమైపోయాయి. నేటికి కొనసాగుతున్న అర్ధవలస సంబంధాలలో ఈ కష్టాలు, కడగండ్లకు కారణం. ఎల్పీజీ పాలసీల అమలుకు ముందు 1960ల చివర నుండి సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం సహాయం పేరుతో భారత ప్రభుత్వరంగ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం సాగించింది. 1980ల నుండి ఈ క్రమం తగ్గుముఖం పట్టింది. 1970లలో ప్రభుత్వరంగ పెరుగుదలలో పాటే దాన్ని ఉపయోగించుకుంటూ దళారీ నిరంకుశ బూర్జువావర్గం కూడా పెరిగింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలను అందులో భాగంగా భారత దళారీ పాలకవర్గాల ప్రయోజనాలను ఈడేర్చుకోవడానికి 1985 నుంచి 1991 వరకు సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు మొదటి దశ కొనసాగింది. 1991 నుంచి రెండవ దశ కొనసాగుతున్నది. సామ్రాజ్యవాద ప్రపంచకాలకు అనుగుణంగా ప్రపంచీకరణ మొదటి దశలో కాంట్రాక్టు వ్యవసాయం ద్వారా వ్యవసాయాన్ని వాణిజ్యీకరించడంతో మొదట్లో పలు ప్రాంతాలలో విస్తరిస్తూ వచ్చింది. కార్పొరేట్ కంపెనీలు కాంట్రాక్టు భూముల్లో వ్యవసాయంపై పూర్తి నియంత్రణ సాధిస్తూ వచ్చాయి. ఇక భారత అర్ధవలస–అర్ధభూస్వామ్య వ్యవస్థపై ప్రపంచీకరణ దాడి రెండవ దశను చూద్దాం. ఈ కాలంలో అర్ధభూస్వామ్యం లో చోటు చేసుకున్న గణనీయమైన మార్పుల కారణంగా భూస్వామ్య ఆధిపత్యపు గత రూపాల స్థానంలో నూతనంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర 'పార్టీ–సహకార సంస్థ–పంచాయితీ–పోలీసు' వ్యవస్థలు కుమ్మక్కైన విస్తృత సమిష్టి రూపం వచ్చింది. అలాగే నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, అర్ధభూస్వామ్యం కలిసిన ఒక ముఖ్యమైన సంస్థాగత రూపమే సహకార బ్యాంక్ కాగా సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల మదుపులు, స్థానిక అర్ధభూస్వామ్య మిగులుల మిశ్రమమే ఈ సహకార బ్యాంకుల సహకార పెట్టుబడి. వీటి ద్వారా ప్రభుత్వ అప్పులు/నిధుల పునాదిగా స్థానిక ఆధిపత్యం, దోపిడీల నూతన విధానం రూపొందింది. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే "దున్నేవారికే భూమి" ఆధారంగా భూస్వాములకు ఎలాంటి నష్టపరిహారం లేకుండా భూమిని స్వాధీనం చేసుకోవడం, భూస్వాముల భూములను వ్యవసాయ కూలీలకు, నిరుపేద రైతులకు, కింది మధ్యతరగతి రైతులకు తిరిగి భూపంపకం చేయడం, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల, పెట్టుబడిదారీ భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల, ప్రభుత్వ సంస్థల వ్యవసాయ క్షేత్రాలను, ప్లాంటేషన్లను ఆక్రమించుకొని సహకార వ్యవసాయాన్ని చేయడం, విప్లవ ప్రజా ప్రభుత్వాల జాతీయం చేయడం, "వ్యవసాయాన్ని పునాదిగా తీసుకొని, పరిశ్రమలను నాయకత్వంలో ఉంచే" సూత్రం పై, "రెండు కాళ్ల మీద నడిచే" వరుస విధానాల పై ఆధారపడి దేశాన్ని పారిశ్రామికం చేయడం, సహకార వ్యవసాయ ఉద్యమాన్ని, వ్యవసాయ సహకార సంఘాలను ప్రోత్సహించడం, పెంపొందించడం, సామ్రాజ్యవాద సంస్థల, కంపెనీల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ కంపెనీల, ప్రభుత్వ భూములను జాతీయం చేయడం, వారి ఆస్తులను, బ్యాంకులను స్వాధీనం చేసుకోవడం, దేశీయ, విదేశీ అప్పులను, అసమాన ఒప్పందాలను రద్దు చేయడం నిరుద్యోగాన్ని నిర్మూలించడం తదితర జాతీయ విముక్తి, ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను నెరవేర్చగలం.

ప్ర. మీ పార్టీ, పీఎల్జీఏ పని చేసే అనేక ప్రాంతాలలో ఎంతో సమృద్ధమైన జీవవైవిధ్యం ఉంది, అరుదైన ముఖ్యమైన మొక్కలు, అటవీ జంతుజాలం ఉన్నాయి. ఈ ప్రాంతాల సంరక్షణ పట్ల, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్న పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం పట్ల మూలంగా పార్టీ వైఖరి ఏమిటి? కామ్రేడ్ బసవరాజు: మా పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతున్న ప్రాంతాలు అత్యంత సమృద్ధమైన జీవవైవిధ్యంతో కూడినవి. పచ్చని అడవులు, జీవ నదులతో కూడిన ఈ ప్రాంతాల్లో విలువైన వృక్ష సంపద, ఔషధీయ వనమూలికలు, వన్య ప్రాణులు, రంగు రంగుల పక్షి జాతులు, పాములు, జంతువులు, క్రిమి కీటకాలు, నదులు, కాలువలలో వుండే జలచరాలు, ఉభయచరాలు, వందలాది రకాల చేపలు, అడవులలో లభించే దట్టని కొద్ది లఘు అటవీ ఉత్పత్తులు, వివిధ రకాల దుంపలు, పండ్లు, కాయలనిచ్చే పొదలు, వృక్షాలు, సాంప్రదాయ పద్ధతుల్లో సంరక్షింపబడిన వేలాది రకాల వరి వంగడాలు, పప్పు దినుసులు, నూనె దినుసులు, తృణధాన్యాలు అపారంగా వున్నాయి. అమూల్యమైన, అద్భుతమైన, అపురూపమైన, సమతుల్యమైన, ప్రకృతి సహజ సిద్ధమైన జీవవైవిధ్యానికి సామ్రాజ్యవాదుల నుండి, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల నుండి చాలా కాలంగా వినలేని ముప్పు వాటిల్లుతూ వస్తున్నది. దోపిడీ పాలకవర్గాల ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద ప్రయోజిత విధానాల కారణంగా ఈ జీవవైవిధ్యం, పర్యావరణం విధ్వంసానికి గురవుతున్నాయి. పిడికెడు మంది దేశ, విదేశీ ఘరానా దోపిడీదారుల లాభాపేక్షకు ప్రకృతిని బలి కానివ్వరాదు. ప్రకృతి సమతుల్యతను కాపాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, ప్రకృతి సంపదలను, వనరులను మానవ జీవన పరిస్థితులను మెరుగుపరుచుకోవడానికి సమతుల్యంగా ఉపయోగించుకోవాలి. అయితే పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సమతుల్యత మరోవైపు మానవ జీవన పరిస్థితులను మెరుగుపర్చుకోవడం యీ రెండు పరస్పర ఆధీనమైనటువంటివి. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం చేస్తున్న వనరుల విధ్వంసానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడాలి. నూతన ప్రజాస్వామిక విప్లవం ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి మౌలికమైన ప్రాతిపదికను ఏర్పరుస్తుంది. మా దేశ జీవవైవిధ్యాన్ని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు ఎలా ధ్వంసం చేస్తున్నాయో ఉదాహరణలు చూడండి! ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని వందలాది గ్రామాలలో వేలాది రైతుల నుండి వ్యవసాయ శాస్త్రవేత్త డా. రిఛారియా 22,000లకు పైగా వరి వంగడాలను, 1,800లకు పైగా ఆకు కూరలను సేకరించి వాటి జర్మ్ ప్లాస్మ్ ను ప్రస్తుత ఛత్తీస్ గఢ్ రాజధాని రాయ్ పూర్లోని ఇందిరా గాంధీ జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 1950, 60లలో భద్రపరిచారు. ఇందులో తక్కువ నీటితో పండేవి, తక్కువ గడ్డినిచ్చేవి, ఎక్కువ గడ్డినిచ్చేవి, సువాసనలు వెదజల్లే, పొడవైన, పొట్టి, సంవత్సరంలోని ఏ కాలంలోనైనా పండే ఇలా అనేక రకాల వంగడాలు ఇందులో వున్నాయి. అయితే మా దేశ దళారీ పాలకుల కుమ్మక్కుతో ఆ వరి వంగడాల జర్మ్ ప్లాస్మ్ ను అమెరికా తదితర దేశాల బహుళజాతి కంపెనీలు దొంగిలించుకుపోయాయి. మనీలాలోని ఇంటర్నేషనల్ రైస్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ)లలో అభివృద్ధి చేశామని చెప్తు ఇలా దొంగిలించుకుపోయిన వంగడాలను వివిధ పేర్లతో (ఐఆర్–36, ఐఆర్–72 తదితర) బహుళజాతి కంపెనీలు భారత్ లాంటి అనేక దేశాల్లో అమ్ముకుని భారీగా లాభాలు గడిస్తున్నాయి. విత్తనాల కోసం ప్రతి సంవత్సరం బహుళజాతి కంపెనీలపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇన్ని వేల రకాల విత్తనాల అభివృద్ధి సంరక్షణ వెనుక వున్న గొప్ప చారిత్రకానుభవాన్నిందించే అనేక కథనం చాలా ఆసక్తికరమైనది. అది ప్రపంచానికి తెలియాలి. ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోని రైతాంగ ప్రజానీకం అక్తి అనే పండుగ జరుపుకుంటారు. ఆ రోజు యువకులంతా కోలాటం వేస్తూ ప్రతి ఇంటి నుండి ధాన్యం అడుక్కుంటారు. ఊరంతటి నుండి సేకరించిన ధాన్యాన్ని కలిపి ఉమ్మడి స్థలంలో పంట వేసేవారు. పంట పండే క్రమంలో సహజంగానే కొన్ని కొత్త రకం వంగడాలు పుట్టుకొస్తాయి. తిరిగి వాటిని విడిగా సేకరించి పంట వేసేవారు. అలా ప్రతి సంవత్సరం ప్రతి ఊరులోను కొత్త రకం లక్షణాలు కలిగిన వంగడాలు తయారయ్యేవి. అలా ప్రతి గ్రామం ఒక వ్యవసాయ పరిశోధనాశాలగా, ప్రతి రైతు ఒక వ్యవసాయ శాస్త్రవేత్తగా అన్ని తదితరాలు ఇంకా అస్తిత్వంలో వున్నాయి. ఈ దేశంలో అభివృద్ధి అయినా, ఇంతటి వైవిధ్యభరితమైన వారి వంగడాలను బహుళజాతి కంపెనీలు దళారీ ప్రభుత్వాల మద్దతుతో దొంగలించుకుపోయి సొంతం చేసుకుంటున్నాయి. ఇప్పటికీ లోతట్టు ఆదివాసీ ప్రాంతాల్లో వందల రకాల స్థానిక వరి వంగడాలు, తృణ ధాన్యాలు, దుంపలు, ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల గింజలు,తదితరాలు ఇంకా అస్తిత్వంలో ఉన్నాయి. కార్పొరేట్ కంపెనీల కబంధహస్తాల్లోకి వెళ్లకుండా వాటిని కాపాడాల్సిన, సంరక్షించాల్సిన అవసరం వుంది. సాధారణంగా కొండలు–గుట్టలు, అడవులు, ప్రత్యేకంగా ఎత్తయిన విశాలమైన పర్వత శ్రేణులు, విశాలమైన దట్టమైన అడవుల రుతు పవనాల కదలికలకు ఒక ముఖ్యమైన కారణంగా ఉంటాయి. ఉదాహరణకు, బస్తర్లోని రావఘాట్ గుట్టలు ఋతుపవన వర్షాలకు అత్యంత అనుకూలమైనవి. ఈ గనుల తవ్వకాలతో ఋతుపవనాలు తీవ్రంగా నకారాత్మకంగా ప్రభావితమయ్యి బస్తర్లోనే కాక దక్షిణ ఛత్తీస్ గఢ్ లోనే వర్షాలు తగ్గిపోతాయనీ, ఈ గుట్టలు దేశంలోనే పర్యావరణ సమతుల్యంలో అత్యంత ప్రాధాన్యత కలిగినవని పర్యావరణ వేత్తలు చెప్తున్నారు. కాగా వీటిని ఎంత త్వరగా తవ్వి తరలించుకుపోదామా అని టాటా, అదానీ లాంటి దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు తహతహలాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు అన్ని రకాలుగా రంగం సిద్ధం చేస్తున్నాయి. పర్యావరణంలో గ్లోబల్ వార్మింగ్ పెరుగుతుండడంతో ఎక్కువ కాలం కొనసాగే విపరీతమైన ఎండలు, అధ్వాన కరువులు, అకాల వర్షాలు తదితర ప్రకృతి వైపరీత్యాలు అసాధ్యాంగా సంభవిస్తున్నాయి. ఇటీవలి ఒక అంచనా ప్రకారం గ్లోబల్ వార్మింగ్ కారణంగా త్వరలో సముద్ర జలాలు 27 సెం.మీ. ఎత్తు పెరగనున్నాయి. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువుల పరిశ్రమలు పెరుగుతూ, ఉత్పత్తులు పెరగడంతో వాతావరణంలో రేడియేషన్ ఆమోదనీయమైన మోతాదు కంటే మించిపోతున్నది. దీని ద్వారా అసాధ్యమైన రోగాలు సంభవిస్తున్నాయి. మొత్తంగా ప్రజల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితిని కూడా తమ లాభాల వేటకు వాడుకుంటూ ఆరోగ్యరంగాన్ని విస్తరిస్తూ బహుళజాతి కంపెనీలు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ద్వారా ప్రజలను విపరీతంగా దోచుకుంటున్నాయి. దోపిడీ ప్రభుత్వాల మద్దతుతో వివిధ ప్రజారోగ్య పథకాల పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నాయి. మా పార్టీ అడవులను, నకల జీవ వృక్ష జాతులతో కూడిన జీవవైవిధ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించే నిబద్ధతతో వుంది. మా పార్టీ నాయకత్వంలో పీఎల్జీఏ, ప్రజాసంఘాలు, ఆర్పీసీలు (విప్లవ ప్రజా ప్రభుత్వాలు) ప్రజలతో కలిసి ఇందుకోసం కృషి చేస్తున్నాయి. ప్రజలను చైతన్యపరుస్తున్నాయి. మా ప్రజా ప్రభుత్వాల అటవీ రక్షణ విభాగం దీనిపై ప్రత్యేకించి కేంద్రీకరిస్తున్నది. ప్రజలను నిర్వాసితులను గావించే, పర్యావరణానికి, జీవవైవిధ్యానికి నష్టం కలిగించే ఏ ప్రభుత్వ, ప్రైవేటు పథకాన్నైనా మేము అడ్డుకుంటాం. ఇందుకోసం మాతో కలిసి పని చేయాల్సిందిగా దేశంలోని [illegible] పర్యావరణవాదులకు, జీవ శాస్త్రవేత్తలకు, మానవ విజ్ఞాన శాస్త్రవేత్తలకు, ప్రజాస్వామికవాదులకు, పోరాటశక్తుల సంస్థలకు, సామాజిక సంస్థలకు, ఆదివాసీ సామాజిక సంఘాలకు పిలుపునిస్తున్నాం. చివరిగా మేము చెప్పేదేమంటే పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ కోసం ఒకవైపు దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాలను నిర్మిస్తూ వివిధ డిమాండ్లను సాధించే దిశలో పోరాటాలను నిర్వహించాలి. మరోవైపు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా ఏర్పడబోయే నూతన ప్రజాస్వామిక భారతదేశంలోనే అటవీ, పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణ గ్యారంటీకి ప్రాతిపదిక ఏర్పడుతుంది.

3 ప్ర. అదే విధంగా, మీ పార్టీ, పీఎల్జీఏ క్రియాశీలంగా పనిచేసే అనేక ప్రాంతాలలో బొగ్గు, బాక్సైట్ వంటి సహజ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. ఈ వనరులను భారీ బహుళజాతి పెట్టుబడిదారీ కార్పొరేషన్లకు కావాలి. ఈ వనరులను అప్పగించేందుకు ప్రస్తుత భారత రాజ్యం ఆసక్తినిస్తున్నది. ఈ వనరులను ఈ కార్పొరేషన్లకు అప్పగించేందుకు అనేక మంది ప్రజలను తమ నివాస ప్రాంతాల నుండి బలవంతంగా నిర్వాసితులను చేస్తున్నది. భారతదేశంలో సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న విధానాల గురించి మీరు మరింత వివరంగా ఏమైనా చెప్తగలరా? ఇంకా ఇది సామ్రాజ్యవాదానికి సీపీఐ (మావోయిస్టు), పీఎల్జీఏ ప్రజా ప్రతిఘటిస్తాయి?

కామ్రేడ్ బసవరాజు: మా దేశం పేద దేశం కాదు. కాని పేద ప్రజలున్న దేశమనేది నూటికి నూరు పాళ్ళు నిజం. మా దేశంలో హరితారణ్యాలున్నాయి. సంవత్సరం పొడవునా పారే జీవనదులున్నాయి. సారవంతమైన వ్యవసాయ భూములున్నాయి. అమూల్యమైన, అపారమైన ఖనిజ వనరులున్నాయి. వీటికి తోడు పదుల కోట్ల కష్టజీవులైన కార్మికులు, రైతులున్నారు. కోట్లాది మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, లక్షలాది మంది ఉన్నత విద్యావంతులు, మేధో శ్రమజీవులతో పాటు పదుల కోట్ల యువత వుంది. దేశ జన సంఖ్యలో 8.5 శాతంగా వున్న 700 లకు పైగా మూలవాసీ, ఆదివాసీ తెగల ప్రజలున్నారు. ఐనప్పటికీ మా దేశంలోని మెజారిటీ ప్రజలు ఆకలి, అవిద్య, అంధవిశ్వాసాలు, అనారోగ్యం, నిరుద్యోగం, దారిద్ర్యం మొదలయిన సమస్యలతో అల్లాడుతున్నారు. మౌలిక జీవన సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం వివిధ రూపాలలో సంఘర్షిస్తున్నారు. దీనికంతటికీ కారణం ప్రకృతి సంపదలను, వనరులను, అపార శ్రమశక్తి, స్థానిక టెక్నాలజీ దేశ ప్రజలందరి ప్రయోజనాల కోసం కాకుండా దేశంలోని అశేష ప్రజారాసుల చొరవ, శక్తిసామర్థ్యాలను వెలికి తీయకుండా, వీరికి ప్రజాస్వామిక హక్కులు లేకుండా అణచివేయడం పిడికెడు మంది దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, భూస్వాములు, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసమే ఇవన్నీ వినియోగించబడుతున్నాయి. మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే భారతదేశంలో మూలవాసీ, ఆదివాసీ, గిరిదివాసీ ప్రజలు నివసించే అటవీ, అర్థ అటవీ ప్రాంతాలలోనే కాకుండా దేశంలోని పలు రాష్ట్రాల మైదాన ప్రాంతాలలో ముఖ్యంగా మా పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతున్న అంటే పార్టీ, పీఎల్జీ జీవీ, ప్రజా సంఘాలు, కొన్ని ప్రాంతాలలో విప్లవ ప్రజా ప్రభుత్వాలు పనిచేస్తున్న పశ్చిమ బెంగ్, ఒడిశా, బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక (పశ్చిమ కనుమలు) రాష్ట్రాల్లోని అడవుల్లో అపారమైన ప్రకృతి సంపదలు, ఖనిజ వనరులు పుష్కలంగా వున్నాయి. ఇనుము, బొగ్గు, బాక్సైట్, అభ్రకం, మాంగనీస్, తగరం, వెండి, బంగారం, సున్నపురాయి, గ్రానైట్, అల్యూమినియం, రాగి, సిమెంట్ తదితర 90 రకాల ఖనిజాలను భారతదేశం ఉత్పత్తి చేస్తున్నది. ముఖ్యమైన ఖనిజాల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలోని 5 పెద్ద ఉత్పత్తిదారుల్లో ఒకటి. భారతదేశ ఖనిజ వనరుల్లో 25% ఝార్ఖండ్ లోనే వున్నాయి. దేశ బాక్సైట్ వనరుల్లో 70 శాతం, 28 శాతం ఇనుప ఖనిజపు వనరులు ఒడిశాలో వున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో బొగ్గు, బాక్సైట్ గనులున్నాయి. ఛత్తీస్ గఢ్లోని బస్తర్, సర్గుజా ప్రాంతాలలో ఇనుము, తగరము, బంగారం, వజ్రాలు, బొగ్గు, యురేనియం, బాక్సైట్, కొరండం, డోలమైట్, క్వార్టయిట్లు పుష్కలంగా వున్నాయి. మహారాష్ట్రలోని సూర్జాగఢ్ గుట్టల్లో 9 కోట్ల టన్నుల ఇనుప ఖనిజం వుంది. ఇలా దాదాపు అన్ని రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లో లేదా మైదాన ప్రాంతాల్లో లేదా రెండు రకాల ప్రాంతాలలో అనేక ఖనిజ వనరులు పుష్కలంగా వున్నాయి. అభివృద్ధి పేరుతో దోపిడీ పాలకవర్గాలు చేస్తున్నదంతా వారి తీవ్ర దోపిడీకే తప్ప ప్రజల అభివృద్ధి ఎంతమాత్రం కాదు. అది ప్రజల పాలిట వినాశకరమైన, వనరులను వారి లాభాల కోసం విచ్చలవిడిగా కొల్లగొట్టే, పర్యావరణాన్ని ధ్వంసం చేసే, దేశాన్ని తాకట్టు పెట్టే అభివృద్ధి నిరోధక, దేశద్రోహకర నమూనాయే. ప్రకృతి సంపదలు, వనరులన్నింటినీ సమస్త ప్రజల కోసం, దేశం కోసం కాకుండా సామ్రాజ్యవాదుల, దళారీ దోపిడీ పాలకవర్గాల కోసం వినియోగించే నమూనాయే. అందుకే ఈ అభివృద్ధి నమూనాను వ్యతిరేకించాల్సిన, సమైక్యంగా పోరాడి తిప్పికొట్టాల్సిన అవసరం వుంది. వనరుల సంరక్షణ, సంవర్ధన, పర్యావరణ పరిరక్షణ, ప్రజలందరి అవసరాల కోసం, దేశ అవసరాల కోసం వాటిని వివక్షణాయుతంగా ఉపయోగించుకోవడం, భావితరాల కోసం వాటిని భద్రపర్చడమే అసలైన అభివృద్ధి నమూనా అవుతుంది. సామ్రాజ్యవాదుల, దళారీ దోపిడీ పాలకవర్గాల రాజ్యాధికారాన్ని కార్మికవర్గ పార్టీ నాయకత్వాన దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా ధ్వంసం చేసి దాని స్థానంలో నిర్మాణమయ్యే ప్రజల నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారం మాత్రమే సరైన అభివృద్ధి నమూనాను అమలు చేస్తుంది. అప్పుడే ప్రజల నిజమైన సర్వతోముఖాభివృద్ధిని సాధించగలం. అప్పుడు మాత్రమే వనరుల విచ్చలవిడి దోపిడీని అరికట్టగల్గుతాం, సంరక్షించగల్గుతాం. ఈ ప్రయత్నాలు ప్రాథమిక స్థాయిలో మా పోరాట ప్రాంతాల్లో పార్టీ నాయకత్వంలో ప్రజా రాజ్యాధికార అంగాలైన ఆర్పీసీల ఆధ్వర్యంలో ప్రారంభమై కొనసాగుతున్నాయి.

4 ప్ర. లెస్బియన్స్, గేస్, బైసెక్సువల్స్, ట్రాన్స్ జెండర్లు (ఎల్జీబీటీ) వంటి వివిధ లైంగికతలు గల (క్వీర్) సమూదాయం పాత భారత రాజ్యం చేత పీడించబడుతున్నది. భారతదేశంలో ఎల్జీబీటీ హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమం పట్ల, భారత ఫాసిస్టు రాజ్యం చేత ఎల్జీబీటీ ప్రజలు పీడించబడడం పట్ల సీపీఐ (మావోయిస్టు) వైఖరి ఏమిటి? కామ్రేడ్ బసవరాజు: ఇలాంటి విషయాలను మౌలికంగా మా పార్టీ ఎల్జీబీటీ విషయాన్ని కూడా మార్క్సిస్టు (ఎంఎల్ఎం) దృక్పథంతోనే చూస్తుంది, విశ్లేషిస్తుంది. వర్గ పీడనను రూపుమాపడం ద్వారానే, ఎల్జీబీటీ సమూదాయం పట్ల వివక్ష ప్రజల దృక్పథంలో మార్పు తీసుకురావడానికి నిరంతరాయ సైద్ధాంతిక, రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, వైద్యపర కృషి సల్పడం ద్వారానే లింగ పీడన, వివక్షతల నుండి ఎల్జీబీటీ సమూదాయానికి నిజమైన విముక్తి లభిస్తుంది. ఆ సమాజంలో వారికి ఇతరులతో సమానంగా జీవించే పరిస్థితి ఏర్పడడంతో పాటు గౌరవ మర్యాదలు లభిస్తాయి. పాత (రియాక్షనరీ) భారత రాజ్యం చేత దోపిడీ, పీడనలకు గురవుతున్న భారత దేశంలోని పీడిత వర్గాల, ప్రత్యేక సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ప్రజలందరి మానవ, పౌర హక్కులతో సహా అన్ని హక్కులను గుర్తిస్తున్నట్టే, హక్కుల కోసం జరుగుతున్న వారి పోరాటాలను బలపరుస్తున్నట్టే, అలాగే వారి పోరాటాలకు అండగా నిలుస్తున్నట్టే ఎల్జీబీటీ విషయంలోనూ మా పార్టీ వారి ప్రత్యేక సమస్యలను, వారి హక్కులను గుర్తిస్తుంది. వారి పట్ల సామాజిక వివక్షను వ్యతిరేకిస్తుంది. కొన్ని శారీరక ప్రత్యేకతలతోనూ, శారీరక, మానసిక ప్రత్యేక (జన్యు)లక్షణాలతోను పుట్టినప్పటికీ మొత్తం మానవాళిలో వారు ఒక భాగం. సామ్రాజ్యవాద దళారులుగా వ్యవహరిస్తున్న పెట్టుబడిదారులకు, భూస్వాములకు ప్రాతినిధ్యం వహించే భారత రాజ్యం వారి పట్ల కొనసాగిస్తున్న పీడనను, వివక్షను వ్యతిరేకిస్తున్నది. భారత పౌరులుగా వారి జీవించే హక్కును, ఇతర పౌరులతో సమానంగా ప్రాథమిక హక్కులు, వారి నిర్దిష్ట సమస్యకు సంబంధించిన ప్రత్యేక/విశేష హక్కులతో సహా అన్ని హక్కులను పొందే, అనుభవించే హక్కును గౌరవిస్తున్నది. విద్యా, వైద్యం, ఆవాసం, ఉద్యోగం, పాలన, రాజకీయ రంగాలన్నింటిలోనూ మేము స్థాపించబోయే భారత నూతన ప్రజాస్వామిక రాజ్యం వారికి భాగస్వామ్యం కల్పిస్తుంది. వారికి తగిన ఆర్థిక సామాజిక భద్రతను, ఆరోగ్యకరమైన సామాజిక సాంస్కృతిక వాతావరణాన్ని కల్పిస్తుంది. ఉచిత వైద్యాన్ని ఖాయం చేస్తూ, మంచి ఆరోగ్యాన్ని అందించగల ప్రజానుకూల వైద్య వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా స్వచ్ఛాపూరితంగా వారికి అవసరమైన లేదా వారు కోరుకునే ఏదో ఒక గుర్తింపుతో జీవించడానికి అనుగుణంగా తమ లింగ నిర్ధారణ చేసుకొనే అందుకవసరమైన మరియు అప్పటికి అందుబాటులో వున్న శారీరక, మానసిక చికిత్సలు, ఉచిత వైద్యం ద్వారా ఆరోగ్యవంతమైన, గౌరవప్రదమైన, విజ్ఞానదాయకమైన జీవితాన్ని గడపడం కోసం అలాంటి వారందరికి అవకాశం కల్పిస్తుంది. అలాగే సమాజం వారిపట్ల సమాన మరియు గౌరవభావంతో వ్యవహరించేలా అవసరమైన శిక్షణ అందిస్తుంది. ప్రస్తుత దశలో వారి హక్కుల కోసం కొనసాగుతున్న ఉద్యమాలను సమర్థిస్తుంది. ఎల్జీబీటీ సమూదాయం పై కొనసాగుతున్న లైంగిక హింస, దోపిడీ, పీడనలను, వివక్షను, లైంగిక అవకాశవాదాన్ని వ్యతిరేకిస్తుంది. ఎల్జీబీటీ సమూదాయంలో భాగమయిన కారణంగా వారు ఏ అవకాశాలు కోల్పోరాదు. సమాజం కోసం తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ వినియోగించేలా వారికి అవకాశాలు కల్పించాలి. ప్రస్తుత దశలో భారత దేశంలో ఎల్జీబీటీ హక్కుల కోసం సాగుతున్న ఉద్యమం ప్రధానంగా వర్గ పోరాట సామాజిక వాస్తవికత నుండి వేరుపడిపోయిన వ్యక్తి కేంద్రిత, బూర్జువా, ఆధునికానంతరవాద భావజాల ప్రభావంలో వుంది. దీని నుండి ఆ ఉద్యమం బయటపడాలి. ఎల్జీబీటీ సమూదాయమే కాదు దేశంలోని పీడిత వర్గాలన్నింటిపై ఫాసిస్టు అణచివేతను, క్రూరమైన దోపిడీని కొనసాగిస్తున్న భారత రాజ్యం అది ప్రాతినిధ్యం వహిస్తున్న అర్ధవలస–అర్ధభూస్వామ్య సామాజిక ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసే పోరాటంలో అన్ని ఉద్యమాలు తప్పనిసరి భాగమవ్వాలి. పీడిత ప్రజలందరితో పాటే ఎల్జీబీటీ సమూదాయం కూడా సామ్రాజ్యవాదుల, భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల చేత దోపిడీ, పీడనలకు, అణచివేతకు, వివక్షకు గురవుతున్నందున ఈ ముగ్గురు శత్రువులకు వ్యతిరేకంగా పీడిత ప్రజానీకంతో ఐక్యమవ్వాలి. సామ్రాజ్యవాదం, పాలకవర్గాలు, వారి భారత రాజ్యం దన్నుతో పోర్న్ ఇండస్ట్రీ (నీలి చిత్రాల పరిశ్రమ) ఎల్జీబీటీ సమూదాయం పట్ల గల వివక్షను, వారి పేదరికాన్ని, నిరుద్యోగాన్ని సొమ్ము చేసుకోవడంలో భాగంగా, అలాగే ప్రజలలో, ప్రత్యేకించి యువజనులలో లైంగిక విశృంఖలత్వాన్ని, వికృతులను పెంచి పోషిస్తూ సమాజాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగా ఎల్జీబీటీ సమూదాయాన్ని కూడా విచ్చలవిడిగా వాడుకుంటున్నాయి. మా పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. భారత నూతన ప్రజాస్వామిక రాజ్యం పోర్న్ ఇండస్ట్రీని నిషేధిస్తుంది. ఎల్జీబీటీకి సంబంధించి ఒక్క విషయంలో మాత్రం–మహిళగానో, పురుషుడిగానో లేదా వారు కోరుకున్న ఏ గుర్తింపు (థర్డ్ జెండర్)తోనైనా సాధారణ జీవితం గడుపుతూనే మరోవైపు అందుకు భిన్నంగా మరో రకమైన అసహజ సంబంధాన్ని, అరాచక బహుళ భాగస్వామ్యాలతో శారీరక సంబంధాలను కొనసాగించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుంది, నిరుత్సాహపరుస్తుంది. ప్రకృతి సహజంగా జరిగే జన్యు సంబంధమైన వైపరీత్యాల కారణంగా ఏర్పడే లింగ సంబంధమైన శారీరక ప్రత్యేకతల పట్ల సంబంధిత వ్యక్తులకు గానీ, ఇతరులకు గానీ సరైన, శాస్త్రీయ అవగాహన లేనప్పుడు ఇలాంటి విషయాల వల్ల, వ్యక్తులతో వ్యవహరించడం కూడా అసహజం, అనుమానాస్పదంగా, అగౌరవంగా, లజ్జాకరమైనదిగా వుండే అవకాశాలు మెండుగా వుంటాయి. అలాంటి పరిస్థితుల్లో సమాజం నుండే కాక కుటుంబాల నుండి, బంధువుల నుండి కూడా వివక్ష ఎదురౌతుంది. దాంతో అలాంటి వారు విడి సమూదాయంగా జీవించే వైపు నెట్టబడుతారు. సోషలిస్టు రాజ్యం ఎల్జీబీటీ సమూదాయం పట్ల సమాజంలో ప్రజలందరికీ శాస్త్రీయ అవగాహనను అందిస్తుంది. అలాంటి విషయాలను సహజంగా భావించే సాధారణ అవగాహనను పెంపొందిస్తుంది. అలాగే పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం పెంచి పోషిస్తున్న విశృంఖల సంస్కృతి సెక్స్ విప్లవతత్వం బూతు సాహిత్యం, బూతు చిత్రాల ప్రభావం తదితరాల కారణంగానూ అసహజ శారీరక సంబంధాల వైపు ఒక సెక్షన్ ఆకర్షించబడుతున్నది. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం కుళ్ళిపోతే, కాలం చెల్లిన కుళ్ళు సంస్కృతి ధ్వంసం, ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతి వ్యాప్తి ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన పరస్పర గౌరవప్రదమైన మానవ జీవన సంబంధాలను నెలకొల్పడానికి సోషలిస్టు రాజ్యం కృషి చేస్తుంది.

5 ప్ర. చివరిగా, భారతదేశంలో విప్లవ రాజకీయ ఖైదీల పరిస్థితి గురించి మిమ్మల్ని అడగాలను కుంటున్నాను. ఈ పరిస్థితి గురించి మా పాఠకులకు మరింత వివరంగా ఏమైనా చెబుతారా? కామ్రేడ్ బసవరాజు: భారత దేశంలో గతంలో కొనసాగిన ప్రజా ఉద్యమాలను, నేడు కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని, విస్తాపన వ్యతిరేక ఉద్యమాలను, కార్మిక, రైతాంగ ఉద్యమాలను, విద్యార్థి యువజనుల, ప్రభుత్వ ఉద్యోగుల, పీడిత సామాజిక సెక్షన్ల, మత్స్యకారుల, నిరుద్యోగుల, ఆదివాసీ, మత మైనారిటీ ప్రజల మానవ హక్కుల, మహిళల, విభిన్న వర్గాల, పెన్షనర్ల, ఖైదీల ఉద్యమాలను అణచివేసేందుకు రాజ్యం అనుసరిస్తున్న పద్ధతులు, మార్గాలు బహుముఖమైనవి. ఈ అణచివేతలో రెండు ప్రధానమైనవి. ఒకటి సాయుధ బలగాలనుపయోగించి వివిధ పాశవిక, ఫాసిస్టు పద్ధతులతో పోరాడే ప్రజల నాయకత్వాన్ని, కార్యకర్తలను నిర్మూలించడం. రెండోది అక్రమంగా నిర్బంధించి జైళ్ల పాలు చేయడం. కాలంచెల్లిన దోపిడీ పాలక వర్గాల అధికారాన్ని సుస్థిరంగా ఉంచడంలో, కాపాడడంలో, వారి దోపిడీ, పీడనలను, ప్రజా వ్యతిరేక విధానాలను నిరాటంకంగా కొనసాగించడంలో రాజ్య యంత్రాంగంలో సాయుధ బలగాలు, కోర్టులు, జైళ్లు, వీటికి పునాదిగా వుండే రాజ్యాంగం ప్రధానమైనవి, కీలకమైనవి. రాజ్యాన్ని ఎదిరించే వారిని సాయుధ బలగాల ద్వారా నిర్మూలించడం, అరెస్టులు చేసి జైళ్లలో నిర్బంధించడం, కోర్టుల ద్వారా శిక్షలు విధించడం, వారిని ప్రజా జీవితం నుండి వేరు చేసి, వాళ్ళ శక్తి సామర్థ్యాలను నాశనం కావించడం వర్గ సమాజంలో సర్వసాధారణం. భారతదేశంలో విప్లవ రాజకీయ ఖైదీల పరిస్థితి దినదినం దుర్భరంగా మారుతున్నది. భారత రాజ్యం గతం నుండి, ప్రత్యేకించి బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు భారతీయ జనతా పార్టీ పాలన మొదలయినప్పటి నుండి అన్ని ప్రజాస్వామిక ఉద్యమాల పట్ల, ఉద్యమ సంస్థల పట్లనే కాకుండా విప్లవ రాజకీయ ఖైదీల పట్ల అత్యంత అమానవీయంగా, మరింత పాశవికంగా వ్యవహరిస్తున్నది. ఒక్క విప్లవ రాజకీయ ఖైదీల పట్లనే కాదు, మతమైనారిటీల, దళితుల ఉద్యమాల కార్యకర్తలు, మానవ హక్కుల కార్యకర్తలు, విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక వాదులైన విద్యార్థి–యువజనులు, ఉపాధ్యాయులు, దేశభక్తులు, మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు, వకీళ్ళు, విలేకరులు, శాస్త్రవేత్తలు, వివిధ సామాజిక కార్యకర్తలు, కార్మిక రైతు సంఘాల కార్యకర్తలు, విస్తాపన వ్యతిరేక ఉద్యమాల కార్యకర్తలు, కశ్మీర్, నాగా, మణిపూర్, అసోం, బోడో, తదితర జాతుల ఉద్యమాల కార్యకర్తల పట్ల రాజ్యం శత్రుపూరిత వైఖరితో వ్యవహరిస్తున్నది. అభివృద్ధినిరోధక దోపిడీ పాలక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక, దేశ ద్రోహకర విధానాలను ప్రశ్నించే ప్రతి గొంతును శత్రుత్వంగా నొక్కివేయడానికి, అలా సాధ్యం కానప్పుడు ఆ గొంతులను కటకటాల వెనుక బంధించి వుంచడానికి రాజ్యం అనేక అక్రమ పద్ధతులను అనుసరిస్తున్నది. తనే రాసుకున్న రాజ్యాంగాన్ని ఘోరంగా ఉల్లంఘిస్తున్నది, ఫాసిస్టీకరిస్తున్నది, కాషాయీకరిస్తున్నది. తప్పుడు కేసులు, కుట్ర కేసులు బనాయించి విచ్చలవిడిగా అరెస్టులు సాగిస్తున్నది. తమను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనే హక్కును పశ్చిమ బెంగాల్, కేరళ జైళ్లలో మావోయిస్టు ఖైదీలు పోరాడి సాధించుకున్నారు. కానీ దేశవ్యాప్తంగా జైళ్లలో మగ్గుతున్న రాజకీయ ఖైదీలకు ఆ గుర్తింపునీయకపోవడం భారత దళారీ పాలకవర్గం అణచివేత విధానాల ఫలితమే. ప్రశ్నించే గొంతులను కటకటాల వెనుక బంధించడం, పాలకవర్గాలను ప్రశ్నించే, ఎదిరించే వాళ్లందరినీ జైళ్లలో నిర్బంధించడం పాత భారత రాజ్యానికి కొత్తేమి కాదు. అది బ్రిటీష రాజ్యం నుండి ఈ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుంది. భారత రాజ్యానికి సామాజిక, ఆర్థిక, రాజకీయపరంగానే కాక రాజ్యాంగపరంగా కూడా ఉన్నత కుల, వర్గ, లింగ (పురుషాధిక్య) పక్షపాతం వుంది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నింటిలోనూ కొనసాగుతున్నది. ఇది రాజకీయ ఖైదీల పట్ల కూడా అమలు చేయబడుతుంది.

# చురకలు

## సంపాదకీయం

## పాక్ ను వణికించిన భారత సైన్యం టీమ్ గురించి తెలుసా?

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ రెండు రకాలుగా పాక్ ని వణికించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి, సుమారు 100 మంది ముష్కరులను మట్టుబెట్టగా.. అనంతరం పాక్ చేసిన దాడులకు ప్రతీకార దాడులు చేసింది. ఆ సమయంలో భారత్ పై వందల సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది పాకిస్థాన్. ఈ సమయంలో రివర్స్ లో పాక్ ఎయిర్ బేస్ లను, గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ నాశనం చేసింది. ఇప్పుడు అవన్నీ ఐసీయూలో ఉన్నాయని మోడీ ఎద్దేవా చేస్తున్నారు. ఈ సమయంలో పాక్ ఆట కట్టించి, డ్రోన్లను నాశనం చేసిన సైన్యం గురించి తెలుసుకుందాం..! అవును... ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించి, భారత్ పైకి ఉసిగొల్పి పంపుతోన్న పాకిస్థాన్ ను ఆపరేషన్ సిందూర్ తో చావు దెబ్బ కొట్టింది భారత సైన్యం. ఇందులో భాగంగా... ప్రధానంగా అటు వైపు నుంచి వచ్చిన డ్రోన్లు, క్షిపణులను గాల్లోనే నిర్వీర్యం చేసింది. ఈ కీలక పాత్రం పోషించినవారు అగ్నివీరులు అనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. ఈ సమయంలో ఆర్మీలోని కీలక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో పనిచేసిన వేల మంది అగ్నివీరులు పాకిస్థాన్ దాడిని సమర్థంగా ఎదుర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో సరిహద్దుల్లోని ఒక్కో గగనతల రక్షణ వ్యవస్థ యూనిట్ లోనూ సుమరు 150 నుంచి 200 మంది చొప్పున మొత్తంగా సుమారు 3,000 మంది అగ్ని వీరులు ఆపరేషన్ లో పాల్గొన్నట్లు చెబుతున్నారు.ల కీలకమైన సైనిక స్థావరాలు, ఎయిర్ బేస్ ల్లో విధులు నిర్వర్తించే వీరు.. పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లను ఎప్పటికప్పుడు నేల కూలుస్తూ సమర్థంగా విధులు నిర్వర్తించినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో.. ఫైర్ కంట్రోల్ ఆపరేటర్లు, రేడియో ఆపరేటర్లు, క్షిపణులు – గన్స్ అమర్చిన భారీ వాహనాలకు డ్రైవర్లుగా వీరు ఆపరేషన్ లో ముందుండి పోరాట పటిమ చూపించారని అంటున్నారు. కాగా... అగ్నివీర్ పథకాన్ని కేంద్రం 2022 జూన్ లో ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పథకంలో అగ్నివీరులుగా నియమితులయ్యే సిబ్బంది నాలుగేళ్ల పాటు సాయుధ బలగాల్లో పనిచేస్తారు. ఆ తర్వాత 25శాతం మందిని ఎంపిక చేసి, 15 ఏళ్ల కాలవ్యవధిలో రెగ్యులర్ సర్వీసుల్లోకి తీసుకుంటారు.

ఇలా గత మూడేళ్లలో సుమారు లక్షమంది అగ్నివీరులను తీసుకున్నారు.

## దైవిక పాత్రలకు జీవం పోసిన నటుడు టి.ఎస్. విజయచందర్ - మే 24...విజయచందర్ జయంతి



టి.ఎస్. విజయ చందర్ తెలుగు నాటక, సినిమా, టెలివిజన్ రంగాల్లో విశిష్టతను సంపాదించుకున్న గొప్ప కళాకారుడు. నటుడు, దర్శకుడు, నిర్మాతగా ఆయన ప్రస్థానం ప్రతి దశలోను విలక్షణతను చాటింది. 1939 మే 24న ఆంధ్ర ప్రదేశ్‌లో జన్మించిన ఆయన, చిన్ననాటి నుంచే కళలకు ఆసక్తితో ఎదిగారు. కుటుంబ నేపథ్యం కూడా ఆయనకు స్ఫూర్తి దాయకమే. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఈయనకు తాత అవుతారు. విజయచందర్ తల్లి పుష్పావతి, ప్రకాశం పంతులు కూతురు. తండ్రి తెలిదేవర వెంకట్రావు హొమియోపతి వైద్యుడు. బ్యాడ్మింటన్ ఛాంపియన్ కూడా. అంతేగాక ప్రసిద్ధ గాయని టంగుటూరి సూర్యకుమారి కూడా ఆయనకు సమీప బంధువు. విజయచందర్ సినీ రంగంలోకి అడుగుపెట్టిన చిత్రం 'సుడి గుండాలు (1967), అదే సంవత్సరానికి ఉత్తమ తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డు అందుకుంది. నటుడిగా మాత్రమే కాక, ఒక ఆలోచనాత్మక కళాకారుడిగా ఆయన చూపిన ప్రావీణ్యం తర్వాతి చిత్రాలలో స్పష్టంగా కనపడింది. 1978లో నిర్మించిన 'కరుణా మయుడు' చిత్రం ద్వారా ఆయనను తెలుగు ప్రేక్షకులు పూర్తిగా గుర్తించారు. యేసు క్రీస్తు పాత్రలో ఆయన హృద్య నటన, ఆత్మీయమైన భాష్యం ప్రేక్షకులను ఆధ్యాత్మికంగా ప్రభావితం చేసింది. ఈ చిత్రాన్ని ఆయన నిర్మాతగా నిర్మించారు. అది తెలుగుతోపాటు తమిళం, మలయాళంలో కూడా విడుదలై విజయవంతమైంది. ఆయన ప్రతిభను, పూర్వీకుల జీవితాల రూపకల్పన లో మనం గమనించ వచ్చు. 1982లో విడుదలైన 'ఆంధ్ర కేసరి' చిత్రంలో ఆయన టంగుటూరి ప్రకాశం పంతులు పాత్రను పోషించడం మామూలు విషయం కాదు. ఆ పాత్రకు ఆయన కలిగిన వ్యక్తిగత అనుబంధం, పరిశోధనాత్మకత, నటనలోని గంభీరత చిత్రాన్ని చారిత్రకంగా నిలిపాయి. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు, నిర్మాతగా కూడా ఆయన సేవలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూపొందిన ఈ చిత్రం ప్రత్యేక జ్యూరీ పురస్కారం అందుకుంది. 1986లో వచ్చిన 'శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం' చిత్రంలో ఆయన పోషించిన సాయిబాబా పాత్ర అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించబడిన స్థాయికి చేరింది. ఆయన నటన భక్తిని రేకెత్తించేలా ఉండి, ప్రేక్షకులను ఆధ్యాత్మిక భావనల్లో తేలి యాడించింది. ఆయనకు "దైవిక పాత్రల పోషణలో నిపుణుడు" అనే పేరు ఈ చిత్రాల వల్లే వచ్చినదని చెప్పవచ్చు. టెలివిజన్ రంగంలోనూ ఆయన విశేష కృషి చేశారు. 1996 నుండి 1998 వరకు 'దయాసాగర్' అనే టీవీ సీరియల్‌లో యేసు క్రీస్తుగా ఆయన పోషించిన పాత్ర దేశ వ్యాప్తంగా ప్రసారమైంది. ఇది డీడీ నేషనల్‌లో ప్రదర్శితమై, వివిధ భారతీయ భాషలలో డబ్బింగ్ చేయబడింది. అది ఆయన ప్రభావాన్ని టెలివిజన్ దశలోనూ కొనసాగించిన ముద్రగా నిలిచింది. ఆయన కృషికి గుర్తింపుగా 'కరుణా మయుడు' చిత్రానికి ఉత్తమ తెలుగు చిత్రం నంది అవార్డు లభించగా, 'ఆంధ్ర కేసరి'కి ప్రత్యేక జ్యూరీ అవార్డు దక్కింది. అవార్డులు ఆయన నిష్ఠను, శ్రమను గుర్తించిన గుర్తింపులు మాత్రమే. నటుడిగా మాత్రమే కాకుండా, విజయచందర్ సమాజ సేవకుడి గానూ తనదైన ముద్ర వేశారు. 2007లో పాత సినీ కళాకారుల ప్రయోజనార్థం, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కోసం ఆయన భూమిని దానం చేశారు. ఇది ఆయన కళా సాన్నిధ్యాన్ని సమాజంతో మిళితం చేసిన ఉదాహరణ. విజయచందర్ జీవితం తెలుగు కళాజీవులకే కాకుండా, అన్ని రంగాల్లో ఉన్నతంగా ఆలోచించాలనుకునే వ్యక్తులకు స్ఫూర్తిదాయకం. ఆయన జీవన ప్రయాణం ఒక్క కళాకారుడిగా కాకుండా, సంస్కార ప్రదాతగా, చరిత్రకు వేదికగా నిలిచిన నటుడిగా నిలిచి పోతుంది. నటనకు అంకితమైన వ్యక్తిగా, పాత్రల లో జీవించిన కళాకారుడిగా విజయచందర్ తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## అలంకార ప్రాయంగా మిగిలి పోతున్న కామన్వెల్త్ - మే 24... కామన్వెల్త్ దినోత్సవం


కామన్వెల్త్ అనేది.. ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లు లేకుండా.. సుహృద్భావంతో స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసివుండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్... ప్రపంచంలోని మూడో వంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం దాని వలస రాజ్యాల స్థాపన ప్రక్రియను ప్రారంభించినప్పుడు, మాజీ బ్రిటిష్ కాలనీల నుండి స్వతంత్ర రాష్ట్రాల ఏర్పాటుకు, గతంలో సామ్రాజ్యంలో భాగమైన దేశాల సంస్థ యొక్క అవసరం ఏర్పడింది. కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు 'ఎంపైర్ డే' అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటి అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాదనను 1898 లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా అమోదించారు. అలా 'ఎంపైర్ డే ' ఓ జాతీయ కార్యక్రమమైనది. 1884 లో, లార్డ్ రోజ్‌బెరీ అనే బ్రిటిష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని "కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్" గా అభివర్ణించాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య.. ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ అవసరమైంది. 1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డమ్ లో తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు . 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో 'ఎంపైర్ డే ' ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన ' మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ ను లాంచనంగా అహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు. 1927 నుండి 1929 వరకు ఉద్యమ తొలి అధ్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901 లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24 వ తేదీన ఏటా 'ఎంపైర్ డే' నిర్వహించాలని నిర్ణయించారు .




అలా 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడింది. 1931 లో, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో... ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించ బడింది. 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడగా, . 1949లో ఆ పేరు నుండి 'బ్రిటిష్' పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలస రాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది. ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర దేశాల 'ఫ్రీ అసోసియేషన్' పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది 'కామన్వెల్త్ నేషన్స్'గా రూపాంతరం చెందింది. కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటిష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటిష్ పాలనలో లేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావు భాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి. విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా దాదాపు 8.2 బిలియన్ ప్రజలు ఉన్నారు. 2024లో, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ఇది 8.1 బిలియన్లకు చేరుకుందని పేర్కొంది, ప్రపంచ జానాభాలో మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువమంది 30 ఏళ్ల లోపువారే. ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతిపెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని 31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే. 2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరవాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించు కున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యా రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేక రంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందుకోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్ల కోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేక పోలేదు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## రాజీ లేని పోరాట యోధుడు నల్లమల - మే 24...నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి

తెలంగాణ ప్రాంతం దశాబ్దాల కాలం నుండి ఉద్యమాలకు ఆలవాలం. నిరంకుశ వాదంపై అలుపెరుగని పోరాటం చేసిన కార్యస్థలం. నిజాం రాచరిక పాలన సాగుతున్న ఆ రోజుల్లో ప్రజలు బానిసలుగా బతికేవారు. నరకం చూసేవారు. ఖాసీం రజ్వీ అనుచరుల అకృత్యాలకు అడ్డూ అదుపూ లేకుండా ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ కరువైన దుస్థితి. తెలంగాణ పల్లెల్లో ఒకవైపు భూస్వాములు, రజాకార్ల ఆకృత్యాలపై సాయుధ దళాలు దాడులకు దిగుతుంటే.. మరోవైపు సింగరేణి బొగ్గు గనుల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులు కార్మికుల్లో చైతన్యాన్ని కలిగించాయి. ఈ ప్రాంతంలోని దేవులపల్లి శేషగిరిరావు అనే వ్యక్తి ఇల్లందు, కొత్తగూడెం కేంద్రాలుగా బొగ్గు గని కార్మికుల్లో పోరాట చైతన్యాన్ని నింపారు. నిజాం కాలంలోనే కార్మికులను రహస్యంగా సంఘటిత పరిచి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ను స్థాపించారు. భూస్వాములు, పోలీసుల దాడులను తిప్పికొట్టేందుకు శేషగిరిరావు సాయుధ దళానికి నాయకత్వం వహించారు. సాయుధ దళంతో భద్రాచలం ఏరియాలోని నెల్లిపాక అడవుల మీదుగా మణుగూరు వెళ్తున్న క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో శేషగిరి దళం నామ రూపాలు లేకుండా పోయింది. ఉద్యమ కారుడు శేషగిరిరావు కాల్చి చంప బడినపుడు శేషగిరి రావు పేరులోని గిరిని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని ముందుకు నడిపాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం పల్లెలకు పరిమితం కాలేదు. బొగ్గు గనుల్లో దుర్భర జీవితాలు అనుభవిస్తున్న కార్మికులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా నిజాంకు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఖాసీం రజ్వి అనుచరుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మడిమ తిప్పని పోరాటాలు కొనసాగించారు. గార్ల, బయ్యారం, ఇల్లందు ప్రాంతాల్లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ ప్రాంతం మధిర నియోజకవర్గం పరిధిలోకి వచ్చేది. అప్పట్లో మధిర వరంగల్ జిల్లాలో భాగస్వామ్యంగా ఉండేది. మధిర నియోజకవర్గం లోని ప్రతి ఊరు ఆనాటి నిజాం కు వ్యతిరేకంగా పోరాడింది. ప్రధానంగా ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ ప్రభుత్వం ఉండడంతో అక్కడి పోరాట ప్రభావం మధిరపై కనిపించేది. ఫలితంగా కమ్యూనిస్టులు ఇక్కడ ఆంధ్ర మహాసభ పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిపారు. మధిర లోని అల్లినగరంలో ప్రారంభమైన ఉద్యమం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది అని చరిత్రకారుల భావన. కమ్యూనిస్టు పార్టీ నేతలు నల్లమల గిరిప్రసాద్, బొమ్మకంటి సూర్యనారాయణ, మల్లు స్వరాజ్యం ఆధ్వర్యంలో ఆనాడు క్యాంపులు నిర్వహించారు. అలా ఆనాటి ప్రజా ఉద్యమాలతో విడదీయ జాలని సంబంధం, అనుబంధం కలిగి ఉన్నాడు నల్లమల గిరి ప్రసాద్. ఖమ్మం శాసనసభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, స్వాతంత్ర్య సమరయోధుల స్కీనింగ్ కమిటీ చైర్మన్ గా, విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షుడిగా, భారత కమ్యూనిస్టు పార్టీ అఖిల భారత డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా పేరెన్నిక గన్న భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం మచ్చలేని మహా నాయకుడు నల్లమల గిరిప్రసాద్. ఖమ్మం జిల్లా, మధిర మండలం, తొండల గోపవరం గ్రామంలో ఏప్రిల్ 6, 1931లో నల్లమల ప్రసాద్ జన్మించాడు. మద్రాస్ కళాశాలలో చదివే సమయంలో ఆంధ్రా మహాసభ కార్యకలాపాల పట్ల ఆకర్శితులయ్యాడు. 1947లో చదువుకు స్వస్తిచెప్పి ఆంధ్రా మహాసభలో, తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. నిజాం రాక్షస రజాకారుల మూకలు గ్రామాలపై పడి బీభత్సకాండ జరుపుతుండగా ప్రజలు తిరబడి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తుపాకి చేతబట్టి సాయుధుడయ్యాడు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు శేషగిరిరావును కాల్చి చంప బడినపుడు "శేషగిరి రావు" పేరులోని "గిరి"ని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని నడిపాడు. సాయుధ పోరాటం అనంతరం ఐదు సంవత్సరాల అజ్ఞాత జీవితం గడిపాడు. 1953లో అప్పటి ప్రభుత్వం గిరిప్రసాద్‌పై అనేక కేసులు నమోదుచేసి జైలుకు పంపగా, ఆ కేసులలో ఏదీ రుజువు కాలేదు. గిరి ప్రసాద్ 1953లో



ఉద్యమ కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికై 11 సంవత్సరాల పాటు కొన సాగాడు. 1962లో ఖమ్మం నుండి శాసన సభ్యునిగా ఎన్నికయ్యాడు. కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో సిపిఐ బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు విశేష కృషి చేశాడు. 1978లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై 1991 వరకు పని చేశాడు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షునిగా, 1992నుంచి రాజ్యసభ సభ్యుడుగా పనిచేశాడు. 1992లో సి.పి.ఐ. జాతీయ కార్యదర్శిగా, 1996లో ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్‌కమిటీ చైర్మన్‌గా పనిచేశాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడిన నల్లమల గిరిప్రసాద్ 1997, మే 24 న ఈ లోకాన్ని వదిలి వెళ్ళాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# కలల ఇళ్లు తారుమారు

సిరిసిల్ల: జిల్లాలో పంపిణీ చేసిన రెండు పడక గదులు లబ్ధిదారుల నుంచి చేతులు మారుతున్నాయి. సిరిసిల్ల పట్టణం, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట మండల కేంద్రాల్లో పలు విడతలుగా రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ జరిగింది. వీటిని లబ్ధిదారులు విక్రయిస్తున్నారనే విషయమై తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని రెండు పడక గదుల ఇళ్లను ఇటీవల రెవెన్యూ అధికారుల బృందాలు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పంపిణీ జాబితా ఆధారంగా గృహాల్లో ఉంటున్న వారి వివరాలను సేకరించారు. లబ్ధిదారులకు కేటాయించిన గృహాలు ఇతరులకు విక్రయించినట్లు అధికారుల విచారణలో తేలింది. కాగా ఈ వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. అంతేకాకుండా విడతల వారీగా జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

**ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి..**

సిరిసిల్ల పురపాలికలో పేదల కోసం మండేపల్లి, శాంతినగర్, రగుడు, పెద్దూరు ప్రాంతాల్లో 2052 గృహాలకు రూ.108 కోట్లు వెచ్చించి నిర్మించారు. ఒక్కో యూనిట్ 550 చదరపు అడుగుల విస్తీర్ణంలో మౌలిక వసతులు కలిపి రూ.6.05 లక్షలు వెచ్చించారు. వీటిలో మండేపల్లిలో 27 ఎకరాల్లో జీప్లస్‌టు పద్ధతిలో రూ.87.37 కోట్లతో 1,320 రెండు పడక గదులను నిర్మించారు. ఇక్కడి గృహాలకు మంచి డిమాండ్ ఉంది. పట్టణానికి దూరంగా ఉండటం.. అక్కడి నుంచి సిరిసిల్లకు పనికి రావాలంటే ఇబ్బంది పడేవారు.. మరికొందరు ఇతర అవసరాలకు విక్రయిస్తున్నారు. వీరి అవసరాలను అక్రమార్కులు ఆసరాగా చేసుకొని దందా కొనసాగిస్తున్నారు.

మండేపల్లి, పెద్దూరు, రగుడు ప్రాంతాల్లోని గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయగా శాంతినగర్‌లో లబ్ధిదారుల ఎంపికలోనే నిలిచిపోయింది. 2022 నుంచి విడతల వారీగా 1200 గృహాలను పంపిణీ జరిగింది. పంపిణీకి తొలుత దరఖాస్తులను ఆహ్వానించారు. జాబితా ప్రకటన, వార్డు సభలు ఇలా.. ఆరు విడతల్లో జరిగాయి. ఈలోపు వార్డుల్లో వసూళ్ల దందా మొదలైంది. ఇల్లు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. పంపిణీ సమయంలో ఈ వ్యవహారం పెద్ద దుమారమే లేపింది. వార్డుల్లో సామాజిక వర్గాల రిజర్వేషన్లు కేటాయించారు. అందులో ఒక్కో వార్డుకు 30 నుంచి 40 గృహాలను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు.

ప్రస్తుతం వీటిలో కింద ఉన్నవాటికి రూ.5 లక్షలు, పైన రెండో అంతస్తులో రూ.3 లక్షల చొప్పున గృహాలు విక్రయించారు. మరికొన్నింటిని అద్దెకు ఇస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ధ్రువపత్రంతోపాటు స్టాంప్ కాగితంపై డబ్బులు ముట్టినట్లు ఒప్పందం పత్రం రాసుకున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు లబ్ధిదారుల ఇళ్లలో వేరేవారు ఉండటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒక్క మండేపల్లిలోనే ఇప్పటికీ సుమారు 350 రెండు పడక గదులు బాండ్ కాగితాలపై విక్రయించినట్లు గుర్తించారు. మండేపల్లి, పెద్దూరు రెండుపడక గదుల సముదాయంలో రియల్ వ్యాపారులు మధ్యవర్తులుగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

# బకాయిలు రాబడితేనే.. ఆర్థిక వెసులుబాటు

గోదావరిఖని: సింగరేణి సంస్థకు బొగ్గు, విద్యుత్తు బిల్లులు వివిధ సంస్థల నుంచి రూ.కోట్లలో రావాల్సి ఉంది. మొత్తం రూ.35 వేల కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు జెన్‌కో, ట్రాన్స్‌కోలతో పాటు ఇతర విద్యుత్తు కేంద్రాలు భారీ మొత్తంలో బకాయిలు ఉన్నాయి. ఆయా సంస్థలు బిల్లులు చెల్లించకపోవడంతో సింగరేణి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఒక్కోసారి ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు కూడా చేతులు చాచాల్సిన పరిస్థితి వస్తోంది. బ్యాంకుల వద్ద ఓడీల ద్వారా విడుదల చేసుకుని చెల్లిస్తోంది. దాదాపుగా ఆరేళ్లకు పైగా సంస్థ సరఫరా చేస్తున్న బొగ్గు, విద్యుత్తుకు సంబంధించిన బిల్లులు కంపెనీలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

**పెట్టుబడులు ఆవశ్యకం**

ప్రస్తుతం సింగరేణికి కొత్త గనుల అవసరం ఉంది. నూతన బొగ్గుగనులు ఏర్పాటు చేస్తేనే సంస్థ మనుగడ ఉంటుంది. దీంతోపాటు నూతన విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు వేస్తోంది. రాజస్థాన్‌తో పాటు జైపూర్ ఎస్టీపీపీలో మరో థర్మల్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. వీటికి కనీసం రూ.15 వేల కోట్ల వరకు



అవసరం ఉంటుంది. ఇటీవల ఒడిశాలో నైనీ బొగ్గుబ్లాకు ప్రారంభించగా.. ఉత్పత్తికి అవసరమైన యంత్రాలు, సాంకేతికపరమైన అంశాలకు పెట్టుబడులు అవసరం. త్వరలోనే వీకే ఓసీపీతో పాటు మరి కొన్ని గనుల్లో కంటిన్యూస్‌మైనర్ యంత్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఉపరితల గనుల్లో కొత్త యంత్రాలు కొనుగోలు చేయాల్సి ఉంది. వీటికి అవసరమైన నిధులు వెచ్చించేందుకు సంస్థ భారీ మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తుంది. ప్రస్తుతం పేరుకుపోయిన బకాయిలు వస్తే ఆర్థిక వెసులుబాటు ఉంటుంది.

కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కూడా ఆర్థిక ఇబ్బందులు తప్పటం లేదు. సంక్షేమంలో భాగంగా వైద్య సౌకర్యాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు చేపట్టే పనులకు నిధుల కొరత ఏర్పడుతోంది. సంస్థ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు వెచ్చింపులో కూడా సమస్యలు వస్తున్నాయి. సింగరేణి కొత్తగా నివాస గృహాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. వీటి నిర్మాణానికి రూ.కోట్లలో నిధులు కావాలి. వీటన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిల చెల్లింపులే పరిష్కారం చూపిస్తాయి.

**కుంటుపడుతున్న అభివృద్ధి**

సింగరేణి సరఫరా బొగ్గు, విద్యుత్తు బకాయిలు ఆయా సంస్థలు వెంటనే చెల్లించాలి. లేదంటే ఆందోళనలు చేస్తాం. ఇప్పటికే రూ.కోట్లల్లో బకాయిలు పేరుకుపోయాయి. వాటిని చెల్లించకపోవడం వల్ల సంస్థ అభివృద్ధి కుంటుపడుతోంది. నిధులు వెచ్చించటానికి వెనకడుగు వేస్తోంది. చాలాసార్లు ఈ విషయంపై యాజమాన్యంతో మాట్లాడాం. బకాయి పడిన సంస్థలపై సింగరేణి ఒత్తిడి తేవాలి.

వై.సత్తయ్య, బీఎంఎస్ నాయకుడు

# 'కోటి' ఆశలతో మొదలై.. పట్టింపు కరవై



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని మోడల్ తెలంగాణ క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దాలని అప్పటి భారాస ప్రభుత్వం సంకల్పించింది. ఆధునిక హంగులతో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు రూ.కోటి నిధులను మంజూరు చేసినా పనులకు పూర్తిస్థాయిలో ఇంకా మోక్షం లభించడం లేదు.

**ఇదీ పరిస్థితి**

మైదానంలో సిమెంటుతో క్రికెట్ పిచ్‌ను నిర్మించి, జాతీయ స్టేడియాల మాదిరిగా పచ్చిక (లాన్ గ్రాస్) ఏర్పాటు చేశారు. గ్రౌండ్ తయారీకి ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలు, మరో రూ.5 లక్షల గ్రామ పంచాయతీ నిధులను వెచ్చించారు. సిమెంట్ పిచ్‌కు రూ.1.50 లక్షల మండల పరిషత్తు నిధులు ఖర్చు చేశారు. మైదానం చివరలో నీడనిచ్చే చెట్లతోపాటు అందమైన పూల మొక్కలు నాటారు. రూ.1.50 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో మైదానం చుట్టూ కొంత మేర ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. కళాశాల భవన గోడ, అసంపూర్తిగా మిగిలిన ప్రహరీపై సీఎస్ఆర్ నిధులతో చూపరులను ఆకట్టుకునేలా క్రీడలు, ఆయా క్రీడాకారుల చిత్రాలను వేయించారు. కళాశాల భవన గోడపై వేసిన విరాట్ కోహ్లీ భారీ వాల్‌పెయింట్ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మైదానం నిర్వహణను అధికారులు గాలికొదిలేడంతో లాన్‌గ్రాస్ పూర్తిగా కనుమరుగై, మైదానం గుంతలమయమైంది. పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు పెరుగుతున్నాయి. బౌండరీలైన్ చుట్టూ నాటిన అనేక అలంకరణ, పూల మొక్కలు పశువులు, గొర్రెలు, మేకలకు మేతగా మారగా మరిన్ని మొక్కలు నీరులేక పూర్తిగా ఎండిపోయాయి.

**చేపట్టాల్సిన పనులివే..**

క్రీడా ప్రాంగణంలో వసతుల కల్పనకు రాజ్యసభ సభ్యుడి నిధులు రూ.కోటి మంజూరయ్యాయి. ఆ నిధులను వెచ్చించి, ఆధునిక హంగులతో మోడల్ తెలంగాణ క్రీడా ప్రాంగణానికి తీర్చిదిద్దే పనులను అప్పటి మంత్రి కేటీఆర్ 2023 ఫిబ్రవరిలో ప్రారంభించారు.

మైదానం ప్రారంభంలో స్వాగతతోరణాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

వాలీబాల్, షటిల్ కోర్టులను నిర్మించాలి.

ఇండోర్ గేమ్స్ ఆడేందుకు, ఆట వస్తువులను భద్రపరిచేందుకు, ప్రాంగణం నిర్వహణ కోసం పరిపాలనా భవనాన్ని నిర్మించాలి.

గ్యాలరీ, వ్యాయామశాల, లైటింగ్ సిస్టం, నాలుగు ఫ్లడ్‌లైట్లు, మూత్రశాలలను ఏర్పాటు చేయాలి. నీ 30 మీటర్ల పొడవునా గ్యాలరీని నిర్మించి, పైకప్పును మరిచారు.

మైదానంలో విద్యుత్తు స్తంభాల వల్ల గ్యాలరీ పైకప్పు నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. స్తంభాలను తొలగించగానే గ్యాలరీ పైకప్పు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. మైదానం నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీ అధికారులు చూసుకోవాల్సి ఉందన్నారు.

# జాలువాగు.. వృథాగా నీరు



కోనరావుపేట: అటవీప్రాంతంలోని జాలువాగు నీటిని నిల్వ చేయటానికి రెండు దశాబ్దాల క్రితం వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కుంట నిర్మాణం చేపట్టారు. వేసవిలో సైతం నీటితో కళకళలాడగా.. వన్యప్రాణులు, పశువులు దాహార్తి తీర్చుకోవటానికి సౌకర్యంగా ఉండేది. సుమారు నాలుగు గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు దోహదపడింది. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. దీంతో నీరు వృథా పోవటంతో కుంట అలంకారప్రాయంగా మారింది. అవసరమైన మరమ్మతు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


**ఇరవై ఏళ్ల క్రితం నిర్మాణం**

కోనరావుపేట మండలం మరిమడ్ల శివారులోని అటవీ ప్రాంతంలో ఏడాది పొడవునా జాలవాగు పారుతోంది. మరిమడ్ల, రుద్రంగి మండలం మానాల, సిరికొండ మండలం సీమన్‌పల్లి, జినగాల, తాటిపల్లి వందల ఎకరాల్లో అటవీప్రాంతం ఉండటంతో వన్యప్రాణులు వందల సంఖ్యలో ఉంటాయి. వాగు నీరు వృథా పోకుండా నిల్వ చేయడానికి ఇరవై ఏళ్ల క్రితం వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పెద్ద కుంట నిర్మాణం చేపట్టారు. వర్షపు నీటితోపాటు జాలువాగు నీరు ఏడాదంతా పారటంతో నీటితో కళకళలాడింది. వన్యప్రాణులు, గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు దాహార్తి తీర్చుకోవటానికి సౌకర్యంగా ఉండేది. మరిమడ్లతోపాటు, వట్టిమల్ల, జైసేవాలాల్ అజ్మీరాతండా, జైసేవాలాల్ కమ్మర్‌పేటతండా, గొల్లపల్లి గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు దోహదం చేసింది. బోర్లు, బావుల్లో నీరు ఆశాజనకంగా ఉండేది. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు జాలువాగు కుంట కట్ట తెగిపోయింది. గతేడాది ఉపాధి హామీలో మరమ్మతు చేపట్టినా.. గతేడాది కురిసిన వర్షాలకు ధాటికి మళ్లీ తెగిపోయింది. మరమ్మతులు చేపట్టాలని రైతులు ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి విన్నవించారు.

**పాలకులు స్పందించాలి– కుమ్మరి దిలీప్‌కుమార్, మరిమడ్ల**

జాలువాగు వన్యప్రాణుల దాహార్తి తీర్చేది. విశాలమైన అటవీప్రాంతం, ఆహ్లాదకర వాతావరణం ఉండటంతో పర్యాటకులు సైతం ఇక్కడకి వచ్చేవారు. ప్రస్తుతం కుంటలో నీరులేక వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవటానికి వ్యవసాయ క్షేత్రాలను ఆశ్రయిస్తూ ప్రమాదాల బారినపడి మృతిచెందుతున్నాయి. స్థానికంగా భూగర్భ జలాలు సైతం పడిపోయి పంటలు చివరి దశలో ఎండిపోయాయి. అధికారులు, పాలకులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

# దక్షిణ దిశగా కన్నేసి.. హద్దురాళ్లను పాతేసి..!



నకిరేకల్ : నకిరేకల్ పెద్ద చెరువులో పూడ్చివేతలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అక్రమంగా పూడ్చివేస్తూ.. పెద్దపెద్ద క్రికెట్ మైదానాల్లా మార్చుతున్నా.. నీటిపారుదల, పురపాలిక, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. గత దశాబ్దకాలం నుంచి చెరువుపై కన్నేసిన అక్రమార్కులు ఏదో ఒక ఆధారం సంపాదించి అక్రమ నిర్మాణాలకు తెరలేపుతున్నా పట్టించుకునేవారు లేరు. తాజాగా చెరువు దక్షిణభాగంలో రెండు ఎకరాలకుపైగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో పూడ్చివేతలు చేపట్టి ప్లాట్లుగా మార్చేందుకు హద్దురాళ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

నకిరేకల్ పురపాలిక పరిధిలో పాత జాతీయ రహదారి వెంట 692 సర్వే నెంబరులో 50 ఎకరాలకుపైగా శిఖం విస్తీర్ణంతో పెద్ద(నల్ల)చెరువు ఉంది. పాత జాతీయ రహదారివైపు, పడమటి వైపు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు పూర్తిగా నిర్మాణాలతో నిండిపోయాయి.

పూర్వ కాలంలో చెరువు శిఖంలో కేవలం నీరు లేనప్పుడు సాగుకోసం పట్టాలు పొందిన వారు గత రెవెన్యూ లొసుగుల ఆధారంగా ఈ పట్టాలకు రిజిస్ట్రేషన్లు పుట్టించి యథేచ్ఛగా క్రయవిక్రయాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 41 ఇళ్ల నిర్మాణాలు అక్రమంగా ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో చెరువును పూడ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా ఏం కాదులే అనే ధీమాతో కొత్తగా పూడ్చివేతలకు తెగబడుతున్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చినా..

ఈ చెరువును 2017లో రూ.6 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధిచేసినా ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. రాష్ట్ర పర్యాటకాభివద్ధి సంస్థ సహకారంతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వేముల వీరేశం తాజాగా ప్రకటించారు. వాకింగ్ ట్రాక్, సుందరీకరణ, చెరువు శిఖం చుట్టు దారి, హద్దుల వెంట ఆక్రమణలకు గురికాకుండా పెద్దపెద్ద వృక్షాల పెంపకం, స్మృతివనం వంటి వాటిని నిర్మించి చెరువును కాపాడుతామని ఆయన వివరించారు.

చర్యలు తీసుకుంటాం

భూషణాచారి, డీఈఈ, నీటిపారుదల శాఖ, నకిరేకల్ డివిజన్

నకిరేకల్ పెద్ద చెరువు (మినీ ట్యాంక్‌బండ్) ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో తాజాగా పూడ్చివేతలతో మైదానంలా మార్చుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై పరిశీలన చేయాలని ఏఈకి సూచించాం. నేను స్వయంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు చేపడతాం.

# కళాశాల... పిలుస్తోంది

నల్గొండ : నిరుపేద విద్యార్థులకు ఆ కళాశాల వరం. విశాలమైన క్రీడా మైదానం, నూతన తరగతి గదులు, అధునాతన ప్రయోగశాలలు, శుద్ధ జలం, అతి పెద్ద గ్రంథాలయం ఇలా ఎన్నో సౌకర్యాలతో ఆదర్శంగా నిలుస్తోంది నల్గొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనలో ఏటా విద్యార్థులు ఆయా కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. టీఎస్‌కేసీ ద్వారా విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించి వారు కొలువులు సాధించేలా కృషి చేస్తున్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటి విభాగాలను అమలు చేస్తూ విద్యార్థులను సమాజ సేవలో భాగస్వాములు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు కళాశాల ఆహ్వానం పలుకుతోంది.

గ్రంథాలయం పూర్తిగా డిజిటలైజేషన్ చేశారు. 60 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు కళాశాల ఐడీ కార్డు ద్వారా పుస్తకాలు అందిస్తారు. అకడమిక్‌తో పాటు పీజీ ఎంట్రెన్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, రీడింగ్ హాల్‌లో వివిధ వార పత్రికలు, దినపత్రికలు ఉంటాయి.

**1560 సీట్లు** ఎన్జీ కళాశాలలో డిగ్రీతో పాటు పలు పీజీ కోర్సులు ఉన్నాయి. మొత్తం 10 కోర్సుల్లో 27 గ్రూపులు ఉన్నాయి. బీఎస్సీ,




బీఏ, బీకాంతో పాటు బీసీఏ, బీబీఏ వంటి అదనపు కోర్సులుండగా ఆయా విభాగాల్లో మొత్తం 1560 సీట్లున్నాయి. ఈ సీట్లన్ని దోస్త్ ద్వారానే భర్తీ అవుతాయి. ఇక్కడ చదువుకోవడం అదృష్టం: లీలావతి, విద్యార్థిని నేను బీఏ ప్రథమ సంవత్సరం ఇటీవల పూర్తి చేశాను. కళాశాలలో సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నూతన భవనంలోకి తరగతులు ప్రారంభించారు. ప్రయోగశాలలు ఎంతో బాగున్నాయి. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఎంతో మెరుగ్గా పాఠాలు బోధిస్తున్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎన్జీ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపాలి.

దరఖాస్తు చేసుకోవాలి : ఉపేందర్, ఎన్జీ కళాశాల ప్రిన్సిపల్

ఎన్జీ కళాశాలకు రాష్ట్రంలోనే గొప్ప చరిత్ర ఉంది. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారు. ప్రస్తుతం కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్ ఉంది. రానున్న రోజుల్లో ఏ గ్రేడ్ సాధన కోసం మరింత కృషి చేస్తాం. విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపులో దోస్త్ ప్రక్రియ ద్వారా ప్రవేశం పొందవచ్చు.

# ప్రతి'నిధులు' లేక.. పడకేసిన పల్లెలు

నల్గొండ : పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. జిల్లా స్థాయి అధికారులను క్లస్టర్ల వారీగా ప్రత్యేకాధికారులగా ప్రభుత్వం నియమించినా.. ప్రత్యేక అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. అసలు కొన్ని గ్రామాలకు ప్రత్యేక అధికారులు ఉన్నారన్న సంగతి తెలియకపోవడం గమనార్హం. ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా.. ఇంకా కొంతమంది ఒకసారి కూడా గ్రామాన్ని సందర్శించకపోవడం శోచనీయం.

**అపరిశుభ్రంగా పల్లెలు**

గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అన్నీ తామై చూస్తున్నారు. వారి విధుల కంటే ఇతర పనులు అప్పగించడంతో తీరిక లేకుండా ఉన్నారు. గతంలో ఓటర్ల జాబితా, వార్డుల విభజన, కులగణన చేశారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల సర్వే, నిర్మాణాల ప్రారంభం వంటి పనులు చేపడుతూ పంచాయతీ పాలన పక్కన పెట్టేశారు. ప్రత్యేకాధికారులు కేవలం దస్త్రాలపై సంతకాలు చేసేందుకే వస్తున్నారు కానీ.. ఇతర రోజుల్లో గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో చెత్త శుద్ధి కేంద్రాల నిర్వహణ పడకేసింది. రూ.లక్షలు వెచ్చించి చెత్త రిక్షాలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసినా చెత్తను తరలించడం లేదు. ట్రాక్టర్లు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. వీధిదీపాలు మసకబారిపోతున్నాయి. కాల్వలు దుర్వాసన వ్యాపించి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పరిసర ప్రాంతాలు పొగతో నిండుకుంటున్నాయి. మరి కొన్ని గ్రామాల్లో పూర్తిగా వ్యర్థాలను చెత్త శుద్ధి కేంద్రాలకు తరలించకుండానే వాగులు, వంకల్లో పారబోస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల సమన్వయలోపంతో గ్రామాల్లో పారిశు



ద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, మంచినీటి సరఫరా, బోర్ల మరమ్మతులు పనులు నిలిచిపోతున్నాయి.

**సమన్వయలోపం**

ప్రత్యేక పాలనలో నిధులు వస్తేనే పనులు లేకుంటే లేదు అన్న విధంగా మారింది. పేరుకే ప్రత్యేక అధికారులు.. భారమంతా మాపై పడుతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా సమస్యలను సొంత ఖర్చుతో పరిష్కరించినా దానికి ప్రత్యేకాధికారుల నుంచి సవాలక్ష కొర్రీలు, నేతల ఒత్తిళ్లతో నలిగిపోవాల్సి వస్తోందని వెనకడుగు వేస్తున్నారు. నకిరేకల్ మండలంలో 4,684 మంది జనాభాతో చందుపట్ల పెద్ద గ్రామ పంచాయతీతోపాటు చారిత్రక ప్రాధాన్యం ఉన్న గ్రామం. పంచాయతీ కార్యాలయానికి సమీపంలోనే రెండు ప్రధాన వీధుల్లో కాల్వల్లో మురుగు పేరుకుని ధ్వంసమై అధ్వానంగా మారాయి. ఏటా రూ.3.25 లక్షల ఇంటి పన్ను వసూలు కావాల్సి ఉన్నా.. 2024–25లో రూ.1.40 లక్షల పన్నులు మాత్రమే వసూలు చేశారు. ఇక్కడ పనిచేసే కార్యదర్శిని డిప్యూటేషన్‌పై ఒక చిన్న గ్రామానికి బదిలీచేసి ఇతనికే చందుపట్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. మిర్యాలగూడ మండలం జంకుతండాలో ఖాళీ స్థలాలు, పక్క కాల్వలతో పాటు ఇళ్ల నుంచి వ్యర్థాలను రోజుల తరబడి తొలగించకపోవడంతో భారీగా పేరుకుపోయి భరించలేని దుర్వాసన, దోమల వ్యాప్తితో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. మరో వైపు తాగునీరు రోజుల తరబడి సరఫరా కాకపోవడంతో వేసవిలో అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడట్లేదని ప్రజలు వాపోతున్నారు.

# నడ్డివిరుస్తున్నాయ్..!

కోరుట్ల: జిల్లాలో జగిత్యాల తర్వాత రెండో అతిపెద్ద పట్టణం కోరుట్ల. పట్టణంలో దారులన్నీ గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. మొత్తం 33 వార్డులుండగా సుమారు 86 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. రోజురోజుకు పట్టణం విస్తరించినంతగా అభివృద్ధి కనిపించడం లేదు. నాలుగేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకం కింద సుమారు 190 కి.మీల పైగా సీసీరోడ్లు, మట్టిరోడ్లను తవ్వి ఇంటింటికీ కుళాయిలను బిగించారు. భగీరథ పైపులైన్ నిర్మాణంతో సిమెంట్ రోడ్లను తవ్వారు. నాసిరకంగా మరమ్మతు చేసి వదిలేశారు. దీంతో పట్టణంలో ఏవార్డుకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు నడిపించే వారి నడ్డి విరిచేలా సిమెంట్‌రోడ్లు మారాయి. అయిదేళ్లుగా దెబ్బతిన్న సీసీరోడ్లపై నూతన రోడ్ల నిర్మాణాలు చేట్టాలని పట్టణ ప్రజలు బలియా అధికారులు, పాలకులతో మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. టీయూఎఫ్ఐడీసీ కింద పట్టణంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణాలకు రెండేళ్ల కిందట రూ.15 కోట్ల నిధులు మంజూరుకాగా నవంబరు 2024లో అప్పటి ఎమ్మెల్యే భూమి పూజ సైతం చేశారు. అనంతరం రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పాత టీయూఎఫ్ఐడీసీ నిధులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం కొత్తగా ఎన్నికైన కోరుట్ల శాసనసభ్యులు



డా.సంజయ్ ప్రతి అసెంబ్లీ సమావేశాల్లోనూ కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు టీయూఎఫ్ఐడీసీ కింద గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30 కోట్ల నిధులు విడుదల చేయాలంటూ వాపోయినా ప్రభుత్వం విడుదల చేయడం లేదు. పట్టణంలో 200 కి.మీ వరకు మురుగు కాలువలున్నాయి. చాలావరకు కాలువలు దెబ్బతిని గోడలు కూలిపోతున్నాయి. కాలువల పైకప్పులు దెబ్బతిని బుంగలు పడుతున్నా నిధులు లేవంటూ నూతన నిర్మాణాలు చేపట్టకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. రాత్రిపూట దెబ్బతిన్న రోడ్లు, మురుగు కాలువతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి బోల్తాపడి గాయాలపావుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పురపాలక సంఘ ఏఈ అరణ్‌కుమార్‌ను వివరణ కోరగా రెండేళ్ల కిందట రూ.15 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని, తర్వాత ప్రభుత్వం వాటిని నిలిపివేసిందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే పట్టణంలో నూతనంగా సిమెంట్‌రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు.

# పెరిగిన రద్దీ..
# సౌకర్యాలు లేక ఇబ్బంది

మిర్యాలగూడ : మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో పాటు సంస్థ సైతం ఆదాయ బాట పట్టింది. ఈ తరుణంలో సంస్థ ఉన్నతాధికారులు పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతూ..ప్రయాణికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారు చేపట్టే కార్యక్రమాల ఫలాలు క్షేత్ర స్థాయిలో ప్రయాణికులకు అందకపోవడం, సేవలు నాణ్యతతో లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఇదే తీరు నెలకొంటుంది.

**మరుగుదొడ్లకు తాళం..**

అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉచితంగా వాడుకునే సదుపాయాన్ని సంస్థ కల్పించింది. ఇందుకు గాను టికెట్‌తో పాటే ప్రత్యేక సెస్సును సైతం ప్రయాణికుల నుంచి వసూలు చేస్తుంది. పలు బస్టాండ్లలో ఆర్టీసీ మరుగుదొడ్లతో పాటు ప్రైవేట్ మరుగుదొడ్లు సైతం ఉన్నాయి. ఆర్టీసీ మరుగుదొడ్లను నీళ్లు లేవనే కారణంతో ఎక్కువ సమయం మూసి ఉంచుతుండడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు డబ్బులు చెల్లించి ప్రైవేట్ మరుగుదొడ్లను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. మిర్యాలగూడలో ఆర్టీసీ మరుగుదొడ్ల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది.. ప్రైవేటు వారితో కుమ్మక్కై తరచూ ఉచిత మరుగుదొడ్లకు తాళం వేస్తున్నారనే



ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

**కానరాని ప్రథమ చికిత్స పెట్టెలు..**

ఆర్టీసీ బస్సుల్లో పల్లె వెలుగు నుంచి ఏసీ బస్సు వరకు ప్రథమ చికిత్స పెట్టెలు తప్పని సరిగా ఉండాలి. అందులో చిన్న చిన్న గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు అవసరమైన మందులు, కాటన్, కట్టు కట్టే వస్త్రం వంటివి అందుబాటులో ఉంచాలి. ఇటీవల కొత్తగా వచ్చిన బస్సులను మినహాయిస్తే మిగిలిన 70 శాతం బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోగా పెట్టెలు ఉన్న బస్సుల్లో వాటిని సిబ్బంది మందులకు బదులుగా టిక్కెట్ ముద్రణ కాగితం, ఇతర సామగ్రి దాచుకునేందుకు ఉపయోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో సుమారు 590 బస్సులు ఉండగా వేలాది మంది ప్రయాణికులు నిత్యం వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

**వేసవిలో వేడి నీరే గతి...**

సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారికి తాగునీటి సీసా అందిస్తున్నారు. ఇందుకు గాను ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.10 అదనంగా ఛార్జితో పాటే వసూలు చేస్తున్నారు. వేసవిలో నీళ్ల సీసాలు మొత్తం వేడిగా మారుతుండడంతో ప్రయాణికులు ఆ నీటిని తాగేందుకు వెనుకాడుతున్నారు. తమ వద్ద నుంచి డబ్బు వసూలు చేస్తున్నప్పటికీ కనీసం వేసవిలో నైనా చల్లని నీరు అందించే ఏర్పాటు చేయట్లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం

కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు ఉండాలి. పాత బస్సుల్లో చికిత్స సామగ్రి గడువు తేదీ ముగియడంతో తీసేస్తున్నాం. కొత్తగా వచ్చిన బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉన్నాయి. పాత వాటిలో సామగ్రి అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. సూపర్ లగ్జరీ బస్సుల్లో వేసవిలో తాగునీరు వేడిగా ఉండకుండా చర్యలు తీసుకుంటాం. అన్ని బస్టాండ్లలో 24 గంటల పాటు ఉచిత మరుగుదొడ్లు తెరిచే ఉంచేలా ఆదేశాలు జారీ చేస్తాం.

# మట్టి తరలిస్తూ.. గట్టును సాగు చేస్తూ



మల్యాల: మల్యాల మండలంలో రాజారం గ్రామ శివారు నుంచి తాటిపల్లి వరకు దాదాపు 15 కి.మీల పొడవు కాకతీయ కాలువ ఉంది. దీనికి ఇరువైపులా మట్టి మాయం కావడంతో ఆయా గ్రామాల పరిధిలో వందలకొద్ది ఎకరాల విస్తీర్ణంలోని కాలువ భూములను ఆక్రమించుకొని పొలాలుగా మారుస్తున్నారు. కొందరు మామిడి తోటలను కూడా సాగు చేసుకున్నారు. ఇళ్లకు ఆనుకొని ఉన్న భూముల్లో నిర్మాణాలు చేపట్టినా అధికారులు స్పందించడంలేదు. రాజారం వద్ద కాకతీయ కాలువగట్టుపై భవనాలు, ఇతర నిర్మాణాలు జరిగినా ఎలాంటి చర్యలు లేవు. మండలంలోని రాంపూర్ శివారు నుంచి బల్వంతాపూర్ శివారు వరకు దాదాపు 20 కి.మీ వరద కాలువ గట్టుపై ఉన్న మట్టిని తరలిస్తున్నారు. మట్టి తరలింపు కోసం తక్కువ చలానా చెల్లిస్తూ పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలిస్తుండటంతో కనుమరుగవుతున్నాయి. గుత్తేదారుల నుంచి సంబంధిత శాఖ సిబ్బంది మామూళ్లు తీసుకుంటూ అక్రమ దందాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చదునుగా మారిన భూములను ఆక్రమించుకొని కొందరు సాగు చేసుకుంటుండగా కొన్ని చోట్ల అక్రమ నిర్మాణాలు కూడా వెలిశాయి. వరద కాలువ స్థలంలో క్రషర్లు ఏర్పాటు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. మల్యాల మండలంలో వరద కాలువ, ఎస్సారెస్పీ కాకతీయ కాలువ గట్లు మాయమవుతున్నాయి. దాదాపు 75 మీటర్ల కుడి 75 మీటర్ల ఎడమ వైపు వెడల్పుగల కాలువ గట్లపై గుట్టలుగా ఉన్న రాళ్లు, మట్టిని కొందరు అక్రమంగా తరలించుకుపోతున్నారు. కొందరు గుత్తేదార్లు మట్టి, రాళ్లు తీయడానికి ఇరిగేషన్ శాఖకు తక్కువ మొత్తంలో చలానా చెల్లిస్తూ అధిక మొత్తంలో రోజుల తరబడి మట్టిని రవాణా చేయడం సర్వ సాధారణమైపోయింది.

**సర్వే చేయించి చర్యలు**

ఎస్సారెస్పీ కాలువ స్థలాల ఆక్రమణలను గుర్తించేందుకు సర్వే చేపట్టి వివరాలను డిజిటలైజేషన్ చేయిస్తాం. 1970లో ప్రాజెక్టు కాలువలు, క్యాంపుల నిర్మాణాలకు సేకరించిన స్థలాలను పరిరక్షిస్తాం. తాజా మ్యాప్‌ల ప్రకారం స్థలాల హద్దులను నిర్ణయించి భూములు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటాం. లక్షలాది ఎకరాల పంటపొలాలకు సాగునీరందించే కాలువ భూముల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలి. – ఎహెచ్.ఖాన్, నీటిపారుదల శాఖ అధికారి

**మొక్కలు నాటిస్తాం..** వరద కాలువకు ఇరువైపులా రాళ్లు, మట్టిని అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేయించి, వాహనాలు సీజ్ చేయిస్తున్నాం. వరద కాలువ స్థలంలో అక్రమంగా క్రషర్లు, ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా సర్వే చేయించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. వరద కాలువ స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు హద్దులు ఏర్పాటు చేయించి అందులో మొక్కలు నాటేందుకు ఈజీఎస్‌కు అప్పగిస్తాం.– తిరుపతి, ఇరిగేషన్ డీఈ

# వరదొస్తే రాకపోకలు బంద్



ఇబ్రహీంపట్నం : వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయాల్లో వరదలతో మండలంలోని ఫకీర్ కొండాపూర్, వర్షకొండ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఆయా గ్రామాల శివార్లలో లోలెవల్ వంతెనల వద్ద వరద ఉద్ధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో సైతం ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించలేరు. ఇన్నేళ్లు రెండు గ్రామాలు దిగ్బంధంలో ఉంటున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.


**నిలిచిన పనులు**

ఫకీర్ కొండాపూర్ గ్రామ జనాభా సుమారు 1150 వరకు ఉంటుంది. గ్రామానికి ఒక దారి మండలంలోని యామాపూర్ గ్రామం నుంచి ఉండగా, మరో దారి మల్లాపూర్ మండలం నడికుడ గ్రామం నుంచి ఉంటుంది. ఫకీర్ కొండాపూర్ గ్రామశివార్లలో రెండు రహదారులపై లోలెవల్ వంతెనలున్నాయి. భారీ వర్షం కురిసినప్పుడల్లా లోలెవల్ వంతెనల వద్ద వరద ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఆయా సమయాల్లో అత్యవసర పరిస్థితులున్నా ఏమి చేయలేని పరిస్థితి గ్రామస్థులది. ఫకీర్ కొండాపూర్ నుంచి యామాపూర్ వెళ్లే దారిలో లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా నిర్మాణ పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశకు చేరిన తర్వాత పనులు నిలిచిపోయాయి. కొన్ని నెలలుగా పనులు నిలిచి పోవడంతో ఈ సంవత్సరం కూడా తిప్పలు తప్పేలా లేవని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

**శంకుస్థాపనకు రెండేళ్లు**

వర్షకొండ గ్రామ జనాభా సుమారు 6000 వరకు ఉంటుంది. గ్రామానికి ప్రధానంగా ఇబ్రహీంపట్నం నుంచి రెండు వరుసల రహదారి, నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల గ్రామం నుంచి రెండు వరుసల ప్రధాన రహదారి ఉంటుంది. ఇబ్రహీంపట్నం, వర్షకొండ మధ్య రహదారిపై రెండు లోలెవల్ వంతెనలు, ఏర్గట్ల నుంచి వర్షకొండ మధ్య రహదారిపై ఏర్గట్ల గ్రామశివారులో ఓ లోలెవల్ వంతెన ఉంటుంది. వర్షకొండ, డబ్బా గ్రామాల మధ్య రహదారిపై వర్షకొండ శివారులో ఓ లోలెవల్ వంతెన ఉంటుంది. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు ఆయా వంతెనల వద్ద వరద ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. ఇబ్రహీంపట్నం, వర్షకొండ మధ్య రహదారిపై ఉన్న రెండు లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి రెండేళ్లు అవుతున్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

# సీలింగ్ భూముల్లో రిజిస్ట్రేషన్లు రద్దు



కరీంనగర్: నిషేధిత జాబితాలో ఉన్న సీలింగ్ భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి రద్దు చేశారు. లోకాయుక్త ఆదేశాలతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి హవేలిలో సర్వే నంబర్లు 175, 197, 198లలో దాదాపుగా 20 ఎకరాల సీలింగ్ భూమి ఉంది. ఈ భూముల విషయంలో కొన్నేళ్లుగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ స్థలాలను కొందరు ఆక్రమించుకుని ఇంటి నంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన నరెడ్ల శ్రీనివాస్ 2015లో లోకాయుక్తను ఆశ్రయించగా ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు, రిజిస్ట్రేషన్‌లు జరపకూడదని 2016లో ఆదేశాలిచ్చింది. అప్పటి నుంచి ఈ సర్వే నంబరు భూములను నిషేధిత జాబితాలో పెట్టినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కరోనా సమయంలో 2021 ఫిబ్రవరిలో నరెడ్ల శ్రీనివాస్ మృతి చెందారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడంతో చదరపు గజాల రూపంలో పలు ప్లాట్లను ఇంటి సంఖ్యలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారులు ఇటీవల గుర్తించారు. 2018 నుంచి 2024 వరకు మొత్తంగా ఈ భూముల్లో 476 డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ భూముల్లో ఎందుకు రిజిస్ట్రేషన్లు జరిగాయని లోకాయుక్త ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం నివేదికను అందించింది. కలెక్టర్ పమేలా సత్పతి ఈ నెల 12న ఈ భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**కొనుగోలుదారుల్లో ఆందోళన**

నిషేధిత జాబితాలో ఉన్న భూములు కొన్నవారు రిజిస్ట్రేషన్లు రద్దు చేయడంతో ఆందోళనలో మునిగిపోయారు. ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు రూ.80 కోట్ల వరకు ఉంటుంది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు చక్రం తిప్పారనే ఆరోపణలున్నాయి. కొత్తపల్లి మండలంలోని భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు గంగాధరలోని కార్యాలయంలో జరుగుతుండటం వల్ల కూడా రిజిస్ట్రేషన్ల వ్యవహారం కొత్తపల్లి రెవెన్యూ అధికారులు గుర్తించలేదనే వాదనలున్నాయి. నిషేధిత భూములకు సంబంధించి ఎఫ్1/07/2015 లేఖ ద్వారా కలెక్టర్ కార్యాలయం నుంచి 2016 ఆగస్టు 23వ తేదీన జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఈ భూముల వివరాల్ని పొందుపరుస్తూ లేఖ రాసినట్లు కలెక్టరేట్ వర్గాలు స్పష్టం చేశాయి. 2016 డిసెంబరు 29న అప్పటి డీఆర్వో మరో లేఖని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరవేశారు. అయినా ఈ భూముల్లో ఏకంగా 476 ప్లాట్లకు సంబంధించిన క్రయవిక్రయాలు జరగడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఉదాసీనంగా వ్యవహరించిందన్న ఆరోపణలు వస్తున్నాయి. సర్వే నంబర్లు కాకుండా ఇంటి నంబర్లతో ఈ రిజిస్ట్రేషన్‌లు చేస్తూ వచ్చినట్లు డాక్యుమెంట్‌లను బట్టి తెలుస్తోంది. ఈ విషయమై కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌ను సంప్రదించగా గతంలో ఈ భూముల విషయంలో అప్పటి కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ రాశారని తెలిపారు. కొత్తపల్లి హవేలిలోని మూడు సర్వే నంబర్లలో జరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను జిల్లా కలెక్టర్ రద్దు చేసిన మాట వాస్తవమేనన్నారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రద్దు చేయమని జిల్లా కలెక్టరు ఉత్తర్వులిచ్చారని తెలిపారు.

# సహజ సాగుకు సమాయత్తం

కొత్తగూడెం: ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సహజ పద్ధతుల్లో విభిన్న పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు 'నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫార్మింగ్' పథకానికి శ్రీకారం చుట్టింది. మూసపద్ధతిలో సాగుకు స్వస్తిపలికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించే పంటలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలో 15, భద్రాద్రి జిల్లాలో 22 క్లస్టర్లలో 33 గ్రామాలను ఎంపిక చేసింది. త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

జాతీయ సహజ వ్యవసాయ మిషన్ విశేషాలు..

సురక్షితమైన పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సహజ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తుంది.

2025–26లో ఈ పథకం కోసం వెచ్చించే రూ.2,481కోట్ల మూలధనంలో కేంద్ర ప్రభుత్వం రూ.1,584కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.897కోట్లు ఖర్చు చేయనున్నాయి.

ఇప్పటికే సాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తున్న రైతులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు), వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు) వంటి వాటికి ఈ పథకంలో ప్రాధాన్యమిస్తారు.

సేంద్రియ వ్యవసాయానికి అవసరమయ్యే సహజ ఉత్పత్తులను రైతులకు సులభంగా అందుబాటులో ఉంచేందుకు అవసరాన్ని బట్టి జీవాధార వనరుల కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతుల పొలాల్లో 2వేల వరకు నమూనా



సహజ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పుతారు.

ఆసక్తి గల రైతులకు నిపుణులైన శిక్షకులు (మాస్టర్‌ట్రైనర్లు) సహజ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువుల తయారీ వంటి వాటిలో శిక్షణనిస్తారు.

జిల్లాల్లో ఎంపిక చేసిన వ్యవసాయ క్లస్టర్లలో ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు, స్థానిక రైతుల మధ్య సహకారం పెంచేందుకు 'కృషి సఖులు, సాగు సహాయకుల(సీఆర్పీ)ను ఉపయోగించుకోనున్నారు.

**చేకూరే ప్రయోజనాలు..**

సేంద్రియ ఎరువులు, జీవసంబంధ పద్ధతుల వాడకం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూసారం మెరుగుపడుతుంది.

రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గటం వల్ల వాతావరణంలో కార్బన ఉద్గారాలు తగ్గుతాయి. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్, ధర ఉండటం వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుంది. సేంద్రియ ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి సురక్షితమైనవి. పోషక విలువలను అధికంగా కలిగి ఉంటాయి.


సహజ వ్యవసాయం పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. స్థానిక వనరుల వినియోగం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది.

శ్రీనివాస్, కేవీకే, శాస్త్రవేత్త, భద్రాద్రి

# సాగర్ కళకళ..
# గోదావరి వెలవెల

ఖమ్మం: గతేడాది కన్నా భిన్నంగా ఈసారి సాగర్ జలాశయం నీటితో కళకళలాడుతోంది. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండటంతో వేసవిలో తాగునీటి గండం నుంచి గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు భద్రాద్రి జిల్లాలోని గోదావరిలో నీటిమట్టం క్రమేణా తగ్గుతోంది. నీటిని పొదుపుగా వాడటంతో పాటు.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది.

**ఢోకా లేనట్టే..** పాలేరు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2.558 టీఎంసీలు. ప్రస్తుతం 1.975 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఇక్కడి నుంచి సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లోని 2,375 ఆవాసాల తాగునీటి అవసరాలకు 137 క్యూసెక్కుల జలాలు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుత నిల్వలతో ఈ వేసవికాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు ఢోకాలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైరా రిజర్వాయర్ నుంచి వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పదకొండు మండలాల్లో 465 గ్రామాలకు రోజుకు పదికోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.30 అడుగులు కాగా.. ప్రస్తుతం 14.90 అడుగుల వద్ద నీరు ఉంది. వేసవి అవసరాలకు ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి పాల్వంచకు 0.2 టీఎంసీలు, కొత్తగూడెం పట్టణానికి 0.473 టీఎంసీల నీరందుతుంది. వీటితోపాటు



పారిశ్రామిక ప్రాంతాలైన కేటీపీఎస్, నవభారత్‌కు జలాలు సరఫరా అవుతాయి. 'కిన్నెరసాని' పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. ప్రస్తుతం 396.7 అడుగుల వద్ద నీరు ఉంది. ఈ నిల్వలు వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చనున్నాయి.

**గోదావరి పరీవాహకంలో ఇక్కట్లు**

గోదావరి పరీవాహకంలో కాస్త ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రెండు అడుగులకే పరిమితమైంది. పర్ణశాలలోని మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రోజుకు 50 లక్షల లీటర్లు, భద్రాచలం పట్టణానికి గోదావరి నుంచి నిత్యం 65 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగితే గోదావరి నీటిమట్టం మరింత తగ్గుతుంది. తాగునీటి అవసరాలను బట్టి ఎగువ ప్రాంతాల నుంచి గోదావరి జలాలను రప్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

# తవ్వేస్తున్నా.. నవ్వేస్తున్నారు..

కామారెడ్డి : జిల్లాలో బోరుబావుల తవ్వకాలు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. వాల్టా నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. లెక్కకు మించి బోరుబావులు తవ్వకోవడంతో ఆ ప్రభావం భూగర్భజలాలపై పడుతోంది. నిత్యం గృహవసరాలకు, వ్యవసాయానికి బోరుబావులను ఇష్టం వచ్చినట్లు తవ్వకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా నిత్యం సుమారు 50కి పైగా బోరుబావులు తవ్వుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. భూగర్భజలాలను విపరీతంగా వాడుకోవడంతో జిల్లా వ్యాప్తంగా నీటి మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గడిచిన మూడు నెలల్లో 4.34 మీటర్లు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

**అనుమతులేవి..?**

బోరుబావి తవ్వాలనుకుంటే వాల్టా ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాలి. గృహవసరాలకైనా, సాగుకైనా ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు జారీ చేస్తారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బోరుబావి తవ్వుకోవడానికి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఒక బోరుబావికి మరొక బావికి మధ్య దూరం పాటిస్తే అందరికి మంచిది. ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వకూడదని చట్టం చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. పది మీటర్ల దూరంలోనే బోర్లు వేస్తున్నారు. ఇక గృహాల మధ్య అయితే చెప్పక్కర్లేదు.



ఎవరికి ఇష్టం వచ్చిన విధంగా వారు బోర్లు తవ్విస్తున్నారు. గృహాలు నిర్మించినప్పుడు ఇంకుడుగుంతలు నిర్మించాలంటే మాత్రం ఆసక్తి చూపడం లేదు.

**పొదుపే బాట** ప్రతి ఒక్కరు నీటి పొదుపు చర్యలు తప్పకుండా పాటించాలి. రైతులు వరి సాగు కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటిని భూమిలోకి పంపించడానికి కందకాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టాలి. వర్షకాలంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను అందజేయాలి. ఆరుతడి పంటల సాగుకు ముందుకు రావాలి. వ్యవసాయక్షేత్రాల వద్ద నీటి కుంటల నిర్మాణాలు చేపట్టాలి. ఉపాధిహామీ పథకం ద్వారా ఫాంపాండ్ నిర్మించుకోవడానికి అవకాశం ఉంది. ప్రతీ రైతు పొలంలో ఒక ఫాంఫాండ్ ఉంటే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండదు. గ్రామాల్లో ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. బోరుబావులు తవ్వుకోవడానికి ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకోవాలని జిల్లా భూగర్భజలశాఖ అధికారి సతీష్‌యాదవ్ తెలిపారు.

# పుస్తకం.. విజ్ఞాన నేస్తం

సిద్దిపేట : పుస్తకం.. విజ్ఞాన నేత్రం. వెలకట్టలేని జ్ఞాన భాండాగారం. వ్యక్తిని.. సమున్నత స్థాయిలో నిలబెట్టే ఆయుధం. పదుగురిలో ప్రత్యేకత చాటేలా ప్రోత్సాహన్ని అందిస్తుంది. అజ్ఞానాన్ని పటాపంచలు చేసి, విజ్ఞాన జ్యోతి వెలిగేలా చేస్తుంది. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో విశేషాలు ఉన్నాయి. ఇలాంటి పుస్తకం ద్వారా అందే మాధుర్యానికి నేటి తరం దూరం అవుతోంది. దీని పఠనంతో కలిగే లాభాలను వారికి వివరించి ఆ దిశగా అడుగేయించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

**పారదర్శకత..**

'పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంద'న్నారు మహాత్మా గాంధీ సూచించారు. ఈ విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఎంతో ఉంది. మంచి ఆలోచనా సరళి, దూరదృష్టి కలిగి ఉండటంతో ఎంతో అవసరం. అన్నింటిలో పారదర్శకత పాటించాలి.

**వంద మంది మిత్రులతో..** ఒక మంచి పుస్తకం.. వందమంది మిత్రులతో సమానం. ఒక మంచి స్నేహితుడు గ్రంథాలయంతో సమానం.. అని డా. ఏపీజే అబ్దుల్ కలాం పేర్కొన్నారు. ఈ విషయాన్ని నేటితరం గ్రహించాలి. చరవాణి మోజులో పడి పుస్తకాన్ని విస్మరిస్తున్నాం. పరోక్షంగా మంచీచెడులు బోధిస్తుంది. సాధారణ మనుషులను మహనీయులుగా మార్చిన.. విజ్ఞాన వీచికల ప్రాధాన్యాన్ని నేటి యువత గుర్తించాలి.

**జ్ఞాన నేత్రం..** పుస్తక పఠనంతో ఎంతో మంది జ్ఞానాన్ని సముపార్జించారు. నిండైన వ్యక్తిత్వం పెంచుకునేందుకు, జీవితాన్ని మార్చుకునేందుకు ఉపయోగపడుతుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికీ సగానికి పైగా జనాభా నిరక్షరాస్యులుగా ఉండటం శోచనీయం. యువత విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే క్రతువు చేపట్టాలి. అది కేవలం పుస్తక పరిచయంతోనే సాధ్యం.

నారాయణఖేడ్ మండలం పీర్ల తండాకు చెందిన ఐఆర్‌ఎస్ అధికారి సుధాకర్‌నాయక్ నేతృత్వంలోని సర్వోదయ ఫౌండేషన్ పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 110 ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటుచేసింది. సిర్గాపూర్‌లో గ్రామస్తులందరి కోసం లైబ్రరీని నెలకొల్పారు. అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో మరిన్ని చోట్ల ఏర్పాటు చేయనున్నారు.

**6వేలకు పైగా భద్రపరిచి..**

తూప్రాన్‌కు చెందిన మనోవిజ్ఞాన శాస్త్ర అధ్యాపకుడు కె.శ్రీనివాస్‌చారి.. తన ఇంటినే గ్రంథాలయంగా మార్చుకోవడం విశేషం. ఐదో తరగతి చదువుతున్న సమయంలో పుస్తకాల సేకరణ అలవాటు కాగా.. ఇప్పటికీ దాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 6000కు పైగా పుస్తకాలను రెండు గదుల్లో భద్రపరిచారు. తన మిత్రులు సైతం ఇక్కడికి వచ్చి చదువుకుంటుంటారు. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లినప్పుడు పుస్తకాలు కొనుగోలు చేసి తీసుకొస్తారు. పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు, నిరుద్యోగులకు ఉపయోగపడే 2800కు పైగా వీడియోలు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

**అవగాహన కల్పిస్తూ..** మెదక్‌కు చెందిన బుర్ర సంతోష్ వృత్తిపరంగా, ప్రవృత్తి పరంగా పుస్తకాలకు దగ్గరగా ఉంటుండటం విశేషం. పిల్లలకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించి చదువుకునేలా తన ఇంట్లో లైబ్రరీని ఏర్పాటుచేశారు. మహనీయుల జీవిత చరిత్ర, నైపుణ్య సాధనకు దోహదపడేవి అందుబాటులో ఉంచారు. మరోవైపు తనకిష్టమైన మెదక్ జిల్లా చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రాంతాలపై పరిశోధన చేస్తున్నారు.

# నట్టేట ముంచుతున్న నకిలీ



పరిగి : వానాకాలం సాగుకోసం రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు నకిలీ విత్తనాలు విపణిలోకి వస్తున్నాయి. వీటిని కట్టడి చేసేందుకు అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నా.. కొందరు అక్రమార్కులకు అది రెండు చేతులా సంపాదనగా మారింది. దీంతో మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అన్నదాతల అమాయకత్వం, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుంటూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. గత సీజన్ ప్రారంభంలో అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృత దాడులు నిర్వహించారు. నకిలీ విత్తనాలు పట్టుకొని, కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈసారి కూడా పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు తనిఖీలు చేపడుతుండగా.. అక్కడక్కడ పట్టుబడుతుండటం రైతలన్నలను కలవరపెడుతోంది. తక్కువ ధరకు తీసుకొచ్చి నాణ్యమైనవని చెబుతూ రైతులను మోసం చేస్తున్నారు. మొలకెత్తక పోవడంతో బోరున విలపిసున్నారు. ఈ నేపథ్యంలో కథనం.

**కర్ణాటక, పాలమూరు జిల్లా నుంచి**

తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో ఈ ఏడాది 5.95లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా. అందులో ప్రధానంగా పత్తి 2.5లక్షలు, కంది 2.25లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అధికారులు యోచిస్తున్నారు. తెల్లబంగారానికి అనూహ్య రీతిలో ధరలు పెరగడంతో రైతులు సైతం సాగుకు ఆసక్తి చూపనున్నారు. దీంతో అక్రమార్కులు ఈ రెండు రకాల విత్తనాలపైనే కన్నేశారు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా మహబూబ్‌నగర్ జిల్లా, కర్ణాటక నుంచి తెచ్చి పల్లెల్లో విక్రయాలు జరిగాయి. మరికొందరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా తీసుకొచ్చి విక్రయాలు చేశారు. నమ్మకమైన వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకొని ప్రచారానికి పాల్పడుతున్నారు. ధర తక్కువని తీసుకొని రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నారు.

మండలాలు: 20

రైతులు: 2,95,797వానాకాలం సాధారణ సాగు: 5,78,874 ఎకరాలు ప్రధాన పంటలు: పత్తి, కంది, వరి, మొక్కజొన్న, పెసర, మినుము, **పల్లెల్లో ప్రత్యేక నిఘా – మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.** విత్తనాల కొరత రాకుండా పక్కా ప్రణాళికను తయారు చేస్తున్నాం. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని విత్తనాలు అందుబాటులో ఉండేలా చూస్తాం. గ్రామాల్లో ఏఈఓలు, రైతుల సహకారంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి కల్తీ విత్తనాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తాం. జిల్లా, మండల స్థాయిలో తరచూ ఆకస్మిక తనిఖీలు చేపడతాం. రైతులు ధ్రువీకరించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు భద్రపర్చుకోవాలి.

# ఎల్ఆర్ఎస్ సిబ్బందికి జీతాల్లేవ్



హైదరాబాద్: క్షేత్రస్థాయిలో పరిశీలించి...అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నివేదికలు ఇచ్చే సిబ్బందికి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా వీరు జీతాలకు నోచుకోవడం లేదు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన...పరిష్కారం కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) దాదాపు 55 మంది జూనియర్ ప్లానింగ్ పర్సన్స్ (జేపీపీ)లను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధుల్లోకి తీసుకొంది. మూడు నెలలుగా హెచ్ఎండీఏ కోసం సేవలందిస్తున్నారు. జేపీపీల్లో చాలామంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లతోపాటు పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారు. నగరంలో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఇంతలో హెచ్ఎండీఏ జేపీపీ ఉద్యోగ కోసం నోటిఫికేషన్ రావడంతో.. కుటుంబ సభ్యులపై ఆధారపకుండా వచ్చిన జీతంతో గడిచిపోతుందనే ఉద్దేశంతో చాలామంది విధుల్లో చేరారు. తీరా ఇక్కడ జీతం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు.

**వీరిదే ముఖ్య భూమిక..**

హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల్లో 2.62 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులున్నాయి. వీటిలో 2.04 లక్షలకు ఫీజు నోటీసులిచ్చారు. మరో 58,500 మంది దరఖాస్తుదారులు ఇప్పటికే ఫీజులు చెల్లించారు. 2,150మందికి మాత్రమే ఇప్పటివరకు ప్రొసిడింగ్ జారీ చేశారు. వాస్తవానికి మార్చి 31తో ఎల్ఆర్ఎస్ గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం ఏప్రిల్ 30వరకు పొడిగించింది. తాజాగా పెంచిన గడువు సైతం 7రోజుల్లో ముగియనుంది. ఫీజు చెల్లించిన వారందరికీ ప్రొసీడింగ్స్ జారీ చేయాలంటే ఆయా లేఅవుట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ ప్రక్రియలో జేపీపీలదే కీలకపాత్ర. ఎల్1 క్లియరెన్సు కింద తొలుత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంబంధిత లేఅవుట్‌ను పరిశీలించి నీటివనరులు, ఇతర వివాదాలు లేవని ధ్రువీకరించాక..జేపీపీ మరోసారి వాటిని పరిశీలించి...ఎల్2 అనుమతుల కోసం నివేదిక పంపిస్తారు.

**ఉద్యోగినుల అవస్థలు..**


జేపీపీలో కొంతమంది మహిళా ఉద్యోగులున్నారు. చాలావరకు అక్రమ లేఅవుట్లు నగర శివార్లలో ఉన్నాయి. అక్కడ వరకు వెళ్లి పరిశీలించి నివేదిక అందించాల్సి ఉంటుంది. సొంత వాహనాల్లో వెళ్తున్నారు. వాహనాలు లేని వారు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి అక్కడ నుంచి ఆటోలు లేదంటే కాలినడక చేరుకుంటున్నారు. కొన్నిసార్లు దరఖాస్తుదారులే లేఅవుట్ల వద్దకు తీసుకెళ్తున్నారు. ఇలా క్షేత్రస్థాయిలో పరిశీలనకు మహిళా ఉద్యోగులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు లేఅవుట్ వద్దకు వెళ్లినా సరే... ఆ సమయంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రాకపోతే వెనుతిరగాల్సి వస్తోంది. దీంతో ప్రొసీడింగ్స్ జారీపై ఆ ప్రభావం పడుతోంది.

# పుట్టగొడుగుల్లా అనుమతిలేని వెంచర్లు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో లేఅవుట్ లేని ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ భూములను వెంచర్లు, ప్లాట్లుగా చేసి, విక్రయించాలంటే తొలుత వ్యవసాయేతర భూములుగా మార్చాలి. నిబంధనల మేరకు లేఅవుట్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటే డీటీసీపీవోకు పంపిస్తారు. అక్కడి నుంచి సాంకేతిక మంజూరు తర్వాత గ్రామపంచాయతీ, మున్సిపల్ అనుమతులు తీసుకోవాలి. రోడ్లు, భూగర్భ మురుగుకాల్వలు, తాగునీటి పైపులైన్లు, నీటి ట్యాంకులు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. ఏర్పాటు చేసే ప్లాట్లలో రోడ్లు, మురుగుకాల్వలకు సంబంధించిన 33 శాతంతోపాటు మొత్తం విస్తీర్ణంలోని 10 శాతం స్థలాన్ని గ్రామపంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి. గ్రామపంచాయతీ వారు డీటీసీపీవోకు పంపిస్తే అక్కడి నుంచి చివరి ఆమోదం లభిస్తుంది. లే అవుట్ చేసిన ప్లాట్లకు పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు ఒక బ్లాక్ కేటాయించి, ఆ కాలనీకి ఓ పేరు పెడతారు. స్థల విస్తీర్ణాన్ని నిర్ధారిస్తూ పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరణ పత్రం జారీ చేస్తే అప్పుడు అది చట్టపరమైన లేఅవుట్ కింద పరిగణిస్తారు. ఇలా పూర్తిస్థాయి అనుమతులతో జిల్లాలో తంగళ్లపల్లిలో ఒక్క వెంచర్ మాత్రమే ఉండడం కొసమెరుపు.

**45 ఎకరాల విస్తీర్ణంలో..**

ఎల్లారెడ్డిపేట మండలంలో 26 గ్రామపంచాయతీలుండగా పట్టణాలకు దీటుగా భూ క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో అనుమతి లేని వెంచర్లు పుట్టగొడుగుల్లా ఏర్పాటవుతున్నాయి. అనేక చోట్ల నిబంధనలకు తిలోదకాలిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాతోపాటు గ్రామపంచాయతీల ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మండలకేంద్రంతోపాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, దుమాల గ్రామాల్లో వివిధ సర్వేనంబర్లలోని 45 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సుమారు 1146 లేఅవుట్ లేని ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని చోట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)



కోసం భూముల యజమానులు దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలోని లే అవుట్ లేని స్థలాలను ఇప్పుడు అధికారులు అనుమతించడం లేదు. రిజిస్ట్రేషన్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. హద్దురాళ్లను తొలగిస్తుండడంతో కొనుగోలు దారులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పొడవాటి హద్దురాళ్లున్న ఈ ప్రాంతం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోనిది. వెంకటాపూర్ నుంచి రగుడు మీదుగా సిరిసిల్ల వరకు డివైడర్‌తో కూడిన రెండు వరుసల బైపాస్ రహదారి సౌకర్యంతో ఆ రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ వ్యాపారులు రంగంలోకి దిగి లేఅవుట్ లేకుండానే ప్లాట్లుగా మార్చి, విక్రయించడం ప్రారంభించారు. దీనిపై అధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. పలు సర్వే నంబర్లలోని ప్లాట్లు అనధికారికమని గుర్తించారు. హద్దురాళ్లను తొలగించి, లే అవుట్ లేని ఈ ప్లాట్లను ఎవరూ కొనవద్దంటూ అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు.

**పలుచోట్ల గుర్తించాం**

జోగం రాజు, ఎంపీవో, ఎల్లారెడ్డిపేట

అనుమతి లేని లేఅవుట్‌లను గుర్తించాం. వాటి వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపించాం. దీనిపై ఓ కమిటీ వేసి, వాటికి రిజిస్ట్రేషన్ కాకుండా జిల్లా కలెక్టర్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. వారు ఇళ్ల నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే జీవో నంబరు 131, 135 ప్రకారం క్రమబద్ధీకరించి, అనుమతి జారీ చేస్తారు.

# ప్లాస్టిక్ నిషేధంపై చర్యలేవి?

కాగజ్‌నగర్ : ఏ చిన్న కార్యమైనా.. ప్లాస్టిక్ పేపర్, గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, ఐక్రీం స్టిక్‌లు, స్ట్రాలు, ట్రేలు, తదితర వాటి వినియోగం విచ్చలవిడిగా పెరుగుతోంది. ఆయా వ్యర్థాలు రోడ్డుపై, అటు నుంచి మురుగు కాలువల్లోకి చేరి పేరుకుపోతున్నాయి. అధికారుల పట్టింపులేనితనంతో విక్రేతల్లో భయం లేకుండా పోయి బాహాటంగానే అమ్మకాలు సాగిస్తున్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయదారులకు రూ.1000 నుంచి రూ.25000 వరకు జరిమానా విధించే ఆస్కారం ఉన్నా.. అధికారులు అటువైపు చూడటం లేదు.

పండ్లు కొనేందుకు వెళ్లినా, కూరగాయలు కొనుగోలు చేసినా, బయట ఏ దుకాణానికి వెళ్లినా.. ఇబ్బడిముబ్బడిగా ప్లాస్టిక్ సంచులే దర్శనమిస్తున్నాయి. ఒకసారి వాడి పారేసే ఉత్పత్తుల వినియోగంపై కాగజ్‌నగర్ పురపాలికలో నియంత్రణ లేకుండా పోతోంది. ఈ ఏడాది ప్రారంభమై నాలుగు నెలలైనా కనీసం నామమాత్ర తనిఖీలు సైతం చేపట్టలేని దుస్థితి. ఫలితంగా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతూ పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్నాయి. మరోవైపు ఇష్టానుసారంగా రోడ్లపై పడేస్తుండటంతో.. మూగజీవాలు వాటిని తింటూ అనారోగ్యం, మృత్యువాత పడుతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు కొనసాగుతున్నాయి. కనీసం ఈ సందర్భంగానైనా అధికారులు మేల్కోవాలి. ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాల కట్టడికి యత్నిస్తూనే, వాటి అనర్థాలపై ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి.

కాగజ్‌నగర్ బల్దియాలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయం, వాడకం యథేచ్ఛగా జరుగుతోంది. ఒకసారి వాడి పడేసే వాటిని రెండున్నరేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. అయితే ఈ నిబంధనలు ఇక్కడ అమలు కావడం లేదు. కొందరు స్థానిక డీలర్లు ప్లాస్టిక్ ఉత్పత్తులను హైదరాబాద్‌తోపాటు జిల్లాకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర నుంచి అక్రమ మార్గంలో టన్నుల కొద్దీ దిగుమతి చేసుకుంటున్నారు. వ్యాపారులకు గుట్టుగా విక్రయిస్తున్నారు. ఫలితంగా రోడ్ల పక్కన చిరు వ్యాపారుల నుంచి కిరాణా దుకాణాల వరకు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగమే కనిపిస్తోంది. అవన్నీ 120 మైక్రాన్లలోపు మందం ఉన్న నిషేధిత ఉత్పత్తులే.

**మార్పు మనలోనూ రావాల్సిందే..**

ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లోనూ స్పష్టమైన మార్పు రావాల్సి ఉంది. కేవలం అధికారులు తనిఖీలు చేస్తేనో, అవగాహన సదస్సులు నిర్వహిస్తే నో.. వాటి ఉత్పత్తుల విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత తిరిగి వాటిని యథేచ్ఛగా వినియోగిస్తుంటారు. అలా కాకుండా అందరూ ఒక ఉద్యమంలా పాటిస్తేనే ప్లాస్టిక్ నిషేధం అమలవుతుంది.

**జరిమానాలు విధిస్తాం**

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకంపై చర్యలు తీసుకుంటాం. నిబంధనల్ని అతిక్రమించే వారికి జరిమానాలు విధిస్తాం. ప్రజలు, వేడుకల నిర్వాహకులు పేపరు, జనపనార సంచులు, తదితర ప్లాస్టిక్ రహిత వాటిని వినియోగించాలి. ప్రజా భాగస్వామ్యంతో ప్లాస్టిక్ రహిత పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు యత్నిస్తాం.

సోమిడి అంజయ్య, పుర కమిషనర్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ బల్దియా స్వరూపం

వార్డులు : 30

జనాభా 66,293

రోజు సేకరిస్తున్న చెత్త : 27 మె.ట.

ప్లాస్టిక్ వ్యర్థాలు దాదాపు : 10 మె.ట.

# పందెంలో చిక్కి.. ఆర్థికంగా చితికి

సిర్పూరు : (టి) మండలంలోని టోంకిని గ్రామానికి చెందిన జయేందర్ ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా పోలీసులు యువకుడి మృతిపై విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. విద్యుత్తు తీగలకు తగిలి మృతిచెందిన కుమారుడిని తండ్రి పెన్‌గంగ నదిలో పడేసి అదృశ్యమైనట్లు నమ్మించాడు. అదేవిధంగా మృతుడి చరవాణిని పరిశీలించిన పోలీసులు పలు బెట్టింగ్ యాప్‌లను గుర్తించారు. తెలంగాణకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్రలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు సిర్పూరు నియోజకవర్గంలోని కొందరు యువకులను బెట్టింగ్ ముగ్గులోకి దించుతున్నట్లుగా సమాచారం. సదరు వ్యక్తి గ్రామాల్లోని కొందరిని ఈ దందాలోకి దింపి వాట్సాప్‌లలో లింకులను పంపిస్తున్నాడు. ఈ వ్యవహారంలో ఇక్కడి బెట్టింగ్‌కు పాల్పడి తీవ్ర నష్టాల పాలవుతున్నట్లు సమాచారం.

పోలీసులు ఎన్ని నియంత్రణ చర్యలు చేపడుతున్నా.. బెట్టింగ్ భూతం చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో.. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడికక్కడ పందేలు సాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, సిర్పూరు, బెజ్జూరు, పెంచికల్‌పేట, చింతలమానెపల్లి, తదితర మండలాలకు చెందిన యువత బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పుల పాలవుతున్నారు. అత్యాశకు పోయి కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

**వారికి కాసులు.. వీరికి చీకట్లు!**

వాస్తవానికి క్రికెట్ బెట్టింగ్ కూడా ఒక జూదమే. ఈ ఐపీఎల్ పందెం క్రికెటర్లకు, బీసీసీఐకి, బెట్టింగులు నిర్వహిస్తున్న యాప్‌ల నిర్వాహకులకు కాసులు కురిపిస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా.. వీటిపై బెట్టింగుల కారణంగా కొన్ని కుటుంబాల్లో చీకట్లు మిగులుతున్నాయి. ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి నిండా మునిగిపోతున్నారు. ఇంట్లోని బంగారం, భూములను సైతం కుదువ పెట్టి తీవ్రంగా నష్టపోతున్నారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

**దారి మార్చిన జూదరులు..**

గతంలో టీ దుకాణాలు, దాబాలలో బెట్టింగ్ శిబిరాలు సాగేవి. ప్రస్తుతం పోలీసుల నిఘా పెరగడంతో జూదరులు రూటు మార్చారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ద్వారా ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణ రాష్ట్రంలో నిషేధం ఉండడంతో.. చరవాణిలో ఫేక్ జీపీఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాలకు లొకేషన్ మార్చి యాప్‌లు ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ఇప్పుడు జిల్లాలోని మారుమూల పల్లెలకు పాకడం కలవరపెడుతోంది. సెల్‌ఫోన్‌లలో యూపీఐ ఐడీలతో తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలు సైతం అనుసంధానం చేసి వారిని సైతం సమస్యల్లోకి నెడుతున్నారు.

**తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి**

పిల్లలు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులే జాగ్రత్తపడాలి. వారి ప్రవర్తనపై కన్నేసి ఉంచాలి. విచ్చలవిడిగా వారికి డబ్బులు అందకుండా చూడాలి. వారి వ్యవహారశైలిలో మార్పు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ఇప్పటికే క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా పటిష్ఠం చేశాం. గతంలో పలువురిపై కేసులు కూడా నమోదు చేశాం. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం.

మధుకర్, ఎస్సై, కౌటాల

# వరి దిగుబడుల్లో నాతవరం ముందంజ

అనకాపల్లి : జిల్లాలో ఈ ఏడాది వరి దిగుబడుల్లో నాతవరం మండలం ముందుండగా దేవరాపల్లి వెనుకబడింది. గత సీజన్ కంటే 818 కేజీల ధాన్యం అదనంగా పండింది. ఖరీఫ్‌లో హెక్టారుకు 5,331 కేజీలు ధాన్యం రాగా, 2023-24 సీజన్‌లో 4,513 కేజీల దిగుబడి వచ్చింది. నాతవరంలో హెక్టారుకు 6,022 కేజీల దిగుబడులొచ్చాయి. గత సీజన్‌లోనూ ఈ మండలంలోనే అధిక దిగుబడులు వచ్చాయి. అన్ని మండలాల కంటే ఇక్కడే సాగు విస్తీర్ణం ఎక్కువ. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 55,985 హెక్టార్లలో వరి సాగు చేయగా నాతవరం మండలంలో 6,492 హెక్టార్లలో సాగైంది. ఏడాదిలో 120 రోజులు అంటే వరి సాగు చేసినన్ని రోజులు తాండవ జలాశయం నుంచి పంటలకు నీరు విడుదలైంది.

**హెక్టారుకు 71 బస్తాలు...** ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 63,286 హెక్టార్లలో సాగు చేయగా.. వరి ఒక్కటే 55,985 హెక్టార్లలో సాగైంది. ఎక్కువగా వర్షాధారంగానే సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో సగటున హెక్టారుకు 71 బస్తాల దిగుబడి వచ్చింది. గత సీజన్‌లో సరాసరి దిగుబడి హెక్టారుకు 60 బస్తాలే.నాతవరం తర్వాత పాయకరావుపేట మండలంలో అధిక దిగుబడులు వచ్చాయి. ఇక్కడ



హెక్టారుకు 5,877 కేజీల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇక్కడ పలు ఆనకట్టలు ఉండటంతో పొలాలకు నీరు పుష్కలంగా అందుతోంది. ఎస్.రాయవరం, గొలుగొండ, కోటవురట్ల, మునగపాక, నక్కపల్లి, రావికమతం, ఎలమంచిలి, బుచ్చెయ్యపేట మండలాల్లోనూ వరి దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఇక్కడ 5,400 కేజీలకు పైగా దిగుబడులు వచ్చాయి. నీటి ఎద్దడితోపాటు పంటకు చీడపీడలు సోకడంతో దేవరాపల్లి మండలంలో హెక్టారుకు 4,710 కేజీల దిగుబడే వచ్చింది. సుడిదోమ అధికంగా సోకడంతో కొన్ని మండలాల్లో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. మాడుగుల, రోలుగుంట మండలాల్లో ఐదు వేల కేజీల కంటే తక్కువ దిగుబడులు వచ్చాయి.

దిగుబడులు బాగున్నాయి... రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు 32 బస్తాల దిగుబడి వచ్చింది. నారు నుంచి కోత వరకు వాతావరణం అనుకూలంగా ఉంది. కోత సమయంలో వర్షం వస్తే భయపడ్డాం. పెద్దగా ఇబ్బంది పడలేదు. గత ఏడాది 25 బస్తాలకు మించి రాలేదు.పిట్ల శ్రీనివాసరావు, నాగవరం, రైతు

# నిగ్గు తేల్చండి.. పరిహారం ఇవ్వండి

అచ్యుతాపురం : ఏపీఐఐసీ పైపులైన్ ప్యాకేజీ పంపిణీలో అవకతవకలు జరిగాయని నిర్ధారించి ఏళ్లు గడుస్తున్నా బాధ్యులపై చర్యల్లేవు. ప్యాకేజీ పంపిణీలో చోటుచేసుకున్న అవినీతిపై అప్పట్లో మత్స్యకారులు నిలదీసినా పాలకులు పట్టించుకోలేదు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే సముద్రంలోకి విడుదల చేయాలని, పూడిమడక మత్స్యకారుల్లో 18 ఏళ్లు నిండిన వారికి ఒక్కొక్కరికి రూ.1.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు గతంలో అంగీకారం కుదిరింది. దీన్ని అవకాశంగా మార్చుకునేందుకు వీధికొకరు దళారులుగా అవతారమెత్తారు.

రెవెన్యూ అధికారులతో లాలూచీ పడి 485 మందికి ప్యాకేజీ అందకుండా చేశారు. ఒకే పేరుతో రెండు ప్యాకేజీలు, ఆడపిల్లల పేరుతో కొంత, అత్తవారి ఇంట్లోనూ, పుట్టింట్లోనూ ఒకే పేరుతో ఉన్న వారికి ప్యాకేజీ అందజేశారు. ఇలా దళారులు రూ.4 కోట్ల వరకు అవినీతికి



పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.

280 మంది సింగిల్ యూనిట్ రేషన్ కార్డులు, 40 మందికి వయసు లేకపోయినా 18 ఏళ్లు నిండినట్లు చూపి పరిహారం పొందారని రెవెన్యూ అధికారులు నివేదిక అందజేసినా ఇప్పటికీ అతీగతి లేదు. ప్యాకేజీ పంపిణీకి ముందు గుర్తించిన జాబితాలో పేర్లు లేని 30 మందికి పరిహారాన్ని అందించారు. రాజకీయ నాయకుల సిఫార్సులతో 280 మంది ప్యాకేజీ పొందినట్లు సమాచారం.

బ్రాండిక్స్ పైపులైను ఏర్పాటు సమయంలో 2,700 మందికి ప్యాకేజీ ఇవ్వగా ఏపీఐఐసీ ప్యాకేజీ వచ్చే సమయానికి ఈ సంఖ్య 4,828కి పెరగడం గమనార్హం. ఇప్పటికే 4,331 మందికి ప్యాకేజీ అందించిన అధికారులు రూ. 2.5 కోట్ల మేర అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.

కూటమి సర్కారు చర్యలు తీసుకోవాలి... న్యాయంగా రావాల్సిన ప్యాకేజీ ఇవ్వడంలో వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం న్యాయం చేసి ప్యాకేజీ ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు. తెదేపా ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ తీసుకోవద్దని గతంలో మోసగించి ఎన్నికల్లో లబ్ధి పొందిన జగన్.. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కమాటా మాట్లాడలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాడు మోసపోయిన వారంతా ఎన్నికల్లో కూటమికి మద్దతివ్వగా, అవినీతిపై విచారణ చేపట్టి అర్హులందరికీ పరిహారం అందజేయాలని పూడిమడకకు చెందిన మత్స్యకారులు కోరుతున్నారు.

**ఐదేళ్ల కార్యాలయాల చుట్టూ తిరిగినా..** పరిహారం ఇవ్వాలని గత ఐదేళ్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. పంపిణీకి రూ.60 కోట్లు అవసరంకాగా ప్రభుత్వం రూ.68 కోట్లు విడుదల చేసినా అందరికీ అందలేదు. 31 మంది తక్కువ వయసు వారు, ఆరుగురు మూడుసార్లు ప్యాకేజీ తీసుకున్న వారు, 14 మంది భార్యాభర్తలు ఇద్దరూ ప్యాకేజీ పొందిన వారున్నా చర్యల్లేవు.వాసుపల్లి రాజేష్, పూడిమడక

# ఆర్టీసీ సరకు రవాణా.. అదుర్స్



కాకినాడ : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) బస్సుల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే కాకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించి విజయవంతంగా సాగుతోంది. సంస్థకు ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా అమల్లోకి తెచ్చిన కార్గో, పార్సిల్ సేవలు ప్రజాదరణ పొందుతున్నాయి. కాకినాడ డిపో పరిధిలో 6 కార్గో పార్సిల్ కార్యాలయాలతో పాటు 5 బుకింగ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లోని ఇతర సంస్థలకు దీటుగా అందుబాటు ధరలతో సరకు రవాణాలో సంస్థ దూసుకుపోతోంది. ఒక చోటు నుంచి మరోచోటుకు పంపే పార్సిళ్లకు ఆన్‌లైన్ ట్రాకింగ్ విధానం అమలుచేస్తూ అది ఎక్కడుందో ఫోన్ ద్వారా సంబంధిత వ్యక్తికి సమాచారం అందిస్తున్నారు. ఈ విధానం సత్ఫలితాలిస్తుండడంతో ఇతర రవాణా సంస్థల కంటే ఆర్టీసీ వైపు మొగ్గుచూపుతున్నారు.

**రెండు కొత్త కౌంటర్లు ప్రారంభం..**

కార్గో, పార్సిల్ సేవలకు వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తుండటంతో అదనంగా మరో రెండు కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం కాకినాడ డిపో పరిధిలో కాకినాడ బస్టాండుతో పాటు సర్పవరం జంక్షన్, జీజీహెచ్, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం బస్టాండు, తాళ్లరేవులో కౌంటర్లు ఉండగా కొత్తగా రమణయ్యపేట, యానాం సమీపంలోని నీలపల్లి వద్ద బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. కాకినాడ డిపో పరిధిలో కార్గో పార్సిళ్ల రవాణా ద్వారా 2021 సంవత్సరంలో రూ. 1.66 కోట్ల ఆదాయం సమకూరింది. 2022లో రూ.1.84 కోట్లు, 2023లో రూ.2.13 కోట్లు, 2024లో 2.20 కోట్ల ఆదాయం వచ్చింది.

**సేవలు విస్తృతం చేస్తున్నాం..**

ఆర్టీసీ కొరియర్, పార్సిల్ రవాణా సేవలకు ఆదరణ పెరిగింది. అనుకున్న లక్ష్యాలు సాధించాం. వ్యాపారుల్లో కూడా నమ్మకం కల్పించాం. అందుబాటులో ఉన్న అన్ని సదుపాయాలు, సౌకర్యాలు, సిబ్బందిని సద్వినియోగం చేసుకుంటే మరిన్ని లక్ష్యాలు చేరుకోవచ్చు. ప్రయాణికులతో పాటు సరకు రవాణాకు అత్యం త ప్రాధాన్యం ఇస్తున్నాం.

ఎమ్‌యూవీ మనోహర్, అసిస్టెంట్, కమిషనర్, కాకినాడ డిపో

# స్వర్ణాంధ్ర సంకల్పం.. క్షేత్ర పర్యటనలకు సిద్ధం



మామిడికుదురు: గ్రామాలను మరింత ఉన్నతంగా ఏవిధంగా తీర్చిదిద్దాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు ఏవిధంగా ఉపయోగించుకుంటున్నారు.. వాటితో ఆయా కుటుంబాల్లో పురోగతి ఎలా ఉంది.. ప్రజలు ఏవిధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.. గ్రామ, వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏమున్నాయి.. ఇలా సకల అంశాలపై వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకోవాలంటే క్షేత్ర పర్యటనలతోనే సాధ్యమవుతుంది. ప్రజలతో మమేకమైతేనే వారి అభిప్రాయాలు తెలుసుకోగలుగుతాం. దీనికిగాను కూటమి ప్రభుత్వం ఉద్దేశించిన స్వర్ణాంధ్ర సంకల్పం కార్యక్రమాన్ని ఈ నెల 21 నుంచి 23 వరకు అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలో 17 గ్రామాలు, 3 వార్డులను ఎంపిక చేశారు. ఐఏఎస్ అధికారులు, వివిధ శాఖాధిపతులు నిర్దేశించిన గ్రామాలను సందర్శించనున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో మూడు రోజులు, రెండు రాత్రులు అక్కడ ప్రజలతో కలిసి ఉంటారు. గ్రామాల్లో సాకారమైన పనులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై వీరు నిశితంగా పరిశీలిస్తారు. అక్కడి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన కార్యాచరణ చేస్తారు. వివిధ శాఖలకు చెందిన స్థానిక అధికారులు వారి వెంట ఉంటారు. సందర్శనకు వచ్చే ఉన్నతాధికారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చడంలో జిల్లా అధికారులు నిమగ్నమవ్వాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

**ఎంపిక చేసిన గ్రామాలివే**

అమలాపురం డివిజన్‌లో.. ముమ్మిడివరం వార్డు-3, అమలాపురం వార్డు-1, అమలాపురం గ్రామీణంలోని బడుగువారిపేట, కాట్రేనికోనలోని చెంచులగరువు, సఖినేటిపల్లిలోని ఉయ్యూరివారిమెరక, ఐ.పోలవరంలోని కేశనకుర్రు, మలికిపురం, మామిడికుదురు, రాజోలు, ఉప్పలగుప్తం.కొత్తపేట డివిజన్‌లో... ఆలమూరులోని చెముడులంక-1, రావులపాలెంలోని రావులపాడు, ఆత్రేయపురంలోని వసంతవాడ, కొత్తపేట, పి.గన్నవరం.

రామచంద్రపురం డివిజన్‌లో.. మండపేటలోని వార్డు-1, గ్రామీణంలోని ద్వారపూడి, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం.

**సంసిద్ధంగా ఉన్నాం**

ఎంపిక చేసిన గ్రామాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల క్షేత్ర సందర్శనకు సమాయత్తమయ్యాం. దీనికిగాను డివిజన్ పరిధిలోని గ్రామాల్లో అధికారులను సంసిద్ధం చేశాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే మార్గదర్శకాల ద్వారా అవసరమైన మరింత కార్యాచరణ చేస్తాం.

పి.బొజ్జిరాజు, డీఎల్పీవో, అమలాపురం

# పారిశ్రామిక పార్కుల్లో ప్లాట్లు



సర్పవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కుల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఏపీఐఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే కేటాయిస్తామని జోనల్ మేనేజర్ రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

**స్థలాలు..:** రాజానగరం మండలం కలవచర్ల ఎంఎస్ఎంఈ పార్కులో 261 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. చదరపు మీటరు ధర రూ.3,241. సామర్లకోట మండలం వేట్లపాలెంలో ట్రెడిషనల్ ఫుడ్ పార్కులో 84 ప్లాట్లుండగా చ.మీ. రూ.3,150. కాకినాడ గ్రామీణం వాకలపూడి ప్రాంతంలో 31 ప్లాట్లు ఉన్నాయి.. ఇక్కడ చ.మీ. రూ.10,643. పెద్దాపురం ఆర్‌బీపట్నంలో 8 ప్లాట్లు ఉండగా చ.మీ. రూ.2,329. పెద్దాపురం ఫేజ్-2లో 5 ప్లాట్లు ఉండగా చ.మీ. రూ.5,174గా నిర్ణయించారు.

**భవనాలు..:** పెద్దాపురం ట్రెడిషనల్ ఫుడ్ పార్కులోని పరిపాలనా భవనంలో ఒక అంతస్తులో 2557 చదరపు అడుగులకు అద్దె రూ.28,127, పెద్దాపురం లేఅవుట్ ఫేజ్-1లోని సీఎఫ్‌సీ భవనంలో ఒక అంతస్తులో 2597 చ.అ.లకు అద్దె రూ.28,567గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఏపీఐఐసీ మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు వర్తిస్తాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ మేనేజర్ కోరారు.

# మూత్రపిండం.. దినదిన గండం

విజయనగరం : ఉమ్మడి జిల్లా పరిధిలో మూత్రపిండాల వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. సమస్య తీవ్రమయ్యే వరకు తెలుసుకునే వెసులుబాటు లేకపోవడంతో ప్రాణాల మీదకు వస్తోంది. ప్రస్తుతం 30 ఏళ్లు నిండని వారు సైతం కిడ్నీ సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. విజయనగరం, పార్వతీపురం జిల్లా ఆసుపత్రులు, పాలకొండ ప్రాంతీయాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాలున్నాయి. రెండు జిల్లాల్లో ప్రస్తుతం 475 మంది డయాలసిస్‌కు వస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు ఎక్కువగా వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం మన్యం జిల్లాలో ఎన్‌సీడీ 3.0 సర్వే జరుగుతోంది. 16 లక్షల మంది వివరాలు సేకరించగా 80 వేల మంది మధుమేహం, 1.24 లక్షల మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నారని తేలడం ఆందోళన కలిగిస్తోంది.

నగరంలో వైఎస్ఆర్ ప్రాంతానికి చెందిన సుమారు 50 ఏళ్ల వ్యక్తికి ఎటువంటి చెడు అలవాట్లు లేవు. దర్జీ వృత్తి చేసుకునే వారు. ఆసుపత్రికి వెళ్తే కిడ్నీ సమస్య ఉందని చెప్పడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందారు. ఆ తర్వాత కొద్ది రోజులు విజయనగరంలో డయాలసిస్ చేయించుకున్నాడు. అయినప్పటికీ మూడు నెలల కిందట చనిపోయారు. అతని ఇద్దరు చిన్న పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. తల్లి కూలీ చేసి వారిని పెంచుతోంది.


జియ్యమ్మవలస మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎస్.సంతోష్‌కు కాళ్లకు వాపులు రావడంతో సొంతంగా మాత్రలు వాడారు. అవి కిడ్నీలపై ప్రభావం చూపడంతో 2010 నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నారు. గుర్ల మండలానికి చెందిన సత్యవతమ్మ (55) నాలుగేళ్లు కిడ్నీ సమస్యతో బాధపడింది. ఉత్తరాంధ్రలో ఎన్ని ఆసుపత్రులు ఉన్నాయో.. అన్నింట్లో కుటుంబ సభ్యులు చూపించారు. ఎగ ఊపిరి, శ్వాస తీసుకోవడం వంటి సమస్యలతో బాధపడేది. డయాలసిస్ చేయించారు. రూ.10 లక్షలపైనే వైద్యం కోసం ఖర్చు చేసినా ప్రాణాలు నిలవలేదు.

# దోచుకున్నా.. దాచేస్తున్నారు!

తిరుపతి : చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లిలో ఆప్షన్-3 కింద 713 ఇళ్లను గుత్తేదారు నిర్మించాల్సి ఉండగా.. గృహ నిర్మాణ సంస్థలోని ఓ డీఈఈ.. అతని భార్య, తల్లి పేరిట పనులు దక్కించుకున్నారు. ఇదేవిధంగా రేణిగుంట మండలం జీపాళ్యం, వడమాలపేట మండలం కల్లూరులోనూ ఆ సంస్థ సిబ్బందే పనులు చేశారు. నిబంధనలు ఉల్లంఘించారని విజిలెన్స్ అధికారులు గుర్తించినా ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోనూ గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇళ్లకు వైకాపా హయాంలో బిల్లులు చేసుకున్నారు. ఇది వాస్తవమేనని జగన్ పాలనలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంస్థ అధికారులు, విజిలెన్స్ బృందాలు నిర్ధారించినా బాధ్యులపై చర్యలు లేవు.

వైకాపా హయాంలో గృహ నిర్మాణ సంస్థలో అవినీతి రాజ్యమేలింది. కొందరు అధికారులు, ఆ పార్టీ నాయకులు నిబంధనలకు యథేచ్ఛగా తూట్లు పొడిచారని ఆనాడే అక్రమాలన్నీ వెలుగు చూసినా ఉన్నతాధికారుల వరకు అంతా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత అప్పటి బాగోతాలపై విజిలెన్స్ యంత్రాంగం విచారణ జరిపింది. అక్రమాలు నిజమేనని తేల్చింది. అయితే ఆ నివేదికలను ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేయడంపై విస్మయం



వ్యక్తమవుతోంది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు నిధులు రాబడితే భవిష్యత్తులో తప్పులు చేయాలంటే ఎవరైనా భయపడతారు.సొంతంగా ఇల్లు కట్టుకోలేని పేదలకు గృహాలు నిర్మించేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి వైకాపా ప్రభుత్వం టెండర్లు పిలిచింది. వీటిని ఆప్షన్- 3 ఇళ్లుగా పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో 16,393 గృహాలున్నాయి. వాస్తవంగా ఇవి గుత్తేదారులు కట్టాలి. ఇందుకు భిన్నంగా 2,180 ఇళ్లను గృహ నిర్మాణ సంస్థలోని ఇద్దరు డీఈఈలు, వార్డు సచివాలయ ఉద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. మొత్తంగా రూ.12.05 కోట్లు వారికి బిల్లుల రూపేణా చెల్లించారు. సిమెంట్, స్టీల్, నిర్మాణ సామగ్రి పేరుతో మరో రూ.4.04 కోట్లు.. వెరసి రూ.16.09 కోట్లు సమర్పించారు.

**ప్రారంభంలో హడావుడి చేసి**

ఈ బాగోతంపై రెండు నెలల క్రితం గృహ నిర్మాణ సంస్థలోని విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అంతకుముందు కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే రాష్ట్ర విజిలెన్స్ యంత్రాంగం సైతం ఆప్షన్-3 గృహాల నాణ్యత, చెల్లింపుల గురించి ఆరా తీసింది. బాధ్యులెవరో గుర్తించి క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. ప్రజాధనం ఎంత దుర్వినియోగమైందో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఆ నివేదిక ప్రకారం ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.


**రోజుల వ్యవధిలోనే పూర్తయ్యాయంటూ..:** పుంగనూరు నియోజకవర్గంలో అవినీతి కొత్త పుంతలు తొక్కింది. 2014- 19 మధ్య తెదేపా హయాంలో నిర్మించిన, అర్ధంతరంగా ఆగిపోయిన గృహాలకు కూడా ఇక్కడ బిల్లులు చేశారు. రోజుల వ్యవధిలోనే గోడల దశ నుంచి ఇంటి నిర్మాణం పూర్తయిందంటూ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. అధికారులు, సిబ్బంది వాటాలు తీసుకొని వైకాపా అనుకూల వ్యక్తుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. దీనిపై సైతం ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇదే తరహాలో వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ కాలనీలోనూ రూ.13.75 లక్షల అవినీతి జరిగిందని తేటతెల్లమైంది. 53 ఇళ్లు పూర్తి చేయకుండానే పూర్తి బిల్లులు చెల్లించేశారు.

**ఏ అవకాశాన్ని వదలకుండా దోచి..**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2020 డిసెంబరులో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గృహాలు మంజూరు చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ రెండు వ్యవహారాల్లోనూ అవినీతి జరిగింది. వీటితోపాటు స్థలాల కొనుగోలు, చదునులోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు వెదురుకుప్పం మండలంలోని కొండ కింద ఉన్న ఓ లే అవుట్‌ను చదును చేసేందుకు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇదే ఖర్చుతో అనువైన ప్రాంతంలో మంచి స్థలం కొనుగోలు చేయవచ్చని తెలిసినా ఆ దిశగా అడుగులు పడలేదు. ఇలా అడుగడుగునా వైకాపా నేతలు ప్రభుత్వ సొమ్మును దోచేశారు. సందట్లో సడేమియా అన్నట్టు పలువురు అధికారులు సైతం చేతివాటం ప్రదర్శించారు.

# ఇంతెందుకు.. తగ్గిద్దాం!

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానం లో శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల నిర్మాణాలకు వైకాపా హయాంలో ఏకకాలంలో రూ.600 కోట్లకు టెండర్లు ఖరారు చేయడాన్ని విజిలెన్స్ విభాగం గతేడాది ఇచ్చిన నివేదికలో తప్పు పట్టింది. ఎక్కువ కొటేషన్ల టెండర్లు ఆమోదించారని పేర్కొంది. తితిదే గణాంక అధికారి, ఇంజినీరింగ్ విభాగం ఏకకాలంలో రూ.300 కోట్లు అచ్యుతం, రూ.300 కోట్లు శ్రీపాదం వసతి భవనాలకు అనుమతులు ఇవ్వడంలో గత పాలకుల అవినీతి మరకలు ఉన్నాయంటూ నివేదిక సమర్పించింది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.ఈ రెండు సముదాయాల పనులు 2024 మార్చి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు వసతి కేంద్రాలకు సంబంధించి రూ.300 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వసతి



గృహాలకు సంబంధించి నిర్మాణ వ్యయం తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో కొన్ని అంశాల్లో వ్యయం తగ్గించేందుకు ఇంజినీరింగ్ విభాగం నివేదికలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

**సదుపాయాలు ఇలా..**శ్రీపాదం, అచ్యుతం తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు ఉంటాయి. ఒకటో అంతస్తులో పార్కింగ్, 2వ అంతస్తులో రిసెప్షన్, అన్నదాన కేంద్రం ఉంటాయి. 3, 4 అంతస్తుల్లో 48 డార్మెటరీలు, 5 నుంచి 9 అంతస్తుల్లో 532 గదులు నిర్మిస్తున్నారు.

# నిధులున్నా నిర్లక్ష్యమెందుకో..?

రాజమహేంద్రవరం : గత ప్రభుత్వ హయాంలో నిధుల్లేక పలు భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితులున్నాయి. కొన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నిధులు పుష్కలంగా విడుదలవుతున్నా నిర్మాణాల్లో గుత్తేదారు సంస్థల నిర్లక్ష్యం పూర్తిస్థాయిలో కనిపిస్తోంది. దీనికి రాజమహేంద్రవరం జీజీహెచ్ వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాల ప్రధాన భవనం పనులే నిదర్శనం. 2022లో రూ.450 కోట్లతో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రి భవన నిర్మాణం ప్రారంభించారు. విద్యార్థుల బోధనకు తాత్కాలిక భవనం, ఆసుపత్రి ఆధునికీకరణ, అయిదు అంతస్తుల వసతి గృహాల భవనాలు, మాతాశిశు భవనంపై రెండంతస్తుల బ్లాకులు నిర్మించారు. ఆసుపత్రి పక్కన కేంద్ర కారాగారం స్థలంలో రూ.90 కోట్లతో వైద్య కళాశాల ప్రధాన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది ఈ ఆగస్టు నెలకు పూర్తిస్థాయిలో అన్ని వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉంది. వీటికి సంబంధించి కూటమి ప్రభుత్వం పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నా గుత్తేదారు



సంస్థ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. భవనం అందుబాటులోకి రాకుంటే వచ్చే ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేటప్పుడు వైద్యవిద్యార్థుల బోధనకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ భవనాన్ని సెల్లార్, జీప్లస్-4గా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మూడు, నాలుగు నెలల్లో ఇది పూర్తిస్థాయి వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉండగా.. ఇదేమాదిరి పనులు జరిగితే భవనం పూర్తయ్యేసరికి మరో ఏడాది పట్టే అవకాశం ఉందని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు నిర్మాణాలపై పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పనులు జరిగేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నా గుత్తేదారు సంస్థ తీరు నత్తనడకన సాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.

# హరిత వనాలుగా విద్యాలయాలు

పామర్రు : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కూరగాయలు, ఆకుకూర తోటల పెంపకం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఐఎంఎంఎస్ యాప్‌లో కిచెన్ గార్డెన్ అవసరం, ఖాళీ స్థలం వివరాలు, వీటి నిర్వహణకు కమిటీని రూపొందించి సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. హరిత వనాలుగా, పోషకాహార తోటల పెంపక క్షేత్రాలుగా మార్చడానికి జిల్లాలో 858 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.5000 చొప్పున మొత్తం రూ.42.90 లక్షలు ఆయా మండల విద్యాశాఖాధికారి1 ఖాతాలకు సోమవారం వేశారు. వీటిని పాఠశాలల యాజమాన్య ఖాతాలకు జమ చేస్తారు. ఇప్పటికే అమ్మకోసం ఒక మొక్క పేరుతో పలు పాఠశాలల్లో పండ్ల



మొక్కలు నాటారు.

**మొక్కలు, పాదుల పెంపకం వివరాలు**

ప్రధానోపాధ్యాయులు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అటవీ శాఖ నర్సరీలకు వెళ్లి మొక్కలు తెచ్చుకుని పాఠశాలలో నాటి, పెంచాల్సి ఉంటుంది. నాటిన మొక్కల వివరాలను 'ఫారెస్ట్.ఏపీ.జీవోవి.ఇన్' వెబ్‌సైట్లో పొందుపరచాల్సి ఉంటుంది. ధవళేశ్వరం (రాజమహేంద్రవరం), పళ్ల కడియం (రాజానగరం), పేరూరు, కామనగరువు (అమలాపురం), కట్టుంగ, మెర్లపాలెం (ఆత్రేయపురం), శ్రీరామపురం (కపిలేశ్వరపురం), అవిడి (కొత్తపేట మండలం)లో మొక్కల పెంపకం నర్సరీలున్నాయి. వీటి నుంచి జామ, మామిడి, సపోట వంటి పండ్ల మొక్కలు తెచ్చి నాటతారు. ఉద్యానశాఖ నుంచి వంగ, బెండ, బీర, కాకర, ఆనప, తోటకూర, పాలకూర, గోంగూర తదితర కూరగాయల విత్తనాలు ఒక కిట్‌గా స్థలమున్న పాఠశాలలకు అందించనున్నారు.

# అటుగా పో'దారంటే'.. అవట్లేదు!

కాకినాడ : కాకినాడలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో చేపట్టిన పలు పనులు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. రూ.90 కోట్లతో 2018-19లో నిర్మించిన వసలపాకల-పోర్టు రైల్వేస్టేషన్ రోడ్డు మాత్రం నిరుపయోగంగా ఉంది. రోడ్డులో కొంత మేర పనులు అసంపూర్తిగా వదిలేయడంతో లక్ష్యం నెరవేరలేదు. వలసపాకల ప్రధాన రోడ్డు నుంచి ఆర్టీవో కార్యాలయం, డెయిరీ ఫారం సెంటర్, పోర్టు రైల్వేస్టేషన్ మీదుగా జగన్నాథపురం వంతెన రోడ్డుకు అనుసంధానంగా దీని నిర్మాణం చేపట్టారు. 9 కి.మీ. పొడవుగల ఈ రోడ్డును స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టారు. మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఈ రోడ్డును నిర్మించారు. సర్పవరం జంక్షన్ వైపునుంచి అమలాపురం, రామచంద్రపురం వైపువెళ్లే ప్రయాణికులు మెయిన్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగించేందుకు నిర్ణయించారు. అమలాపురం, రామచంద్రపురం వైపునుంచి వచ్చే వాహనాలు కూడా నగరంలోకి కాకుండా ఈ రోడ్డు మీదుగా పిఠాపురంవైపు వెళ్లవచ్చు. ఇంతటి ప్రయోజనకరమైన రోడ్డును గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కేవలం అర కిలోమీటరు మేర పూర్తి చేయలేకపోయారు. వాస్తవానికి ఈ రోడ్డులో కొంత స్థలం రైల్వేశాఖ పరిధిలో ఉంది. ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకుని రోడ్డును పూర్తి చేయాల్సిఉంది. గత తెదేపా హయాంలో అనుమతులకోసం ప్రయత్నిస్తుండగానే.. ప్రభుత్వం మారింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లపాటు పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే కొండబాబుకు వివరించగా రహదా రిపైకొచ్చిన చెత్తను శుభ్రం చేయించారు. దాంతో కాస్త మార్గం ఏర్పడింది.

**కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు నిర్మించాం. మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కట్టడి, దుమ్ములపేట, సంజయ్‌నగర్, సాంబమూర్తినగర్, రెవెన్యూకాలనీ తదితర ప్రాంతాలవారు జగన్నాథపురంవైపు వెళ్లేందుకు దగ్గరి దారికోసం దీనిని నిర్మించాం. గత పాలకులు అర కి.మీ. రోడ్డును నిర్మించలేకపోయారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా. పూర్తి చేయిస్తాం.

– వనమాడి కొండబాబు, కాకినాడ ఎమ్మెల్యే

# విస్తరణ నాణ్యత 'కట్ట'కథ



పత్తికొండ : రాయలసీమ జిల్లాలకు కేటాయించిన నీటిని పూర్తిస్థాయిలో తరలించేందుకు హంద్రీనీవా ప్రధాన కాలువను విస్తరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువను 134 కి.మీ. విస్తరణ పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం 2,100 క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నారు. 6.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.660 కోట్లతో పనులు చేపట్టారు. జూన్ 15 నాటికి పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ హడావుడిలో నాణ్యత చెదిరిపోయింది. మట్టి పనులకు రోలింగ్ చేయకపోవడంతో కోతకు గురవుతోంది.

**చిరు జల్లులకే చెదిరింది**

మద్దికెర-కసాపురం గ్రామాల మధ్య హంద్రీనీవా ప్రధాన కాలువపై విస్తరించిన మట్టికట్ట ఇది. పనుల్లో భాగంగా కుడి వైపున తవ్వి విస్తరిస్తున్నారు. సక్రమంగా రోలింగ్ చేయడం లేదు. ఇటీవల కురిసిన చిరు జల్లులకు పలుచోట్ల కోతకు గురైంది. ఇలాగే జరిగితే కాలువకు నీరు వదిలే సమయంలో గండ్లు పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఎక్కడికక్కడ కోత**

హంద్రీనీవా కాలువ వెంట విస్తరణ పనుల్లో భాగంగా కాలువ మట్టినే తొలగించి కట్టగా నిర్మిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొత్తగా నిర్మిస్తున్న కట్ట కోతకు గురవుతోంది.

పత్తికొండ నుంచి మద్దికెర వరకు నిర్మించిన ప్రధాన కాలువను కొన్ని చోట్ల లెవెల్ ఆధారంగా భూమి ఉపరితలం నుంచి ఇరువైపులా మట్టి కట్టలు వేసి నిర్మించారు. అనంతరం ఆ మట్టితోనే పాత కట్టను విస్తరిస్తూ పనులు చేస్తున్నారు. పనుల్లో నాణ్యత కొరవడటంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టికట్ట పలు చోట్ల కోతకు గురైంది. మరికొన్నిచోట్ల ఇప్పటికే భారీగా నెర్రలు ఏర్పడ్డాయి. ఇలాంటి చోట వర్షాలు కురిసే సమయంలో భారీగా కోతకు గురయ్యే ప్రమాదముందని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# శాఖ మారింది.. 'దారి'ద్య్రం వీడకుంది



నంద్యాల : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీరాజ్ రహదారులను పదేళ్ల కిందట ఆర్అండ్‌బీ శాఖలోకి మార్చారు. మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలను నేరుగా కలిపే పంచాయతీరాజ్ రహదారులను ఆర్అండ్‌బీకి బదలాయించారు. తద్వారా గ్రామాలకు సులువుగా రాకపోకలు చేసేందుకు అవకాశం కల్పించారు. శాఖల పేర్లయితే మారాయి కాని రహదారుల దుస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడంతో గ్రామీణులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు.

**56 మార్గాలు.. 944 కి.మీలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 944 కి.మీల పొడవైన 56 పంచాయతీ రాజ్ రహదారులను పదేళ్ల కిందట ఆర్అండ్‌బీలోకి బదలాయించారు. నంద్యాల నియోజకవర్గంలో 60 కి.మీలు, డోన్ 84, పాణ్యం 210, నందికొట్కూరులో 64, ఆళ్లగడ్డ 50, బనగానపల్లి 85, శ్రీశైలం 42, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు 58, ఆదోని 32, పత్తికొండ 64, ఆలూరు 75, కోడుమూరు 52, మంత్రాలయం నియోజకవర్గంలో 68 కి.మీల రహదారులు ర.భ.శాఖకు అప్పగించారు. వీటిలో 60 శాతంపైగా రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు బదలాయింపు జరిగినా ప్రత్యేకంగా నిధులు విడుదల కాకపోవడంతో మరమ్మతులు కూడా చేయించలేని దుస్థితి నెలకొంది.

**ఒక్కటి బాగుచేస్తే ఒట్టు**

కర్నూలు జిల్లా ఆదోని డివిజన్‌లోని ఎమ్మిగనూరు- మాలపల్లి రోడ్డు ఇది. 20 కి.మీలు పొడవున్న ఈ రహదారిపైన ఆర్టీసీ బస్సులే 100కు పైగా రాకపోకలు సాగిస్తున్నాయి. గుంతలమయమై అధ్వానంగా మారిన ఈ రోడ్డును ఎనిమిదేళ్లుగా అభివృద్ధి చేయడం లేదు.

**ఛిద్రమయ్యాయి**

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కోసిగి- కరిని రహదారితో పాటు బిలేకల్లు- ఎమ్మిగనూరు రోడ్డు ఛిద్రమయ్యాయి. కోడుమూరు నియోజకవర్గంలో 42 కి.మీల మేర రహదారులు దెబ్బతిన్నాయి. పాణ్యం నియోజకవర్గంలో ఓర్వకల్లు- తిప్పాయిపల్లె రోడ్డు ప్రయాణానికి పనికిరాకుండా మారింది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ-గోవిందపల్లె మార్గంలో నాలుగు కి.మీ పొడవున రహదారి దెబ్బతింది.

**వీటిని వదిలేశారు**గుంతలమయమైన ఆర్అండ్‌బీ రహదారులకు ఆరు నెలల కిందట నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేశారు. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీలోకి బదలాయించిన రోడ్లకు మాత్రం మరమ్మ తులు చేపట్టలేదు. పశ్చిమ ప్రాంతమైన ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని నియోజకవర్గాల్లో తుంగభద్ర పుష్కరాల కింద నిధులను ప్రతిపా దించి టెండర్లు పిలిచారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు జరగలేదు. దారుణంగా దెబ్బతిన్న ఈ రహదారులకు మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదన్న ఉద్దేశంతో వీటిని వదిలేశారు.

# కాలువల ప్రక్షాళనకు కదలిక



పి.గన్నవరం: వేసవి క్లోజర్ పిరియడ్‌కు సంబంధించి కాలువల నిర్వహణ పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. సాగునీటి సంఘాల ప్రతినిధులు గత రెండు రోజులుగా వీటిని మొదలుపెట్టారు. ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక ఆదేశాలు రాకపోవడంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఇటీవల మెమోల రూపంలో ఆదేశాలు ఇచ్చారు. కొంతమంది శాసనసభ్యుల ఒత్తిడి, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లడం తదితర పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ఆలస్యంగా నీటి విడుదల?**

ఏప్రిల్ 27న పంటకాలువలకు సాగునీరు నిలుపుదల చేశారు. క్లోజర్ పనులకు లిఖితపూర్వక ఆదేశాలు రాలేదని పనులు మొదలు పెట్టడంలో తీవ్రజాప్యం జరిగింది. ఈవిధంగా 18 రోజుల సమయం వృథాగా పోయింది. ఐ.ఎ.బి. (సాగునీటి సలహామండలి) సమావేశంలో నిర్ణయించిన ప్రకారం జూన్ 1నే కాలువలకు నీరు విడుదల చేయాలి. క్లోజర్ పనులు ఆలస్యంగా మొదలు పెట్టడంతో జూన్ 10 తరువాత గాని నీరు విడుదల చేసే పరిస్థితులు ఉండవని జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు భావిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒ.అండ్.ఎం.(ఆపరేషన్ అండ్ మెయింటెనన్స్) కింద రూ.35.81 కోట్ల విలువైన 853 పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికీ నిధుల కేటాయింపు చేస్తూ లిఖిత పూర్వకమైన ఉత్తర్వులు రాకపోవడంతో డోలాయమాన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల నుంచి మెమోల రూపంలో ఆదేశాలు రావడంతో వీటికి కదలిక ఏర్పడింది. రూ.38.81 కోట్ల విలువైన పనుల్లో సుమారు రూ.5 కోట్లతో కాలువల్లో పూడికతీత, షట్టర్ల మరమ్మతు వంటివి ఉన్నాయి. కాలువలకు నీరు విడుదల చేసేలోగా పూర్తిచేయాలి.**రెండు రోజుల్లో ఊపందుకుంటాయి**

కాలువల క్లోజర్ పిరియడ్ పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ మేరకు కిందిస్థాయి అధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం 32 పనులు మొదలుపెట్టారు. రానున్న రెండు రోజుల్లో ఊపందుకుంటాయి.

కె.గోపీనాథ్, ఎస్.ఇ., జలవనరులశాఖ, ధవళేశ్వరం సర్కిల్

# కాసుల డీజిల్

అమలాపురం : పొరుగున ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి డీజిల్, పెట్రోల్ అక్రమ మార్గాల్లో బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశిస్తోంది. ధరలో వ్యత్యాసం ఉండటంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. యానాం చెంతన ఉన్న ఐ.పోలవరం మండలం నుంచి ముమ్మిడివరం, అమలాపురం చుట్టుపక్కల మండలాలకు నిత్యం వేల లీటర్లు అక్రమంగా తరలిస్తున్నారు. కోనసీమలో ఆక్వా సాగు పెద్ద ఎత్తున ఉండటంతో చెరువుల వద్ద జనరేటర్లలో భారీగా డీజిల్ వినియోగిస్తారు. వీరికి అవసరమైన డీజిల్ యానాం నుంచి ఇక్కడికి అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నారు. పెట్రోల్ సైతం తెస్తున్నారు. దీంతో పోల్చితే డీజిల్ పరిమాణం ఎక్కువ. బంకుల్లో లూజు విక్రయాలపై నిషేధం ఉన్నా.. యానాంలో వాటిని పట్టించుకోవడం లేదు. రవాణా సమయంలో కొందరు సిబ్బంది డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ వాహనాలు ఎక్కడైనా ప్రమాదానికి గురైతే భారీ నష్టం తప్పదు. వేసవి నేపథ్యంలో మరింత ముప్పు ఉంది.

**దొరికింది కొంతే..**

కోనసీమలోని తీర ప్రాంతాల్లో నదీమార్గంలో పడవలు, బోట్లు ద్వారా, ఇతర ప్రాంతాల్లో రోడ్డు మార్గంలో ఈ అక్రమదందా సాగుతోంది.



నిత్యం వేల లీటర్ల డీజిల్ అక్రమంగా యానాం నుంచి వస్తోంది. ఎక్కువ మంది పోలీసుల కన్నుగప్పి గమ్యం చేరుతున్నారు. అలాంటి వారికి కొంతమంది సిబ్బంది సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా మరింత నిఘా పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఇక్కడి బంకుల్లో విక్రయాలు తగ్గి..**

యానాం నుంచి అక్రమంగా ఇంధనం వస్తుండటంతో కోనసీమ శివారు ప్రాంతాల్లోని పెట్రోలు బంకులు మూతపడుతున్నాయి. 216 జాతీయ రహదారి చెంతనే ఉన్న బంకులకు పెద్ద ఇబ్బంది లేకపోయినా, శివారు మండలాలైన కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు తదితర మండలాల్లోని కొన్ని బంకుల్లో అమ్మకాలు భారీగా తగ్గడంతో మూసివేసే పరిస్థితికి వస్తున్నాయి.**ఎవరినీ ఉపేక్షించం..**యానాం నుంచి అక్రమంగా డీజిల్, పెట్రోలు తరలించే వారిని ఉపేక్షించం. వీటి అక్రమ రవాణా కారణంగా ఇక్కడ ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనాల్లో ఇంధనం తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

–టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ, అమలాపురం

# అతివేగం.. అంతులేని అనర్థం

చిత్తూరు : తిరుపతి జాతీయ రహదారిలో ముందు వెళ్తోన్న కంటైనర్‌ను అధిగమించే ప్రయత్నంలో కారు ఢీ కొట్టింది. అందులో ఉన్న ఏడుగురిలో అయిదుగురు ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. ఆ సమయంలో దాదాపు 110- 120 కి.మీ. వేగంతో కారు ప్రయాణిస్తోంది. గాదంకి టోల్‌ప్లాజాకు మధ్యాహ్నం 1.17 గంటలకు చేరుకోగా ఆపై ఎనిమిది-తొమ్మిది నిమిషాలకే తోటపల్లి వద్ద దుర్ఘటన జరిగింది. అతివేగం, ముందున్న వాహనాన్ని త్వరగా అధిగమించి గమ్యస్థానానికి చేరాలన్న తొందరే ప్రమాదానికి కారణం. చిత్తూరు నగరం మురకంబట్టులో ముందు వెళ్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహన చోదకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేగంకన్నా ప్రాణం మిన్న.. ఇదీ రవాణా శాఖ నినాదం. అటు ప్రయాణికులు దీన్ని పాటించడం లేదు. ఇటు అతివేగానికి అడ్డుకట్ట వేయాల్సిన రవాణా శాఖ పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగిసిన మరుసటిరోజే వాటిని ఆశాఖ మరచిపోతుండటంతో వాహనదారుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రహదారులు రక్తమోడుతున్నాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు-తిరుపతి, బెంగళూరు- చెన్నై, పలమనేరు- కుప్పం, రేణిగుంట-నాయుడుపేట, రేణిగుంట- చెన్నై జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. తరచూ ఏదోఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మానవ తప్పిదాలతోపాటు అధికారుల నిర్లక్ష్యం, అలసత్వమే దీనికి ప్రధాన కారణం. రహదారుల్లో వాహనాల వేగాన్ని నియంత్రించడం, నిబంధనలను అతిక్రమించిన వాహనాలను సీజ్ చేయడం వంటివి రవాణాశాఖ అధికారులు చేయలేకపోతున్నారు. పోలీసు అధికారులు నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతూ జరిమానాలు విధిస్తున్నా.. ప్రజల్లో చైతన్యం తేలేకపోతున్నారు.

**అధిగమిస్తూ.. అదుపుతప్పుతూ..**

రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి తిరుమలకు రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. త్వరగా దేవుడిని దర్శించుకుని అంతే త్వరగా గమ్యస్థానానికి చేరుకుని విధులకు హాజరవ్వాలని హడావుడి పడుతుంటారు. ఒక్కోసారి దర్శనం ఆలస్యమైతే కారులో వచ్చే వ్యక్తులు నిర్ణీత వేగానికి మించి వెళ్తున్నారు. ముందున్న లారీలు, బస్సులను అధిగమించే క్రమంలో అదుపు తప్పుతున్నారు. కొన్ని సందర్భాల్లో వేరే వరుసలో ఉన్న వాహనాలను ఢీకొడుతున్నారు. వాహనదారులు రహదారిపై అప్రమత్తంగా ఉండటమే కాకుండా.. వేగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆగి ఉన్న వాహనాలతో..**

జిల్లాలోని రోడ్లు, రహదారుల పక్కనే దాబాలు, భోజనశాలలు, కొంత దూరంలో మద్యం దుకాణాలు ఉండటంతో భారీ వాహనాలు, ఇతర వాహనాలు రోడ్లపక్కనే ఆగుతున్నాయి. చిత్తూరు నుంచి తిరుపతి వరకు రహదారి పక్కనే ఈ తరహా పార్కింగ్ ఎక్కువగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కనిపించని రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు**

చిన్న వాహనాల నుంచి భారీ వాహనాల వరకు వెనుకాముందు ఉండాల్సిన రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు చాలావరకు కనిపించడం లేదు. ఇవి ఉంటే రాత్రి సమయంలో చాలావరకు ప్రమాదాలు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**బెంగళూరు నుంచి స్నేహితుడి కారులో..**

తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హొసూరుకు చెందిన త్యాగరాజన్, బెంగళూరు సౌత్ గౌడనపాళ్యకు చెందిన బీఎస్ సహన మధ్య ఓ హెల్త్ కంపెనీలో పనిచేసే సమయంలో పరిచయం ఏర్పడింది. తర్వాత రెండు కుటుంబాల మధ్య స్నేహం కొనసాగుతోంది. సహన భర్త ఎస్ఆర్ రజిని గౌడ సినీపరిశ్రమలో పనిచేస్తున్నారు. రజినిగౌడ, బీఎస్ సహన కుటుంబం తిరుమలకు వెళ్లాలని త్యాగరాజన్‌కు చెప్పడంతో ఆయన తన కుమారుడు క్రిష్విన్‌తో బయలుదేరారు. ఈనెల 25వ తేదీ తనతో జీఆర్‌బీ డెయిరీ ఫుడ్స్‌లో పనిచేసే స్నేహితుడి కారు తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. మరుసటి రోజు రజినిగౌడ కుటుంబ సభ్యులు ఐదుగురితో కలిసి తిరుమలకు వచ్చారు. 28వ తేదీ వేకువ జామున శ్రీవారి దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత శ్రీకాళహస్తికి వెళ్లి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణం అవుతున్నట్లు మధ్యాహ్నం 12.30 గంటలకు త్యాగరాజన్ తన భార్యకు ఫోన్ చేసి చెప్పారు. **కుక్కల కోసం ఆగిపోయారు**త్యాగరాజన్ కుమారుడితోపాటు తన భార్యను తిరుమలకు రమ్మని పిలిచారు. అందరూ వెళ్తే ఇంట్లో ఉన్న రెండు కుక్కల బాధ్యత ఎవరు చూసుకుంటారని భార్య మీగల్ ఆగిపోయింది.

# అవినీతి విస్తరణకు అడ్డుకట్ట

నంద్యాల : కుందూనది విస్తరణ పేరుతో నిధుల మేతకు కొందరు వేసిన ప్రణాళిక బెడిసికొట్టింది. రూ.కోట్ల విలువైన బిల్లులను కూటమి ప్రభుత్వం తిరస్కరించింది. 2024- 25 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను పంపాలని కొంతకాలం కిందట ప్రభుత్వం ఆదేశించింది. ఇదే అదనుగా కేసీ కెనాల్ అధికారులు కుందూ ఆధునికీకరణ పనులకు సంబంధించిన రెండు బిల్లులను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. నీరు-చెట్టు పనులనే కుందూ ఆధునికీకరణలో భాగంగా చేసినట్లు చూపారని విజిలెన్స్ విచారణలో తేలింది. వాటి వివరాలు, పనుల ప్రగతిని, విజిలెన్స్ నివేదికలను పరిశీలించిన ప్రభుత్వం ఇటీవల తిరస్కరించింది.

**విచారణ సాగుతుండగానే బిల్లులు పెట్టారు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుందూ ఆధునికీకరణ పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. పనులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఓ వైపు విచారణ జరుగుతుండగానే నీటి పారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి బిల్లులు పంపించారు. ఓ గుత్తేదారు సంస్థకు రూ.150 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మరో సంస్థకు రూ.52 కోట్లు ఇవ్వాల్సి ఉందని బిల్లులు పెట్టారు.నిబంధనల ప్రకారం విజిలెన్స్ కేసులు మూసివేశాక లేదా రద్దు చేశాకే ఆయా పనులకు బిల్లులు చేస్తారు. వీటిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెండు బిల్లులను తిప్పి పంపింది.

**మరోసారి తనిఖీలు**



కుందూ ఆధునికీకరణ పనులకు సంబంధించి విజిలెన్స్ అధికారులు మరోసారి తనిఖీలు చేశారు. ఐదు రోజుల కిందట నంద్యాల కేసీ కాల్వ ఈఈ కార్యాలయం వేదికగా విజిలెన్స్ బృందం విచారణ నిర్వహించింది. నంద్యాల కేసీ కెనాల్ ఈఈతో పాటు బనగానపల్లి ఎస్సార్బీసీ ఈఈ, ఆళ్లగడ్డ కేసీ కాల్వ ఈఈతో పాటు పలువురు డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బందిని నంద్యాల కేసీ కెనాల్ కార్యాలయానికి పిలిపించి విచారించారు. గతంలో తీసుకెళ్లిన దస్త్రాలతో పాటు మరికొన్నింటిపై విజిలెన్స్ దృష్టిసారించింది. అధికారులను పలు కోణాల్లో విచారించి వివరాలు రాబట్టారు. మరోసారి కుందూనదిలో మరోసారి పరిశీలన చేయనున్నట్లు సమాచారం.

**మన్ను బుక్కేశారు**

'0' కి.మీ నుంచి పాణ్యం మండలం మద్దూరు వరకు నంద్యాల కేసీ కెనాల్ ఈఈకి, మద్దూరు నుంచి కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తి వరకు బనగానపల్లి ఎస్సార్బీసీ ఈఈకి, గుళ్లదుర్తి నుంచి పెన్నానది వరకు ఆళ్లగడ్డ కేసీ కెనాల్ ఈఈకి పనుల పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. పనుల్లో భాగంగా పాములపాడు, వెలుగోడు, బండిఆత్మకూరు, నంద్యాల, పాణ్యం, గోస్పాడు, కోవెలకుంట్ల, బనగానపల్లి, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లో 5 వేల ఎకరాల పట్టా భూములను సేకరించాల్సి ఉండగా సెంటు భూమి సేకరించలేదు. విస్తరణలో భాగంగా తవ్విన మట్టిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. నంద్యాల ప్రథమనంది ఆలయం వెనుక నదిలో జరిగిన పనుల్లో భాగంగా వచ్చిన మట్టిని టిప్పర్ల ద్వారా తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. పాణ్యం మండలం మద్దూరు వద్ద ఇలానే అక్రమాలు జరిగాయి.

**మూడేళ్లలో చేసింది 20 శాతమే**

బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నానది వరకు 189 కి.మీ మేర విస్తరించడానికి గత వైకాపా ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. రూ.1725 కోట్లతో చేపట్టాలనుకొన్న పనులను వైఎస్సార్ జిల్లాకే చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. మూడేళ్ల పాటు పనులు జరిగినా 20 శాతమే చేశారు. ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతంలోనే మొక్కుబడిగా జరిగాయి. వాటికీ అప్పటి వైకాపా ప్రభుత్వం ఒక్కపైసా బిల్లులు చెల్లించలేదు. దీంతో గుత్తేదారులు పనులు నిలిపేశారు.

# వంతెన.. సాకారమయ్యేనా

పి.గన్నవరం : వశిష్ఠ గోదావరి నదీపాయ మధ్యలో ఉన్న ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలవారికి.. గోదావరి వరదల నుంచి శాశ్వత విముక్తి కలిగించేందుకు ఏఐఐబీ(ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) రుణంతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. దీంతో ఆ బ్యాంకు బృందంతో పాటు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు బుధవారం పరిశీలనకు రానున్నారు. రూ.49.50 కోట్ల అంచనాతో 2023 మార్చి 30న ఇక్కడ వంతెన పనులను గుత్తేదారు సంస్థ మొదలుపెట్టింది. ఈ ఏడాది మార్చి 29 నాటికి పూర్తికావాల్సి ఉంది. ఇంతవరకు రూ.27 కోట్ల విలువైన పనులు పూర్తవగా అసంపూర్తిగా నిలిచిపోయాయి.



**పేరుకుపోయిన బకాయిలు..**

గుత్తేదారుకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. భూ సేకరణకు రైతులకు రూ.2.50 కోట్లు చెల్లించాలి. నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. ఏఐఐబీ బృందం కూడా గతంలో వంతెన నిర్మాణం గురించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వివరించింది. బుధవారం ఈ బృందం మరోసారి వస్తున్న నేపథ్యంలో సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# తాగునీటికి కండలేరు జలాలు



సూళ్లూరుపేట : ఈ వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని తిరుపతితో పాటు ముఖ్య పట్టణాలకు తెలుగుగంగ కాలువ ద్వారా కండలేరు జలాలు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాలోని చెరువులకు సాగునీరు, పశువులు అవసరాలకు కూడా మరికొంత నీటిని అందించేందుకు తెలుగుగంగ ఇంజినీర్లు ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వానికి పంపారు. డిమాండును బట్టి వచ్చేనెల 5 తర్వాత దశల వారీగా నీరు విడుదల చేయనున్నారు.

తిరుపతి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రాంతాలతోపాటు నెల్లూరు జిల్లాలోని రాపూరు, పొదలకూరు ప్రాంతాల్లోని గ్రామాలకు తాగునీటి అవసరాలకు 4.75 టీఎంసీల నీటిని ఇచ్చేలా నిర్ణయించారు. పెళ్లకూరు, నాయుడుపేట, కోట, చిట్టమూరు, వాకాడు ప్రాంతాల్లో విస్తరించిన స్వర్ణముఖి నదికి కూడా రెండు టీఎంసీల కండలేరు జలాలను విడుదల చేయనున్నారు. దీని ద్వారా వాకాడు సమీపాన స్వర్ణముఖి బ్యారేజ్‌లో నీరు నిల్వ ఉండి, భూగర్భ జలాలు పెరుగుతాయి. నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో చెక్‌డ్యామ్‌లో నీరు ఉండి, పంటల సాగుకు వీలుకానుంది.

**1.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు:** తిరుపతి జిల్లాలో 1,24,640 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 35,360 ఎకరాల ఆయకట్టుకు కండలేరు నుంచి 16 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ఈ దఫా వర్షాలు ఆలస్యంగా కురిసినా నారుమడులు సిద్ధం చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా జలాశయంలో 4.95 టీఎంసీ నీటిని నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం కండలేరు నుంచి ఇచ్చే నీరు సరిపోనందున ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది.

**పరిశ్రమలకు 1.25 టీఎంసీలు**

మేనకూరు ఆర్థికమండలితో పాటు శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రాంతాల్లోని పరిశ్రమలకు 1.25 టీఎంసీల తెలుగుగంగ నీటిని ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణమూర్తి తెలిపారు.

# సంక్షేమ రుణం సహకార సంక్షోభం



కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా తీసుకొన్న విధానాలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)ను నిండా ముంచాయి. రైతులకు రుణాలు ఇవ్వకుండా సంక్షేమ పథకాల పేరుతో ఆ పార్టీ కార్యకర్తలకు సీహెచ్‌సీలు, పీఎం స్వానిధి, జగనన్నతోడు, ఫిష్ ఆంధ్రా పథకాల పేరుతో పెద్దఎత్తున రుణాలు ఇచ్చారు. 25 శాఖల పరిధిలో రూ.64.06 కోట్ల మేర అందజేశారు. 2,330 మంది రూ.6.76 కోట్ల మేర చెల్లించకుండా మొండికేశారు. గత మూడేళ్లుగా కంతులు చెల్లించడం లేదు. వీరి నుంచి వసూలు చేసేందుకు సహకార బ్యాంకు బ్రాంచీల అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీర్ఘకాలిక మొండి బకాయిల వసూళ్లు తలకు మించిన భారంగా మారిందని ఓ అధికారి పేర్కొనడం గమనార్హం.

సహకార నిబంధనల ప్రకారం సాగు భూమి ఉన్నవారికే సహకార సొసైటీలో సభ్యత్వం ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో సెంటు భూమి లేనివారు.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారిని ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులుగా, డీసీసీబీ ఛైర్మన్లుగా ఎంపిక చేశారు. వారి ఆదేశాలమేరకు అధికారులు ఇష్టానుసారంగా రుణాలు పంపిణీ చేశారు. వారందరూ ప్రస్తుతం రుణాలు చెల్లించకుండా మొండికేస్తుండటం గమనార్హం. 2014-19 మధ్య సహకార బ్యాంకుకు రూ.170 కోట్ల మేర నిరర్థక ఆస్తులుండగా. గత ఐదేళ్ల కాలంలో రూ.80 కోట్ల మేర నిరర్థక ఆస్తులు పెరిగిపోయాయి.

**స్వానిధి**

ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేల చొప్పున పీఎం స్వానిధి పేరుతో చిరు వ్యాపారులకు సహకార బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించారు. ఉమ్మడి జిల్లాలో 10,245 మందికి రూ.12.68 కోట్ల మేర మంజూరు చేశారు. ఇందులో 1,795 మంది లబ్ధిదారులు రూ.1.62 కోట్ల మేర కట్టాల్సి ఉంది. వారిలో 41 మంది కొంతమేర తక్కువ మొత్తంలో చెల్లిస్తుండగా.. మిగిలిన 1,754 మంది రూ.1.56 కోట్ల మేర రుణ చెల్లింపులు చేయడం లేదు.

**అక్రమాల తోడు**

జగనన్న తోడు పథకం కింద 1,274 మందికి రూ.1.30 కోట్ల మేర రుణాలిచ్చారు. గత మార్చి నెలాఖరు నాటికి పరిశీలిస్తే 314 మంది రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉంది. అందులో 124 మందికి సంబంధించి రూ.90 వేల వరకు మొండి బకాయిలున్నాయి. ఇక ఫిష్ ఆంధ్రా పేరుతో 356 మందికి రూ.4.06 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఇందులో 17 మంది రూ.20 వేలు చెల్లించాల్సి ఉంది.

**సాగు యంత్రం కుతంత్రం**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో ఒక్కొక్కరికి రూ.15 లక్షలు మంజూరు చేయించారు. ఇందులో రైతు సంఘాల వాటా 10 శాతం కాగా 40 శాతం (రూ.6 లక్షలు) రాయితీపోనూ మిగిలిన రూ.7.50 లక్షలు సహకార బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,162 రైతు సంఘాలకు రూ.46.02 కోట్ల మేర సహకార బ్యాంకు రుణం రూపేనా ఇచ్చింది. ఈ ఏడాది మార్చి నాటికి కేవలం 136 సంఘాలే చెల్లించాయి.మిగిలిన 1026 సంఘాల నుంచి రూ.23.43 కోట్ల మేర వసూలు కావాల్సి ఉండటం గమనార్హం. కొన్ని రైతు సమూహాలు రుణం తీసుకున్న నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించలేదు. ఉమ్మడి జిల్లాలో 435 కేంద్రాలకు సంబంధించి సుమారు రూ.5.04 కోట్ల మేర దీర్ఘకాలిక మొండి బకాయిలున్నాయి. చాలా చోట్ల యంత్ర పరికరాలు కనిపించడం లేదు.

# బోధన కొరవడి.. ఫలితం చతికిలపడి



కదిరి : శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో సాంకేతిక వృత్తి విద్యా బ్రిడ్జి కోర్సుల్లో విద్యార్థుల ఫలితాలు అధఃపాతాళానికి పడిపోవటం విస్మయానికి గురిచేస్తోంది. 40 మంది విద్యార్థులున్న తరగతిలో నలుగురైదుగురు కూడా ఉత్తీర్ణత కాకపోవడం లోపం ఎక్కడుందో ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులకే ఎరుక. జిల్లాలో 20 కళాశాలల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, మెకానికల్ ఆటోమొబైల్ టెక్నీషియన్, సివిల్ ఇంజినీరింగ్ వంటి బ్రిడ్జి కోర్సులను నిర్వహిస్తున్నారు. బ్రిడ్జి కోర్సులో ఉత్తీర్ణత సాధిస్తే ఎంసెట్ ద్వారా ఇంజినీరింగ్ చేరేందుకు అవకాశం ఉంది. అదేవిధంగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం, బీఎస్సీ నర్సింగ్‌లో చేరొచ్చు. అయితే ఇటీవల వెల్లడైన బ్రిడ్జి కోర్సు పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు చతికిలబడ్డారు.

**కుంటుపడిన చదువులు** బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులు బోధించేందుకు కళాశాలల్లో అధ్యాపకులు లేకపోవడంతో విద్యా బోధన కుంటుపడింది. ఒకేషనల్ గ్రూపుల పాఠ్యాంశాలకే విద్యార్థులు పరిమితమయ్యారు. చివరలో ముఖ్యమైన అంశాలను వల్లె వేయించినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం కేవలం పది లోపలే పరిమితమైంది.

జిల్లాలో గుడిబండ ప్రభుత్వ కళాశాలలో మాత్రమే మొదటి సంవత్సరం బ్రిడ్జి కోర్సులో 31కి 13 మంది, ద్వితీయ సంవత్సరంలో 42కు 20 మంది ఉత్తీర్ణత సాధించారు. కొన్ని కళాశాలల్లో ఇద్దరు, ముగ్గురు పాసవగా, చాలా చోట్ల ఫలితాలు సున్నాకే పరిమితమయ్యాయి. పర్యవేక్షణ అధికారులు ప్రారంభం నుంచే శ్రద్ధ చూపిఉంటే బ్రిడ్జికోర్సు ఉత్తీర్ణతతో పాటు పేద విద్యార్థుల ఉన్నత విద్యకు మార్గమయ్యేదని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సబ్జెక్టు అధ్యాపకులదే బోధన బాధ్యత-** రఘునాథరెడ్డి, డీఐఈఓ, పుట్టపర్తివిద్యార్థుల ఎంపికతోనే బ్రిడ్జి కోర్సు ఉంటుంది. వారికి సైన్సు సబ్జెక్టు అధ్యాపకులే బోధిస్తారు. అయితే ఫలితాలు అంతగా సాధించలేకపో యారు. ఈ విషయంపై ఆయా కళాశాలల్లో విచారిస్తాం. ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. బ్రిడ్జి కోర్సులోనే ఎందుకు రాలేదో విచారించి, తగిన చర్యలు తీసుకుంటాం.

# జంతువుల కదలికపై కన్ను

పోలవరం : జాతీయ పార్కుగా ప్రకటించిన పాపికొండల అభయారణ్యంలో వన్య ప్రాణులను గుర్తించి వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీశాఖ వన్యప్రాణి విభాగం దృష్టి సారించింది. ఈ నెల మొదటి వారంలో జంతువుల గణనకు ఏలూరులో శిక్షణ పొందిన ఆ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అడవుల్లో ట్రాప్ కెమెరాలు ఎక్కడెక్కడ, ఏ కోణంలో ఉంచాలో నివేదిక రూపొందించారు. ఆ సమాచారంతో 10 బీట్‌లలో కెమెరాలు అమర్చే పనుల్లో వారంతా నిమగ్నమయ్యారు.ఎక్కడెక్కడ అంటే.. పోలవరం పరిధిలో అభయారణ్యం 15వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. మెత్తప్పకోట, కొత్తూరు, కోండ్రుకోట, తూటిగుంట, చిలకలూరు, శిరివాక, ఉడతపల్లి, వింజరం, శివగిరి, టేకూరు బీట్‌ల పరిధిలో 70 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

**15 అడుగుల దూరంలో ఉన్నా**

జంతువులు నడిచే బాటల వెంట, నీటి కుంటల వద్ద చెట్లకు దిగువ నుంచి మూడు అడుగుల ఎత్తులో ఎదురెదురుగా రెండు ట్రాప్ కెమెరాలు అమర్చుతారు. కెమెరా పరిధిలో 15 అడుగుల దూరంలోని చిన్న కదలిక సైతం స్వయంచాలితం (ఆటోమెటిక్)గా కెమెరాకు చిక్కుతుంది. వాటి ముందు నుంచి చిన్న చిన్న జంతువులు వెళ్లినా నమోదవుతుంది. ప్రతి ట్రాప్ కెమెరాలో 32 జీబీ చిప్, ఎనిమిది



బ్యాటరీలు ఉంటాయి. వారానికోసారి చిప్‌లను రేంజ్ కార్యాలయానికి తెచ్చి వాటిలో నమోదైన దృశ్యాలను తీసి కంప్యూటర్‌లో భద్రపరుస్తారు. బ్యాటరీలను పదిహేను రోజులకో పర్యాయం మార్చాల్సి ఉంటుంది.

**ప్రత్యేక రక్షణ దళంతో..**

వన్యప్రాణులను వేటాడే వ్యక్తులు కెమెరాలను అపహరించే ప్రమాదం ఉంది. వీటి నిరంతర పరిశీలనకు ప్రత్యేక రక్షణ సహాయకులు ఉంటారు. చిరుత పులులు అభయారణ్యంలో తిరుగుతున్నాయని పోలవరం అటవీశాఖ అధికారి ఎస్‌కే వలీ అన్నారు. గతేడాది ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో అలజడి సృష్టించిన పెద్దపులి జాడ ట్రాప్‌కెమెరాల ద్వారానే గుర్తించినట్లు చెప్పారు. పోలవరంతోపాటు కుక్కునూరు, అమరవరం రేంజి కార్యాలయాల పరిధిలోని పాపికొండల అభయారణ్యంలోను కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

# అంతర్జాలంలో మాయాజాలం

ఏలూరు: ట్రిపుల్ ఐటీల్లో ఇంటర్‌నెట్ కుంభకోణానికి తెర తీశారు. ఓ కంపెనీకి అప్పనంగా భారీ లబ్ధి చేకూర్చేందుకు యాజమాన్యం కథ నడిపించింది. టెండర్లతో పని లేకుండా ఇష్టారాజ్యంగా కాంట్రాక్టులు కట్టబెట్టేశారు. మార్కెట్లో అంతర్జాలం సదుపాయం సమకూర్చే కంపెనీలు బోలెడున్నా అన్నింటినీ పక్కకు తోసి ఆ కంపెనీకే ఇవ్వడం వెనుక భారీ ముడుపుల ముచ్చటే ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

**నిబంధనలకు పాతర**

నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ప్రాంగణాల్లో విద్యార్థులకు అంతర్జాలం సదుపాయం కల్పించేందుకు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జీవో 258 ప్రకారం రూ.లక్షకు మించి చేపట్టే ఏ పనికైనా ఈ ప్రొక్యూర్మెంట్ విధానం ప్రకారం టెండర్లు ఆహ్వానించాలి. ట్రిపుల్ ఐటీ అధికారులు మాత్రం నిబంధనలతో పని లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్కో ప్రాంగణానికి రూ.కోటికి పైగా విలువ చేసే అంతర్జాల సదుపాయం కల్పించే కాంట్రాక్టులను ఇష్టారాజ్యంగా ఓ కంపెనీకి ఇచ్చేశారు. ఒక్క నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించినందుకే మూడేళ్లకు రూ.2.28 కోట్లు చెల్లించాలని సదరు కంపెనీ ప్రతిపాదనలు పెట్టింది. దీనికి యాజమాన్యం తలాడించడంతో ఇప్పటికే పనులు కూడా మొదలయ్యాయి. ఇదే విధానాన్ని మిగిలిన మూడు ప్రాంగణాల్లోనూ అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అన్ని




ప్రాంగణాల్లో కలిపి రూ.కోట్లలో ఆ కంపెనీకి లబ్ధి చేకూర్చనున్నారు.

**ఆ కంపెనీకే ఎందుకో?**

నిబంధనల ప్రకారం పత్రికా ప్రకటన ఇచ్చి..బహిరంగ టెండర్లు పిలిస్తే ఆసక్తి ఉన్న కంపెనీలు వచ్చి వారు ఎంత మొత్తానికి చేస్తారో నమోదు చేసేవి. ప్రాంగణంలో ఇంటర్‌నెట్ అవసరాలను బట్టి తక్కువ మొత్తాన్ని సౌకర్యం కల్పించే సంస్థకు బాధ్యతలు అప్పగించాలి. ఇదేం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విషయాన్ని గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదించిందంటూ అసలు టెండర్లే లేకుండా ఓ కంపెనీకి అప్పగించేశారు.

**నియంతృత్వ పోకడలా?**

టెండర్లు లేకుండా కాంట్రాక్టు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తే గవర్నింగ్ కౌన్సిల్‌కు ఏదైనా చేసే హక్కు ఉందని వాదిస్తున్నారు. జీవోలను సైతం ధిక్కరించి నిర్ణయాలు తీసుకునే అర్హత తమకు ఉందని చెబుతున్నారు. దీనిపై ట్రిపుల్ ఐటీ వీసీ ఎం విజయకుమార్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కంటితుడుపుగా పోషణ పక్వాడా

అనంతపురం : పోషణ లోపం.. ఆరోగ్య రుగ్మతలు.. తదితర వాటిపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'పోషణ పక్వాడా' పక్షోత్సవం తూతూమంత్రంగా నిర్వహించారు. రెండు వారాల పాటు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ప్రచార కార్యక్రమాలన్నీ క్షేత్ర స్థాయిలో కంటితుడుపు సాగించడం విమర్శలకు దారి తీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్నీ నిధులు కేటాయించినా అధికార యంత్రాంగం శ్రద్ధ పెట్టలేదు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో అధ్వానంగా జరగడం గమనార్హం. ఈనెల 8 నుంచి 22 వరకు పోషణ పక్వాడాపై విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉన్నా రెండు జిల్లాల పీడీలు, అత్యధిక శాతం సీడీపీఓలు కనీస దృష్టి సారించలేదు. కొందరు సూపర్‌వైజర్లు తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. ఇందులో లబ్ధిదారుల హాజరు నామమాత్రమే. శ్రీసత్యసాయి జిల్లాతో పోల్చితే అనంత జిల్లాలో అధ్వానంగా మారింది. అతి తక్కువ మంది సీడీపీఓలు అడపాదడపా వస్తున్నా... జిల్లా అధికారులు హాజరైన దాఖలాలే లేవు. చాలా చోట్లా సూపర్‌వైజర్లే



అన్నీ తానై జరిపారు.

**రూ.10 లక్షలకుపైగా నిధులు**

పోషణ పక్వాడ మాసోత్సవ నిర్వహణకు రెండు జిల్లాలకు కలిపి రూ.10 లక్షలు పైగా కేంద్ర నిధులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 23 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉంటే.. 5126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పాత ప్రాజెక్టుల ఆధారంగా ఒకో ప్రాజెక్టుకు రూ.40వేల నుంచి రూ.50వేలు దాకా ప్రచారానికి కేటాయించినట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయిలో ముగింపు భారీగా జరపాలని నిర్ణయించినా ఎక్కడా కానరాలేదు. పుట్టపర్తిలో ఓ చిన్నసభ పెట్టి ముగించారు. అనంత జిల్లాలో ముగింపు ఉత్సవాలు ఊసేలేవు. ప్రతి ప్రాజెక్టులో రెండు బ్యానర్లు రాయించి.. అన్ని కేంద్రాలకు వాటినే తిప్పారు. లబ్ధిదారుల గైర్హాజరు కాగా. నిర్దేశిత సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీలు హాజరై సమావేశాలు నిర్వహించి మమ అనిపించారు. అనంత గ్రామీణ మండలం రాచానాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ముగింపే నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కనిపించింది.

# బిందుసేద్యం.. అనంత ఆదర్శం

అనంతపురం: అనంత రైతులు సాగునీటి వినియోగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. బిందుసేద్యం ద్వారా ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నుంచి పెద్దఎత్తున ప్రోత్సాహం లభిస్తుండటంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బిందుసేద్యం అమలులో దేశంలోనే అనంతపురం జిల్లా రెండో స్థానంలో నిలిచింది. దీంతోపాటు 17 వేల హెక్టార్లను కొత్తగా బిందు సేద్యం కిందకు తీసుకొచ్చి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో బిందుసేద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం గతేడాది పెద్దఎత్తున లక్ష్యాలు విధించి బిందుసేద్యం అమలయ్యేలా చర్యలు తీసుకుంది.

వైకాపా ప్రభుత్వంలో రెండున్నరేళ్లు పథకాన్ని అమలు చేయలేదు. మరో రెండున్నరేళ్లు అరకొరగా పరికరాలు అందజేశారు. దీంతోపాటు రాయితీని 90 శాతం నుంచి 70 కుదించారు. మొత్తం 26 కంపెనీలకు కాంట్రాక్టు ఇచ్చారు. రైతులు మెచ్చిన కంపెనీల నుంచి కాకుండా ప్రభుత్వానికి అనుకూలమైన వాటి నుంచే పరికరాలు అందించారు. నాణ్యతగా లేకపోవడంతో చాలామంది రైతుల డీడీలు చెల్లించినా పరికరాలు తీసుకోవడానికి ముందుకు రాలేదు.

కూటమి ప్రభుత్వంలో రైతులు ఏది కోరుకుంటే ఆ కంపెనీ నుంచే పరికరాలు అందిస్తున్నారు.

బకాయిలు సైతం ఎప్పటికప్పుడు చెల్లిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పరికరాల అమరిక వేగవంతంగా సాగుతోంది.

2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి 10 ఎకరాలలోపు రైతులకు 90 శాతం రాయితీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

**2.49 లక్షల హెక్టార్లలో..**

విభజిత అనంతపురం జిల్లాకు సంబంధించి 2003 నుంచి 2024 వరకు 2,07,191 మంది రైతులకు 2.49 లక్షల హెక్టార్లలో బింద్యు సేద్యం అమలు చేశారు. 2024-25 గాను 18,000 హెక్టార్ల లక్ష్యం విధించగా.. 17,642 హెక్టార్లలో సాధించారు. గతేడాది మొత్తం 14,869 మంది రైతులకు సూక్ష్మసేద్యం పరికరాలు మంజూరు చేశారు.

# చేబ్రోలులో డయేరియా లక్షణాలు..

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డయేరియా లక్షణాలతో నాలుగు రోజులుగా సుమారు 60 మంది చికిత్స పొందారు. స్థానిక పీహెచ్‌సీకి 48 మంది రాగా మిగిలినవారు ప్రైవేటు ఆసుపత్రులు, పీఎంపీ, ఆర్‌ఎంపీల దగ్గర వైద్యం చేయించుకున్నారు. చేబ్రోలులోని రథంబాట, మట్లవారివీధి, కొత్తపేట ప్రాంతాలకు చెందినవారు అధికంగా వైద్యం పొందారు. ఇతర ప్రాంతాలు, స్థానికంగా జరిగిన ఫంక్షన్లలో భోజనాలు చేసినవారు ఎక్కువగా డయేరియా లక్షణాలతో తమ వద్దకు వచ్చినట్లు చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్ తెలిపారు. ఈనెల 19 నుంచి పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చారన్నారు. బాధితులను



పరీక్షించగా డయేరియా లక్షణాలు లేవని, ఆహారంలో మార్పు వల్ల విరేచనాలైనట్లు గుర్తించామన్నారు. విరేచనాలతో ఆరుగురు మాత్రమే వచ్చారన్నారు. స్థానిక మూడు సచివాలయాల పరిధిలో ఆరు తాగునీటి నమూనాలు సేకరించి ప్రయోగశాలలో పరీక్షించినట్లు పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. చేబ్రోలులో చేపలు, మాంసాహార విక్రయాలు నిలిపివేశామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్, తహసీల్దారు సత్యనారాయణ చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జడ్పీటీసీ సభ్యుడు నాగలోవరాజు, పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు జయకృష్ణ ఆరా తీశారు.

# స్థలాలు కాజేసి.. జేబులు నింపేసి



కదిరి : రాష్ట్ర ప్రభుత్వం పేద భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను తమ హస్తగతం చేసుకున్న కొందరు భవన నిర్మాణ కార్మిక నాయకులు ఇష్టానుసారంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. కార్మికులకు స్థలాలు దక్కకుండా చేశారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్దేశం నీరుగారింది. దీనిపై లబ్ధిదారులు ఆందోళనబాట పట్టడంతో రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. కదిరి - హిందూపురం రహదారి పక్కన 2007లో భవన నిర్మాణ కార్మికులకు సర్వే నం: 1769, 1770లోని 7.95 ఎకరాల భూమిని కేటాయించి 323 మందికి పట్టాలు మంజూరు చేశారు. ఎక్కువ మందికి పట్టాలిచ్చిన ప్రదేశం బండరాళ్లు, గుట్ట ఉండటంతో అప్పట్లో లబ్ధిదారులు చదును చేసుకోవడానికి ముందుకు రాలేదు. రెవెన్యూ అధికారుల నుంచి పట్టాలన్నింటినీ తీసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొందరు తమవద్దే పెట్టుకున్నారు. ఈ ప్రాంతంలో 2014 - 16 మధ్య కాలంలో ఆర్‌డీఓ, డీఎస్పీ కార్యాలయాలు నిర్మిం చడంతో భూముల ధరలు పెరిగాయి. ఈ క్రమంలో నాయకులు కొందరు పట్టాలకు ధర కట్టి విక్రయించడం మొదలు పెట్టారు. కార్మికులకు కేటాయించిన స్థలాన్ని కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు ప్రారంభించారు. దీంతో తమకు స్థలాలు చూపాలంటూ కార్మికనాయ కుడిని కార్మికులు నిలదీశారు. ఇళ్ల స్థలాల పట్టాలు పొందడానికి డబ్బులు ఖర్చు పెట్టానని, డబ్బులిస్తేనే పట్టాలు ఇస్తానంటూ సదరు నాయకుడు వాయిదా వేస్తూ వచ్చారు. డబ్బులు ముట్టజెప్పిన వారికి ఆయన స్థలాలు చూపడంతో నిర్మాణాలు చేపట్టారు. 2007 పట్టాలు మంజూరైన 323 మంది లబ్ధిదారులు తహసీల్దారు, ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు జరిగిన అన్యాయాన్ని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. స్పందించిన రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. మూడు వారాలపాటు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు.

**అర్హులు పది శాతంలోపే..?** 2007లో పట్టాలు మంజూరైన లబ్ధిదారుల్లో ప్రస్తుతం 10 శాతం మందికి మాత్రమే స్థలాలు చూపారు. మిగతావన్నీ అనర్హులకు అమ్ముకున్నారని భవన నిర్మాణ కార్మికులు విచారణ అధికారుల ఎదుట వాపోయారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సర్వే నం: 1769, 1770లోని 7.95 ఎకరాలతోపాటు ఆ భూమికి ఆనుకుని ఉన్న కొండను చదును చేసి పట్టాలు విక్రయించేశారు. సమీపంలోని జగనన్న కాలనీకి వెళ్లే మార్గానికి పడమర వైపున ఉన్న కొండను దళారులు కొలతలు వేసి అమ్మేసినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం 323 మందికి పట్టాలు కేటాయిస్తే.. ప్రస్తుతం ఐదు వందలకుపైగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలపై రోజూ ఫిర్యాదులు అందుతున్నా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**చర్యలు తీసుకుంటాం- వీవీఎస్ శర్మ, ఆర్‌డీఓ, కదిరి**

భవన నిర్మాణ కార్మికులకు మంజూరు చేసిన పట్టాల విషయంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, కార్మికుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ సిబ్బంది చేత విచారణ చేయించాం. విచారణ అధికారులు ఇచ్చిన నివేదిక జిల్లా కలెక్టర్ పంపాం. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశానుసారం బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తప్పవు.

# అనర్హుల ఏరివేత.. అర్హులకు చేయూత




తిరుపతి : పేదలు, అభాగ్యులకు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛను కోసం పలువురు అర్హులు నిరీక్షిస్తుండగా, అనర్హులు అనేక మంది అప్పనంగా పింఛను తీసుకుంటున్నారు. వైకాపా హయాంలో పార్టీల ముద్ర వేసి పలువురు అర్హులకు పింఛను తొలగించగా, అనర్హులకు మంజూరు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనర్హుల ఏరివేత ప్రారంభించింది. వీరి స్థానంలో అర్హులైన వారు, గతంలో పింఛను తీసుకుంటూ వైకాపా ప్రభుత్వంలో అర్హత ఉన్నా రద్దయిన వారికి పునరుద్ధరించాలని నిర్ణయించింది. జులై నుంచి కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

**పునఃపరిశీలన తరువాత**

గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ తమకు పింఛను కావాలని 61,836 మంది దశల వారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు ఎక్కువగా ఉన్నారు. వీరిలో కొత్తగా అర్హత సాధించిన వారు, సాంకేతిక కారణాలతో పింఛను రద్దయిన వారు, ఉద్దేశ పూర్వకంగా వైకాపా నాయకుల సిఫార్సుతో పింఛను తొలగించిన వారూ ఉన్నారు. దరఖాస్తుల పునఃపరిశీలన తర్వాత అర్హులకు కొత్త పింఛన్లు, రద్దయిన వారికి పింఛను పునరుద్ధరించనున్నారు.

**భారీగా బోగస్ పత్రాలు..**

వైకాపా హయాంలో దివ్యాంగుల కేటగిరీలో బోగస్ సదరం ధ్రువపత్రాలు ఇబ్బడిముబ్బడిగా జారీ అయ్యాయి. కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరుకు ముందే వాటిని రీ అసెస్‌మెంట్ చేయించాలని సదరం శిబిరాలు నిర్వహిస్తోంది.

**రూ.15 వేల పింఛనులో 50 శాతం అనర్హులు**

తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలతో మంచానికే పరిమితమై వారు చిత్తూరు జిల్లాలో 1,932 మంది, తిరుపతి జిల్లాలో 1,180 మంది నెలకు రూ.15 వేలు పింఛను తీసుకుంటున్నారు. వీరిలో చాలామంది లేచి నడవగలుగుతున్నా మంచానికే పరిమితమైనట్లు పింఛను తీసుకుంటున్నారనే ఆరోపణలతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించింది. అందులో 50 శాతం మందికి పైగా అనర్హులుగా విచారణలో గుర్తించారు.

**1,874 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు..**

కుటుంబంలో పింఛను తీసుకుంటున్న భర్త మరణిస్తే ఆయన భార్యకు జాప్యం లేకుండా పింఛను (స్పౌజ్ పింఛను) అందించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. 2023 డిసెంబరు 1 నుంచి స్పౌజ్ కేటగిరీ పింఛను మంజూరు చేయాలని నిర్ణయించింది. మేలో దరఖాస్తులు తీసుకుని జూన్ 1 నుంచి పింఛను ఇవ్వనున్నారు. ఈ కేటగిరీలో చిత్తూరు జిల్లాలో 488 మంది, తిరుపతి జిల్లాలో 1,386 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# వైకాపా నిర్వాకం..అంతా బీడుమయం



తాడిపత్రి : పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు జలాశయం నుంచి తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను కలిపే వరద కాలువ నిర్మాణ పనులు ఏళ్లుగా నానుతూనే ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ విధ్వంస పాలనలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. 1.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన చాగల్లు జలాశయం పైప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే చాలు నిండుకుండను తలపిస్తుంది. ఆపైన వచ్చే వరదను ఏటా పెన్నానదికి వదలాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

**50 శాతం పూర్తి చేసినా..**

వరద నీటిని సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలు పెంపొందించడంతో పాటు రైతుల కష్టాలను తీర్చేందుకు 2018లో తెదేపా ప్రభుత్వం కాలువ నిర్మాణం చేపట్టింది. సుమారు 30 వేల ఎకరాలకు నీరు అందించాలన్నది లక్ష్యం.

**ఈనేపథ్యంలో సుమారు**

రూ.22 కోట్లతో చాగల్లు జలాశయం నుంచి పుట్లూరు మండలంలోని కొండాపురం వద్ద ఉన్న తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను కలుపుతూ 11 కి.మీ. మేర నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 2019 నాటికి 50 శాతం పనులు పూర్తి చేశారు. అనంతరం వైకాపా అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పొలాలు బీళ్లుగా మారాయి. గతేడాది ఎన్నికల ముందు హడావుడిగా పనులు ప్రారంభించినా గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆగిపోవడం గమనార్హం.

**సాగుతోపాటు తాగునీరు..**

కాలువ నిర్మాణం పూర్తయితే పెద్దపప్పూరు మండలంలోని షేక్‌పల్లి, నామనాంకపల్లి, అమ్మలదిన్నె, జేకొత్తపల్లి, తాడిపత్రి మండలం, పుట్లూరు మండలంలోని పలు గ్రామాల పరిధిలో సాగు, తాగునీటి కష్టాలు

తీరుతాయి.

**మిగిలిన పనులు చేయిస్తాం- హరినాథ్, హెచ్చెల్సీ ఏఈ**

పాత ధరలతో నిర్మాణ పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. సమస్యను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారం అయిన వెంటనే పనులు చేపడతాం.

# రూ.5.. 20 లీటర్ల నీరు

కర్నూలు : పల్లె ప్రజలకు శుద్ధిచేసిన నీటిని అందించే ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం పునరుద్ధరణపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా పథకాన్ని 'నీరు'గార్చింది. బకాయిలు చెల్లించకపోవడంతో గుత్తేదారుడు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దీనిపై దృష్టి సారించింది. గుత్తేదారులు చెల్లించిన బ్యాంకు గ్యారెంటీ సొమ్ము రూ.32 లక్షలతో పునరుద్ధరించేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే బనగానపల్లి నియోజకవర్గం కొలిమిగుండ్లలో అందుబాటులోకి తీసుకొచ్చారు.




ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మండలంలో 24 చోట్ల శుద్ధి జలాలు అందే ఏర్పాట్లు చేశారు. గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో నీరు గారింది. పథకం పని చేసి ఉంటే రూ.5.. 20 లీటర్ల నీరు దొరికేది.. పథకం నీరు గారడంతో వర్క్కురులో రూ.30 చెల్లిస్తే తప్ప 20 లీటర్ల నీరు దొరకడం లేదు.

మండలాలు: 8
గ్రామాలు: 211
ప్రజలు: 3,48,896
ఇచ్చే నీరు: 20 లీటర్లు (రూ.5)
ప్రాజెక్టు ఖర్చు: రూ.14.25
ఎనిమిది మండలాల్లో

ఫ్లోరైడ్ ప్రభావిత పల్లెలు, మంచినీటి వనరులు లేని గ్రామాల్లోని ప్రజలకు శుద్ధి చేసిన నీరు ఇవ్వాలని గత తెదేపా హయాంలో నిర్ణయించారు. కోడుమూరు, తుగ్గలి, కృష్ణగిరి, వెల్దుర్తి, కౌతాళం, నందవరం కొలిమిగుండ్ల, నందికొట్కూరు మండలాల్లోని పలు గ్రామాలకు నీరు ఇవ్వాలని కర్నూలు జిల్లాలో 6, నంద్యాలలో రెండు చోట్ల ఆర్వో ప్లాంట్లు నిర్మించారు.

మండల కేంద్రంలోని మదర్ ప్లాంటులో గంటకు పది వేల లీటర్ల నీరు శుద్ధి చేసే యంత్రాలు బిగించారు. అక్కడ శుద్ధి చేసిన నీటిని రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. ఆర్‌డీయూల ద్వారా రూ.2కు 20 లీటర్ల శుద్ధ జలం అందించాలి. 2021లో పనులు పూర్తి చేసి ప్రజలకు స్వచ్ఛ జలాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

**పేరు మార్చి 'నీరు'గార్చిన వైకాపా** 2021 జులై నుంచి 2026 జులై వరకు ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత గుత్తేదారుకే సంబంధమంటూ కాంట్రాక్టు ఒప్పందంలో ఉంది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా వైఎస్సార్ సుజల పథకంగా పేరు మార్చిందే తప్పు.. పైసా విడుదల చేయలేదు. గుత్తేదారుకు నగదు చెల్లించలేదు. నిర్వహణదారుడికి వైకాపా బకాయిలు చెల్లించకపో వడం నిర్వహణ భారం పెరగడంతో ఏడాదిన్నర తర్వాత గుత్తేదారు తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. విలువైన పరికరాలు దొంగలెత్తుకుపోయారు..

# నిధులు బొక్కేశారు.. కక్కించేదెప్పుడో..?

సీతానగరం : గత వైకాపా పాలనలో కొన్ని పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరగ్గా, ఆడిట్ నివేదికలు బయటకు రాకుండా ప్రజాప్రతినిధులు అడ్డుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విచారణ వేగవంతం చేసింది. అధికారుల విచారణలో పలుచోట్ల అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.

**అక్రమాలపై విచారణ..**

సీతానగరం మండలం రఘుదేవపురం మేజర్ పంచాయతీలో రూ.1.03 కోట్లు దుర్వినియోగం అయినట్లు జిల్లా ఆడిట్ అధికారులు గుర్తించారు. ఇంటి పన్ను వసూళ్లలో రూ.26 లక్షలు మింగేశారు. ముగ్గురు కార్యదర్శులు, బిల్ కలెక్టర్, సర్పంచి.. ఎవరు ఎంత తినేశారనే లెక్కలతో సహా అధికారులు నివేదిక ఇచ్చారు. ఉద్యోగులను సస్పెండ్ చేశారే తప్ప నయాపైసా రికవరీ చేయలేదు.

కడియపులంక, దుళ్ల పంచాయతీల్లో నిబంధనలు పట్టించుకోకుండా నిధులను ఖర్చు చేయడంతో అప్పటి కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఎంబుక్ ప్రకారం చేసిన పనులు వాస్తవంగా లేవనేది అభియోగం. అచ్యుతాపురం పంచాయతీలో చేసిన పారిశుద్ధ్య పనులకు, పెట్టిన బిల్లులకు పొంతన లేదని విచారణలో గుర్తించారు.


వేమగిరి పంచాయతీలో రూ.లక్షల బిల్లులు పెట్టడంపై రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ విచారణకు ఆదేశించడం గమనార్హం. నిధుల దుర్వినియోగంపై అప్పటి కార్యదర్శిని సరెండర్ చేశారు. కోరుకొండ మండలం బుచ్చింపేటలో చేయని పనులకు వోచర్లు పెట్టారనే దానిపై ఎంబుక్ రికార్డు ప్రకారం విచారణ పూర్తిచేశారు. కడియపులంక పంచాయతీ కార్యదర్శి మద్యం తాగి విధులకు వస్తూ పాలనాపరమైన వ్యవహారాల్లో దురుసుగా ఉంటున్నారని విచారణ చేసి అప్పట్లో విధుల నుంచి తొలగించారు. అప్పటి నేతలు అదే కార్యదర్శికి బిక్కవోలు మండలంలో పోస్టింగు ఇప్పించారు.

**నలుగురు కార్యదర్శుల సస్పెన్షన్**

జిల్లాలో వివిధ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే నలుగురు కార్యదర్శులతోపాటు ఒక బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేశాం. రఘుదేవపురం పంచాయతీలో నిధులను రికవరీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. ఆరోపణలు వచ్చిన చోట విచారణ చేస్తూ, ఆయా పంచాయతీల్లో ఈవోపీఆర్డీ, ఎంపీడీవోలు కౌంటర్ సైన్ చేసేలా ఆదేశాలిచ్చాం. శాంతామణి, డీపీవో

## నభా నటేశ్.. పొట్టి నిక్కరులో కిర్రాక్ లుక్స్

టాలీవుడ్ లో తనదైన స్టైల్ తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నభా నటేశ్, తాజాగా తన గ్లామరస్ లుక్స్ తో మరోసారి సోషల్ మీడియాలో సంచలనం రేపింది. తెలుగులో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను ఏర్పరచుకున్న నభా, గ్లామర్ పరంగా ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్స్‌ను సెట్ చేస్తూ ముందుకు సాగుతోంది. 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో స్టార్ స్టేటస్ అందుకున్న ఈ అందాల భామ, ఇటీవల కొన్ని గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేసేస్తోంది. తాజా ఫోటోషూట్ లో నభా నటేశ్ వైట్ క్రాప్ టాప్, లూస్ షార్ట్స్ లో స్టన్నింగ్ లుక్‌తో దర్శనమిచ్చింది. కిచెన్ వాతావరణంలో తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ఫోటోషూట్ చేయించుకుంది. చేతిలో కోల్డ్ డ్రింక్, టేబుల్ మీద పిజ్జా ఉండటంతో ఫోటోలకు ప్రత్యేకమైన అర్థం వచ్చి పడింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నభా స్టైల్ సెన్స్ గురించి ఫ్యాన్స్ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఈ



క్యాజువల్ లుక్ లోనూ ఎంతో స్టన్నింగ్ గా కనిపించడం గమనార్హం. ఈ ఫోటోషూట్ లో ఆమె గ్లామర్ హైలైట్ అవ్వడమే కాకుండా, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో మరింత మేజిక్ క్రియేట్ చేసింది. కొందరు నెటిజన్లు "నభా ఈజ్ బ్యాక్" అంటూ కామెంట్స్ పెడుతుండగా, మరికొందరు ఆమె మరిన్ని టాలీవుడ్ ప్రాజెక్ట్స్ చేయాలని కోరుతున్నారు. గతంలో నభా 'ఇస్మార్ట్ శంకర్' తో సంచలనం రేపినా, అనంతరం అనుకున్నంత పెద్ద హిట్లు అందుకోలేకపోయింది. అయితే తన గ్లామర్ గేమ్ లో ఎప్పటికప్పుడు కొత్త లెవల్స్ కు వెళ్లి ట్రెండ్ సెట్టర్ గా మారుతోంది. నభా నటేశ్ ప్రస్తుతం స్వయంభూ మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అలాగే ఒక స్టార్ సరసన నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు చిత్రాలు నభా కెరీర్ కి మళ్లీ మంచి ఊపును తీసుకురావొచ్చని అభిమానులు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో తన లుక్స్ తో నిత్యం ట్రెండింగ్ లో ఉండే నభా, మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ లో నటిస్తుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి, నభా నటేశ్ తాజా ఫోటోషూట్ గ్లామర్, స్టైల్ మరియు ఎక్స్‌ప్రెషన్స్ పరంగా మైండ్ బ్లోయింగ్ గా ఉందనే చెప్పాలి.

## ప్రొడ్యూసర్ నిహారిక సెకండ్ మూవీ కన్ఫర్మ్ అయినట్టేనా

మెగా తనయ, నాగ బాబు కూతురు నిహారిక ముందు యాంకర్ గా ఇండస్ట్రీకి పరిచయమైంది. తర్వాత ముద్దపప్పు ఆవకాయ వెబ్ సిరీస్ తో నటిగా, నిర్మాతగా మారి మంచి పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత ఒక మనసు సినిమాతో హీరోయిన్ గా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. కానీ ఒక మనసు సినిమా అనుకున్న స్థాయిలో ఆడలేదు. తర్వాత కూడా నిహారిక హీరోయిన్ గా పలు సినిమాలు చేసింది కానీ అవేమీ తనను స్టార్ హీరోయిన్ గా నిలబెట్టలేకపోయాయి. ప్రస్తుతం నటిగా సినిమాలు చేస్తూనే మరోవైపు నిర్మాతగా కూడా సినిమాలు నిర్మిస్తోంది. ముద్దపప్పు ఆవకాయ వెబ్ సిరీస్ ను నిర్మించిన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ లోనే నిహారిక సినిమాలు, సిరీస్‌లు నిర్మిస్తోంది. ఇప్పటికే పలు సిరీస్‌లు నిర్మించిన మెగా డాటర్ నిహారిక గతేడాది కమిటీ కుర్రోళ్లు సినిమాతో పూర్తి స్థాయి సినీ నిర్మాతగా మారి భారీ హిట్ అందుకుంది. ఆ సినిమాతో నిహారిక ఇండస్ట్రీకి చాలా మంది కొత్త టాలెంట్ ను పరిచయం చేసింది. చిన్న సినిమాగా వచ్చిన కమిటీ



కుర్రోళ్లు రూ.50 కోట్లు కలెక్ట్ చేసి భారీ సక్సెస్ ను అందుకుంది. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమా చేయడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. ఆల్రెడీ దానికి సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ మొదలైందని, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ప్రాజెక్టుల్లో ఎంతోకాలంగా అసోసియేట్ గా ఉన్న మానస శర్మ దర్శకత్వంలో నిహారిక రెండో సినిమాను నిర్మించనుందని ఫిల్మ్ నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. మానస శర్మ ఆల్రెడీ ఇదే బ్యానర్ లో క్రియేటివ్ డైరెక్టర్ గా జీ5 కోసం ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ అనే వెబ్ సిరీస్ తో పాటూ డైరెక్టర్ గా సోనీ లివ్ కోసం బెంచ్ లైఫ్ అనే సిరీస్ చేశారు. ఇప్పుడు మానస శర్మ, పింక్ ఎలిఫెంట్స్ బ్యానర్ లో తన మూడవ ప్రాజెక్టును చేయనున్నారు. అయితే ఈ సారి మానస చేస్తుంది వెబ్ సిరీస్ కాదు సినిమానే. నిర్మాతగా నిహారికకు ఇది రెండో సినిమా. మొదటి సినిమాను ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకుని షూటింగ్ నుంచి ప్రమోషన్స్, రిలీజ్ వరకు అన్నీ తానై చూసుకున్న నిహారిక ఈ రెండో ప్రాజెక్టు విషయంలో ఇంకెన్ని జాగ్రత్తలు తీసుకుంటుందో చూడాలి.




## 'రానా నాయుడు' ని జనాలు నమ్మడం లేదా..!



వెంకటేష్, రానా కలిసి నటించిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో మంచి స్పందన దక్కించుకుంది. హిందీ ఇతర భాషల్లో వచ్చిన స్పందన తెలుగు ప్రేక్షకుల నుంచి రాలేదు. అందుకు కారణం వెంకటేష్‌ను తెలుగు ప్రేక్షకులు అలాంటి పాత్రలో చూడలేక పోయారు, వెంకీ నుంచి అలాంటి బూతులు వినలేక పోయారు. రానా ను కూడా తెలుగు ప్రేక్షకులు మరోలా చూడాలని అనుకుంటున్నారు. అందుకే రానా నాయుడు వెబ్ సిరీస్ తెలుగులో ఫ్లాప్ అయింది. అత్యధిక వారాల పాటు నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండ్ అయిన వెబ్ సిరీస్‌గా నిలవడంతో రానా నాయుడుకు సీక్వెల్ తీసుకు రావాలని నిర్ణయించారు. ఇప్పటికే సీక్వెల్ పనులు పూర్తి అయ్యి స్ట్రీమింగ్‌కు సిద్ధం అయింది. రానా నాయుడు సీజన్ 2 స్ట్రీమింగ్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది. వచ్చే నెలలో స్ట్రీమింగ్ కాబోతున్న ఈ వెబ్ సిరీస్‌కి పెద్దగా బజ్ క్రియేట్ కావడం లేదు. టీజర్ విడుదల తర్వాత కూడా జనాలు ఈ వెబ్ సిరీస్ గురించి పెద్దగా మాట్లాడుకోవడం లేదు. ఆ మధ్య రానా మాట్లాడుతూ రానా నాయుడు వెబ్ సిరీస్‌ను ప్రపంచం మొత్తం చూసింది కానీ తెలుగు ప్రేక్షకులు మాత్రం చూడలేదు. మమ్ములను అలా చూడలేక తెలుగు ప్రేక్షకులు రానా నాయుడు ను పక్కన పెట్టారు. అందుకే రానా నాయుడు సీజన్ 2 ను అడల్ట్ కంటెంట్‌కు, బూతు కంటెంట్‌కి దూరంగా ఉండేలా ప్లాన్ చేశామని చెప్పారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ప్రమోషన్ సమయంలో వెంకటేష్ రానా నాయుడు గురించి స్పందించారు. ఆయన మాట్లాడుతూ రానా నాయుడు వెబ్ సిరీస్‌లో బూతులు ఎక్కువ అయిన మాట వాస్తవం. అందుకే తెలుగు ప్రేక్షకులు చూడలేదు. రెండో సీజన్‌లో అలాంటి అడల్ట్ కంటెంట్ ఉండకుండా చూస్తామని చెప్పాడు. వెంకటేష్ మార్క్ సినిమాలను ఇష్టపడే వారు రానా నాయుడు వంటి వెబ్ సిరీస్‌లను అస్సలు ఒప్పుకోరు. అందుకే తెలుగులో సీజన్ 2 కి కూడా పెద్దగా బజ్ క్రియేట్ కావడం లేదు. మొదటి సీజన్ గురించి తెలిసిన ఏ ఒక్కడు కూడా సీజన్ 2 గురించి ఎదురు చూసే పరిస్థితి ఉండదు. రానా, వెంకటేష్‌లు ఇద్దరూ ఈసార బూతులు ఉండవురా బాబోయ్ అంటూ మొత్తుకున్నా కూడా పెద్దగా పట్టనట్లుగానే ప్రేక్షకులు ఉన్నారు. రానా నాయుడు వెబ్ సిరీస్ సీజన్ 2 స్ట్రీమింగ్ అయ్యే వరకు కంటెంట్ గురించి క్లారిటీ వచ్చే అవకాశం లేదు. కనుక ప్రేక్షకులు పెద్దగా ఎదురు చూస్తున్న దాఖలాలు లేవు. తెలుగు హీరోలు కావడంతో ఉత్తరాదిన కూడా ఈ వెబ్ సిరీస్ గురించి పెద్దగా ఎదురు చూపులు లేవు. ఒక వేళ స్ట్రీమింగ్ అయిన తర్వాత కంటెంట్ బాగుంటే మొదటి సీజన్ మాదిరిగా రెండో సీజన్ కూడా అక్కడ విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈసారి బూతులు తక్కువ ఉండి, కంటెంట్ కాస్త డీసెంట్‌గా ఉంటే తెలుగు ప్రేక్షకులు ఆధరించే అవకాశా లు ఉన్నాయి. ఇప్పటి వరకు అయితే రానా నాయుడు డీసెంట్‌గా వస్తాడని ఏ ఒక్కరూ నమ్మకం పెట్టుకుని లేరు. అందుకే క్రేజ్ పెద్దగా క్రియేట్ కాలేదు.

## బీస్ట్ మోడ్ లో శివాత్మిక






హీరోయిన్ అంటే ఎవరైనా సరే తప్పనిసరిగా ఫిట్‌నెస్ మెయిన్‌టెయిన్ చేయాల్సిందే. ప్రస్తుతం సినిమాల్లేవు కదా అని ఇష్టమొచ్చినట్టు తిని కూర్చోడానికి లేదు. అందుకే హీరోయిన్లు ప్రతీరోజూ జిమ్ చేస్తూ తమ బాడీని ఫిట్ గా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. టాలీవుడ్ లో ఎంతోమంది ఫిట్‌నెస్ ఫ్రీక్స్ ఉండగా ఇప్పుడు ఆ లిస్ట్ లోకి యాంగ్రీ హీరో రాజశేఖర్ కూతురు శివాత్మిక కూడా చేరింది. ఆనంద్ దేవరకొండతో కలిసి దొరసాని సినిమాతో వెండితెర అరంగేట్రం చేసిన శివాత్మిక రాజశేఖర్ చివరిగా రంగ మార్తాండలో కనిపించింది.

ఆ సినిమా తర్వాత శివాత్మిక మరో సినిమాను అనౌన్స్ చేసింది లేదు. అయితే శివాత్మిక సిల్వర్ స్క్రీన్ కు దూరంగా ఉన్నప్పటికీ సినీ ఇండస్ట్రీకి మాత్రం దూరం కాలేదు. తాజాగా శివాత్మిక షేర్ చేసిన జిమ్ వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బ్లాక్ షార్ట్, బ్లాక్ కలర్ ఫుల్ స్లీవ్స్ టీ షర్ట్ వేసుకుని శివాత్మిక జిమ్ వీడియోను పోస్ట్ చేస్తూ దానికి ప్రెట్టీ లిటిల్ జిమ్ మర్డర్ అనే క్యాప్షన్ ను రాసుకొచ్చింది. ఈ వీడియోలో శివాత్మిక బీస్ట్ మోడ్ లో బరువులతో స్క్వాట్స్ చేయడం పెద్ద విషయమేమీ కాదన్నట్టు చేసి అందరినీ ఆకర్షించింది. వీడియోలో శివాత్మిక ఎనర్జీ, తన ఫోకస్ అందరినీ తన వైపు తిప్పుకునేలా చేస్తున్నాయి. దాంతో పాటూ లెగ్ మెషీన్ తో మరో క్లిప్ ను కూడా శివాత్మిక దానికి జోడించి జిమ్ లో తను పడే కష్టాన్ని అందరికీ తెలిసేలా చేసింది. అయితే శివాత్మిక జిమ్ వీడియో మనం రెగ్యులర్ గా చూసే బాలీవుడ్ భామల జిమ్ వీడియోలా లేదు.

ఈ వీడియోలో శివాత్మిక ఎలాంటి మేకప్, గ్లామరస్ లుక్ లో కాకుండా పూర్తిగా చెమటలతో కనిపిస్తూ తన పోస్ట్ ను మరింత స్పెషల్ గా మార్చింది.

## శ్రీదేవిలా నటించాలనుంది!

అతిలోక సుందరి శ్రీదేవికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎంతో మంది సెలబ్రిటీలు సైతం ఆమెను అభిమానిస్తుంటారు. రీసెంట్ గా ఓ ఫ్యాషన్ టూర్ లో పాల్గొన్న తమన్నా భాటియాకు ఓ ప్రశ్న ఎదురైంది. ఆన్ స్క్రీన్ పై ఎలాంటి తరహా పాత్రలు పోషించాలనుంది అని అడిగినప్పుడు తమన్నా క్షణం ఆలోచించకుండా వెంటనే శ్రీదేవి పేరు చెప్పింది. శ్రీదేవి 2018లో దురదృష్టవశాత్తూ బాత్ టబ్ లో పడి నీటిలో మునిగి చనిపోయిన విషయం తెలిసిందే. శ్రీదేవిపై తమన్నా తన అభిమానాన్ని ఈ ఈవెంట్ లో వెల్లడించింది. శ్రీదేవి సూపర్ ఐకానిక్ అని, ఆన్ స్క్రీన్ శ్రీదేవిగా నటించాలని కోరుకుంటున్నట్టు తమన్నా తెలిపింది. శ్రీదేవి మేడమ్ ను ఆరాధించే వ్యక్తుల్లో తాను కూడా ఒకరని తమన్నా ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. స్టీరియోటైప్ పాత్రల నుంచి కామెడీ, డ్రామా వరకు ఎన్నో జానర్లలో పలు విభిన్న పాత్రలను పోషించి ఇండియన్ సినీ హిస్టరీలోనే మొదటి మహిళా సూపర్ స్టార్ గా శ్రీదేవి గుర్తింపు



పొందారని తమన్నా చెప్పింది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో శ్రీదేవి 50 సంవత్సరాలకు పైగా వివిధ రంగాల్లో కొనసాగారని, మిస్టర్ ఇండియా, సద్మా, హిమ్మత్ వాలా, ఖుదా గవా, లాడ్లా, ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్ లాంటి గుర్తుండిపోయే సినిమాల్లో శ్రీదేవి నటించారని తమన్నా తెలిపింది. ఇక తమన్నా విషయానికొస్తే అమ్మడు ఆఖరిగా నీరజ్ పాండే దర్శకత్వంలో వచ్చిన సికిందర్ కా ముఖద్దర్ సినిమాలో నటించింది. ఈ సినిమాలో జిమ్మీ షేర్ గిల్, అవినాష్ తివారీ, రాజీవ్ మెహతా మరియు దివ్య దత్తా కీలక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో చేస్తున్న ఓదెల2 త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అశోక్ తేజ దర్శకత్వంలో వస్తున్న ఓదెల2ను సంపత్ నంది కథ అందిస్తూ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తమన్నా నాగ సాధువుగా కనిపించనుంది. ఓదెల2 పై తమన్నా చాలానే ఆశలు పెట్టుకుంది. దానికి తగ్గట్టే రీసెంట్ గా రిలీజైన ఓదెల2 టీజర్ కూడా సినిమాపై అంచనాల్ని పెంచింది.

## శ్రీలీల టర్నింగ్ పాయింట్.. క్లిక్కయితే కోట్ల వర్షమే..

టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కొద్దికాలంలోనే స్టార్ హీరోయిన్ గా మారిన శ్రీలీల, ఇప్పుడు తన కెరీర్ ను మరో లెవెల్ కు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. తన అందం, ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్, గ్రేస్‌ఫుల్ డాన్స్ మూమెంట్స్‌తో సినీ ప్రేమికుల మనసు దోచిన ఈ బ్యూటీ, ఇప్పుడు నేషనల్ లెవల్ లో తన మార్క్ వేసేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే తెలుగు పరిశ్రమలో స్టార్ హీరోల సరసన వరుస సినిమాలు చేస్తూ తన స్థాయిని పెంచుకుంటున్న శ్రీలీల, 2025లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారనుంది. ఈ బ్యూటీ 2025ను ఫుల్ బిజీగా ప్లాన్ చేసుకుంది. ఇప్పటికే తెలుగులో స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తోన్న ఆమె, ఒక సినిమాకు 2 కోట్లకు పైనే డిమాండ్ చేస్తున్నట్లు టాక్. ఇప్పుడు బాలీవుడ్, కోలీవుడ్‌లలోనూ తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకునేందుకు సిద్ధమవుతోంది. అక్కడ కూడా



అమ్మడు అదే రేంజ్ లో అందుకుంటున్నట్టు టాక్. తాజా సమాచారం ప్రకారం, శ్రీలీల బాలీవుడ్ లో కార్తిక్ ఆర్యన్ సరసన ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించనుందని తెలుస్తోంది. ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా, శ్రీలీల హిందీ సినిమాల్లో అడుగు పెట్టనుందన్న వార్త మాత్రం హాట్ టాపిక్ గా మారింది. అంతేకాదు, తమిళ పరిశ్రమ లోనూ ఎంట్రీ ఇవ్వడానికి శ్రీలీల రెడీ అయ్యింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న SK25 సినిమాలో శ్రీలీల కథానాయికగా నటించనుందట. ఈ ప్రాజెక్ట్ ద్వారా కోలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరవ్వాలని శ్రీలీల భావిస్తోంది. ఇప్పటికే ఆమె డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ కి తమిళనాట కూడా అభిమానులు పెరిగిపోతున్నారు. దీంతో అక్కడ కూడా స్టార్ హీరోయిన్‌గా నిలిచేందుకు శ్రీలీలకు ఇదొక మంచి అవకాశం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంతేకాదు, శ్రీలీల మరో బాలీవుడ్ బిగ్ ప్రాజెక్ట్‌లో ఛాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. టాప్ ప్రొడక్షన్ హౌస్ మాడాక్ ఫిలిమ్స్ బ్యానర్ లో రూపొందనున్న సినిమాలో, సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ సరసన నటించే అవకాశముందని టాక్. ఇది నిజమైతే శ్రీలీలకు బాలీవుడ్‌లో మరింత క్రేజ్ రావడం ఖాయం. తెలుగు పరిశ్రమలో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు బాలీవుడ్, కోలీవుడ్‌లలో కూడా తన మార్క్ వేసేందుకు రెడీ అవుతోంది. ఈ విధంగా చూస్తే, శ్రీలీల 2025ను తన కెరీర్ లోనే టర్నింగ్ పాయింట్‌గా మలుచుకునేలా ప్లాన్ చేసుకుంటోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536